ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
ప్రకాశం
జిల్లా వార్తలు
మంగళవారం 20, మే 2025


దర్శి మినీ మహానాడులో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న గొట్టిపాటి లక్ష్మి

టీడీపీకి కొత్త సారథి!

ఒంగోలు పార్లమెంట్ అధ్యక్ష పదవికి పరిశీలనలో ముగ్గురు ఎమ్మెల్యేల పేర్లు

- ఇప్పుడా.. కడప మహానాడు తర్వాత
- ప్రకటిస్తారా అన్నదానిపై ఇంకా రాని స్పష్టత
- ఈ విషయంలో లోకేష్ ప్రత్యేక పరిశీలన
- ఇద్దరు ఇన్‌చార్జిలకు నామినేటెడ్ పోస్టులు

తెలుగుదేశం పార్టీ ఒంగోలు పార్లమెంట్ సారథి మారనున్నారు. ఆ పదవిని మరొకరికి అప్పగించాలని అధిష్ఠానం నిర్ణయించింది. ముగ్గురు ఎమ్మెల్యేల పేర్లను ప్రధానంగా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. వీరిలోనే ఒకరిని ఖరారు చేసే అవకాశం ఉంది. శుక్రవారం నిర్వహిస్తున్న జిల్లాస్థాయి మహానాడులో ప్రకటించాలా? లేక రాష్ట్ర మహానాడు తర్వాతా? అన్నదానిపై తర్జనభర్జన జరుగుతోంది. దీంతోపాటు పార్టీ దర్శి, ఎర్రగొండపాలెం ఇన్‌చార్జిలుగా ఉన్న గొట్టిపాటి లక్ష్మి, గూడూరి ఎరిక్షన్‌బాబులకు నామినేటెడ్ పదవులు ఇచ్చే అంశాన్ని అధిష్ఠానం సీరియస్‌గా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.


దామచర్ల జనార్దన్


ముక్కు ఉగ్రనరసింహారెడ్డి


కందుల నారాయణరెడ్డి

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

టీడీపీ ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడిగా ప్రస్తుతం నూకసాని బాలాజీ ఉన్నారు. ఈ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నామినేటెడ్ పదవులు ప్రకటించిన తొలి జాబితాలోనే ఆయనకు టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పదవిని ఇచ్చి గౌరవించింది. జోడు పదవుల నిర్వహణకు ఆయన సిద్ధంగా ఉన్నప్పటికీ అధిష్ఠానం వేరే విధంగా ఆలోచన చేస్తున్నట్లు తెలిసింది. పార్టీ నిర్మాణం, కార్యకర్తలను గుర్తించడం, గౌరవించడం అన్న అంశాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. ఈ విషయంపై ఆపార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ప్రత్యేక పరిశీలన చేసినట్లు సమాచారం. తదనుగుణంగా నియోజకవర్గాన్ని, జిల్లాను అంటి పెట్టుకొని పనిచేసే వారికే పదవులు అప్పగించే ఆలోచనతో అధిష్ఠానం ఉంది.

పరిశీలనలో దామచర్ల, ఉగ్ర, కందుల పేర్లు

జిల్లాల వారీ మంత్రులు, కార్పొరేషన్ పదవులు ఏఏ సామాజికవర్గాల వారికి దక్కాయి, ఇంకా ఎవరికి నామినేటెడ్ పదవులు లభించే అవకాశాలు ఉన్నాయి అన్న అంశాలను టీడీపీ అధిష్ఠానం పరిగణనలోకి తీసుకుంది. అందుకు అనుగు ణంగా సామాజిక వర్గాల సమన్వయా నికి కూడా ప్రాధాన్యం

మిగతా 6లో...


కొండపి మినీ మహానాడులో మాట్లాడుతున్న మంత్రి స్వామి, పక్కన మారిటైం బోర్డు చైర్మన్ సత్య

కోలాహలంగా..

- టీడీపీ నియోజకవర్గ మినీ మహానాడులు ప్రారంభం
- తొలిరోజు కొండపి, కనిగిరి, దర్శి, మార్కాపురంలో నిర్వహణ
- పార్టీ పటిష్ఠతపై ముఖ్యనేతల దిశానిర్దేశం
- నేడు గిద్దలూరులో మినీ పండుగ
- పలుచోట్ల సైనికులకు మద్దతుగా తిరంగా ర్యాలీల్లో పాల్గొన్న నాయకులు




కనిగిరిలో జ్యోతిప్రజ్వలన చేసి మినీ మహానాడును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర

ఒంగోలు, మే 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో తెలుగుదేశం పార్టీ మినీ మహానాడులు కోలాహలంగా ప్రారంభమయ్యాయి. మొత్తం ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా కొండపి, కనిగిరి, దర్శి, మార్కాపురంలలో సోమవారం వీటిని నిర్వహించారు. పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొన్నారు. నియోజకవర్గ పరిధిలోని గ్రామ, మండల, పట్టణ కమిటీలు, అనుబంధ సంఘాల బాధ్యులతో మినీ మహానాడుల నిర్వహణకు అధిష్ఠానం ఆదేశించగా అలాగే నిర్వహించారు. కొండపి నియోజకవర్గ మినీ మహానాడు కొండపిలో ఏర్పాటు చేశారు. మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి, రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య పాల్గొన్నారు. కనిగిరిలో అక్కడి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, మార్కాపురంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, దర్శిలో అక్కడి టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మిల సారథ్యంలో మినీ మహానాడులు జరిగాయి. గ్రామ, పట్టణాలకు చెందిన ముఖ్య నాయకులంతా ఉత్సాహంగా హాజరయ్యారు. టీడీపీ ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడైన రాష్ట్ర టూరిజం బోర్డు చైర్మన్ నూకసాని బాలాజీ కనిగిరి, దర్శి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గడిచిన 11 మాసాల్లో రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం సాధించిన విజయాలను ఈ సందర్భంగా నాయకులు వివరించారు. విభిన్నవర్గాల ప్రజల కోసం అమలు చేస్తున్న పథకాలను కొనియాడారు. పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయాలని కోరారు. అందుకు కేడర్ ఇంకా చురుగ్గా పనిచేయాలని సూచించారు. మరోవైపు ఆయా నియోజకవర్గాల పరిధిలో శాశ్వత అభివృద్ధి అంశాలు, ప్రజా సమస్యల పరిష్కారంపై పలు తీర్మానాలు చేశారు. జిల్లాలో మిగిలిన నాలుగు నియోజకవర్గాల్లో గిద్దలూరుకు సంబంధించిన మినీ మహానాడు మంగళవారం నిర్వహిస్తున్నారు. వైపాలెంలో, ఒంగోలులో 21న, సంతనూతలపాడు నియోజకవర్గ మినీ మహానాడు 22న నిర్వహించనున్నారు. ఈసందర్భంగా ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా పలుచోట్ల తెలుగు తమ్ముళ్లు భారీ ర్యాలీలు చేపట్టారు.


మార్కాపురం మినీ మహానాడులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందుల



కొండంత సంబరం

ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రమైన శింగరకొండ భక్తజనంతో నిండిపోయింది. జై శ్రీరామ్, జై హనుమాన్ నామస్మరణతో మార్మోగింది. ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో సోమవారం మహాకుంభాభిషేకం, జీవధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ వైభవంగా జరిగాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. మహాకుంభాభిషేకానికి ముందు కలశయాత్ర శోభాయమానంగా సాగింది.

6

విమాన కలశపూజలో మంత్రులు గొట్టిపాటి, డోలా, ఎమ్మెల్యే దామచర్ల

కార్పొరేషన్ స్థలంపై కబ్జా కన్ను

- వీఐపీ రోడ్డులోని జాగా ఆక్రమణ యత్నం
- ఖరీదైన ఖాళీ భూమిలో బోరు తవ్వకం
- విషయం తెలిసి అప్రమత్తమైన అధికారులు
- పోలీసులతో కలిసి వెళ్లి అడ్డుకున్న వైనం
- దురుసుగా ప్రవర్తించిన కబ్జాదారుడు
- పార్కు నిర్మించాలని కోరుతున్న స్థానికులు

7


ఒంగోలులో కార్పొరేషన్ స్థలాన్ని ఆక్రమించి బోరు వేస్తుండగా అడ్డుకుంటున్న అధికారులు, పోలీసులు


ఒంగోలులోని బస్టాండ్ సెంటర్‌లో వాన నీటితో నిండిపోయిన రోడ్డు

వర్షాతిరేకం!

- జిల్లావ్యాప్తంగా జోరువాన
- పలుచోట్ల ఒక మోస్తరు నుంచి భారీగా..
- ఉక్కపోత నుంచి ఉపశమనం
- ఉపాధి పనులకు బ్రేక్
- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు

భానుడి భగభగలతో, ఉడుకెత్తే ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్న జిల్లాపై మేఘాలు వర్షించాయి. రోహిణి కార్తెకు ముందే వాతావరణం చల్లబడటంతో ప్రజల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. నాలుగు రోజులుగా ఏదో ఒక సమయంలో కొన్నిచోట్ల జల్లులు పడుతుండగా సోమవారం తెల్లవారుజాము నుంచి అత్యధిక ప్రాంతాల్లో గట్టివాన కురిసింది. కొన్ని మండలాల్లో ఒక మోస్తరు నుంచి భారీగా పడింది. దీంతో ఎండల తీవ్రత, ఉక్కపోత నుంచి ప్రజలకు ఉపశమనం లభించింది.

ఒంగోలు, మే 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా రెండు వారాల నుంచి ఎండల తీవ్రత పెరిగింది. అధిక ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 41నుంచి 43 డిగ్రీలు నమోదవుతున్నాయి. ఈనెల 25 నుంచి రోహిణికార్తె రానుండటంతో ఎండలు మరింత ముదిరే పరిస్థితి ఉంది. ఇలాంటి సమయంలో మూడు రోజులుగా వాతావరణంలో మార్పు వచ్చింది. బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ప్రభావంతో వర్షాలు ప్రారంభమయ్యాయి. జిల్లాలోని పలు ప్రాంతాల్లో రాత్రి వేళ జల్లులు పడుతున్నాయి. తాజాగా ఆదివారం రాత్రి నుంచి వాతావరణం మరింత మారింది. సోమవారం తెల్లవారుజాము నుంచి చాలాప్రాంతాల్లో వర్షం కురిసింది. తూర్పు, దక్షిణప్రాంత మండలాల్లో ఒక మోస్తరు నుంచి భారీగానే పడింది.

11.70మి.మీ సగటు వర్షపాతం

జిల్లాలో సోమవారం

మిగతా 6లో...

గంజాయిని తరలిస్తున్న ముగ్గురు అరెస్టు

- 2.150 కేజీలు స్వాధీనం

7

పది సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతం

7

విద్యాశాఖ ఉద్యోగుల బదిలీలకు గ్రీన్‌సిగ్నల్

7

వీఆర్వోల పోరుబాట

సమస్యలపై తహసీల్దార్లకు వినతిపత్రాలు


గిద్దలూరు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, మే 19 (ఆంధ్రజ్యోతి) : గ్రామ రెవెన్యూ అధికారులు (వీఆర్వోలు) పోరుబాట పట్టారు. పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని.. గ్రామ, వార్డు సచివాలయాల రేషన్‌లైజేషన్ కారణంగా పెరిగిన పనిభారాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు దశలవారీ ఆందోళనకు దిగారు. అందులోభాగంగా సోమవారం జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో తహసీల్దార్లను కలిసి సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీవో నంబరు 4 ద్వారా గ్రామ, వార్డు సచివాలయాల రేషనలైజేషన్‌తో తమపై పనిభారం పడుతున్నదని వీఆర్వోలు వాపోతున్నారు. రేషనలైజేషన్‌లో మిగిలిపోయిన గ్రామ రెవెన్యూ అధికారులకు నిర్దిష్టమైన విధి విధానాలతో జీవో జారీ చేయాలని, గ్రామ రెవెన్యూ అధికారులను సచివాలయం నుంచి తప్పించి 2019కి పూర్వం ఉన్న రెవెన్యూ క్లస్టర్ విధానంలో మండల తహసీల్దార్ ఆధ్వర్యంలో విధులు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్ర కమిటీ సూచనలకు అనుగుణంగా జిల్లావ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని వీఆర్వోల సంఘ జిల్లా అధ్యక్షుడు వైపీ రంగయ్య తెలిపారు.

గస్తీలో ఉన్న సీఐపై మందుబాబుల దాడి

వివరాలు మెయిన్‌లో

- ఒంగోలులో ఘటన

అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలి



- 'మీకోసం' కార్యక్రమంలో కలెక్టర్ అన్సారియా

7

తరించిన శింగరకొండ క్షేత్రం



విమాన కలశం వద్ద పూజలు చేస్తున్న శృంగేరి పీఠం ఉత్తరాధికారి విదుశేఖర భారతీస్వామి

- శింగరకొండలో పూజలు నిర్వహించిన శృంగేరి పీఠం ఉత్తరాధికారి విదుశేఖరభారతీ
- పాల్గొన్న మంత్రులు రవికుమార్, స్వామి, ఎమ్మెల్యేలు
- పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులు
- శోభాయమానంగా కలశయాత్ర
- అద్దంకి సమీపంలోని గుండ్లకమ్మ నది నుంచి ప్రారంభం
- సుమారు 7 కి.మీ సాగిన యాత్ర
- వర్షంలోనూ ఆగని భక్తులు
- పెద్దఎత్తున అన్నదానం



కలశయాత్రలో ముందుభాగాన నడుస్తున్న గజరాజు

అద్దంకి, మే 19 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో సోమవారం ఉదయం మహాకుంభాభిషేకం జీవధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ వైభవంగా జరిగాయి. బుధవారం నుంచి ఆదివారం వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు, హోమాలు నిర్వహించారు. సోమవారం ఉదయం కృష్ణ యజుర్వేద హవన సహిత మహాకుంభాభిషేకాన్ని శృంగేరిపీఠం ఉత్తరాధికారి విదుశేఖరభారతి ఆయన శిష్యబృందంతో కలిసి నిర్వహించారు. విమాన శిఖర పూజలు, జీవధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ కార్యక్రమాలను చేశారు. మంత్రులు గొట్టిపాటి రవికుమార్, బాలవీరాంజనేయస్వామి,



ప్రసన్నాంజనేయస్వామి

ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, ఇంటూరి నాగేశ్వరరావు, దర్శి టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి, కడియాల లలిత్‌సాగర్ దంపతులు, ఈవో తిమ్మానాయుడు, రిషిత దంపతులు పాల్గొన్నారు. ఉమ్మడి ప్రకాశం, గుంటూరు జిల్లాలతోపాటు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. పెద్దసంఖ్యలో భక్తులు హాజరుకావడంతో దేవాలయం ప్రాంతంలో తిరునాళ్లను మించిన రద్దీ నెలకొంది. సుమారు 40 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నట్లు అంచనా. దేవస్థానం ఆధ్వర్యంలో కాకతీయ కమ్మ సత్రం, వేమారెడ్డి సేవాసమితి, శ్రీరామ వయోవృద్ధుల ఆశ్రమాల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలలో రాతి ముఖ మండపం ప్రధాన దాతలు నలమలపు విజయభాస్కర్‌రెడ్డి, శ్రీదేవి, కోట శ్రీనివాసకుమార్, నాగలక్ష్మి, గుంజి కృష్ణారావు, రమాదేవి, కాట్రగడ్డ అనిల్‌కుమార్, శ్రీవిద్య, జీవధ్వజస్తంభం దాత మేదరమెట్ల శంకరారెడ్డితోపాటు కుమారులు రాజశేఖరరెడ్డి, చంద్రశేఖరరెడ్డి దంపతులు పాల్గొన్నారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహణ ఆలస్యం కావడంతో భక్తులకు స్వామి వారి దర్శనం కల్పించడంలో కొద్దిపాటి జాప్యం జరిగింది. దీంతో కలశయాత్రలో పాల్గొన్న మహిళలు, ఇతర భక్తులు ఎక్కువ సమయం వేచి ఉండాల్సి వచ్చింది. మధ్యాహ్నం 12 గంటల తరువాత భక్తుల రద్దీ మరింత పెరిగింది. సాయంత్రం వరకు కూడా భక్తులు ప్రసన్నాంజనేయస్వామిని దర్శించుకున్నారు. చీరాల డీఎస్పీ మొయిన్, సీఐలు సుబ్బరాజు, మల్లికార్జునరావుల ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.



పట్టువస్త్రాలు సమర్పిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

అద్దంకిలో ఆధ్యాత్మిక శోభ

శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి మహాకుంభాభిషేకం సందర్భంగా కలశయాత్ర సోమవారం శోభాయమానంగా సాగింది. అద్దంకి పట్టణంలోని పాత దర్శి రోడ్డులో గుండ్లకమ్మ నది వద్ద ఉన్న ఊట చలమల నుంచి జలాన్ని సేకరించారు. ఈ కార్యక్రమానికి అద్దంకితోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి రెండువేల మంది వరకూ మహిళలు హాజరయ్యారు. సోమవారం ఉదయం 6 గంటలకు ప్రారంభమైన కలశయాత్ర సుమారు 7 కి.మీ దూరంలో ఉన్న శింగరకొండకు ఉదయం 8.45 గంటలకు చేరింది. వర్షపు జల్లులు కురుస్తున్నప్పటికీ మహిళలు లెక్కచేయకుండా ముందుకుసాగారు. యాత్ర సాగుతున్నంతసేపు వీధులన్నీ శ్రీరామ, ఆంజనేయ నామస్మరణతో మార్మోగాయి. కలశయాత్రకు ముందు భాగంలో గజరాజు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఏనుగుపై శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం పూజారి శ్రీరామచంద్రమూర్తి కలశంతో ఆశీనులయ్యారు. కేరళ కళాకారుల డప్పు వాయిద్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. యాత్రకు ఆటంకం లేకుండా నామ్‌రోడ్డులో ట్రాఫిక్‌ను మళ్లించారు. గుండ్లకమ్మ నదిలో ప్రత్యేక పూజలలో కోట శ్రీనివాసకుమార్, నాగలక్ష్మి దంపతులు, చుండూరి మురళీసుధాకర్, ఖాళీ ప్రసన్న దంపతులు, రమాసుందరి తదితరులు పాల్గొన్నారు.

వర్షాతిరేకం

(5వ పేజీ తరువాయి)

ఉదయానికి 24 గంటల వ్యవధిలో సగటున 11.70 మి.మీ వర్షపాతం నమోదైంది. గరిష్ఠంగా కొత్తపట్నం మండలంలో 56.40 మి.మీ కురిసింది. ఒంగోలులో 42.60, పొదిలి మండలంలో 36.20, కొండపిలో 34.40, జరుగుమల్లిలో 32.80, టంగుటూరులో 24.80, తాళ్లూరులో 20.80 మి.మీ వర్షపాతం నమోదైంది. నాగులుప్పలపాడు, సింగరాయకొండ, వెలిగండ్ల, మర్రిపూడి, పొన్నలూరు, కొమరోలు, సంతనూతలపాడు, దర్శి తదితర మండలాల్లో ఒక మోస్తరు జల్లులు పడ్డాయి. తిరిగి సోమవారం పగటి పూట చాలా ప్రాంతాల్లో తెరిపి లేకుండా జల్లులు పడుతూనే ఉన్నాయి. సోమవారం సాయంత్రం నాలుగు గంటల సమయానికి ఎన్‌జీపాడు మండలంలో 33.50 మి.మీ, కొండపిలో 31.75, జరుగుమల్లిలో 31.0, కేకేమిట్లలో 27.4, ఒంగోలులో 23.0, దర్శిలో 20.0, కనిగిరిలో 16.5, చీమకుర్తిలో 15.50 మి.మీ వర్షం కురిసింది.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు

ఒంగోలు కలెక్టరేట్, మే 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పరిస్థితిని పర్యవేక్షిస్తూ ప్రజలకు అవసరమైన సహాయం అందించేందుకు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. దీనికి టోల్ ఫ్రీ నంబర్ 1077ను కేటాయించారు. ఈనెల 23వ తేదీ వరకు ఇది నిరంతరాయంగా పనిచేస్తుంది. రెవెన్యూ, పోలీసు, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్, పశుసంవర్ధక, వైద్య సిబ్బందితో రెండు బృందాలను ఏర్పాటు చేసి ఇక్కడ నియమించారు. ప్రతి 12 గంటలకు ఒక బృందం పనిచేస్తుంది. వర్షాల కారణంగా మండల, డివిజన్ స్థాయి అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. మండల, డివిజన్ స్థాయిలో కూడా కంట్రోల్ రూంలను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయంతోపాటు పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా సత్వర చర్యలు తీసుకోవాలన్నారు.

జనజీవనానికి ఆటంకం

అనేక ప్రాంతాల్లో సోమవారం తెల్లవారుజాము నుంచే వర్షం ప్రారంభమవడం, పగటి పూట కూడా తెరిపి లేకుండా విడతల వారీగా జల్లులు పడుతుండటంతో జనజీవనానికి ఆటంకం ఏర్పడింది. కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు, వీధి వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఒంగోలు నగరంలోని ప్రధాన రోడ్లన్నీ జలమయమయ్యాయి. పలు ప్రధాన రహదారులపై వర్షపు నీరు ప్రవహించింది. కాలువల్లో మరుగు రోడ్లపైకి చేరడంతో రాకపోకలకు ప్రజలు ఇక్కట్లు పడ్డారు.

451 పంచాయతీల్లో నిలిచిన ఉపాధి పనులు

జిల్లాలో ముమ్మరంగా సాగుతున్న ఉపాధి హామీ పథకం పనులకు తాజా వర్షంతో బ్రేకులు పడ్డాయి. 729 పంచాయతీల్లో రోజువారీ 2లక్షల 20వేల మంది వరకు కూలీలు పనులకు హాజరవుతున్నారు. వర్షం కారణంగా సోమవారం 451 పంచాయతీల్లో పనులు నిలిచిపోయాయి. కేవలం 278 పంచాయతీల్లో మాత్రమే చేపట్టగా 70వేల మంది కూలీలు హాజరయ్యారు మరో రెండు, మూడు రోజులు ఇలాంటి వాతావరణం కొనసాగవచ్చని సమాచారం.

టీడీపీకి కొత్త సారథి!

(5వ పేజీ తరువాయి)

ఇస్తూ పార్టీ పార్లమెంట్ అధ్యక్షుడిని ఎంపిక చేయాలని నిర్ణయించు కున్నట్లు తెలిసింది. ఆ పదవికి సంబంధించి ఒంగోలు, కనిగిరి ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి పేర్లు పరిశీలనలో ఉన్నాయి. అవకాశం ఇస్తే తానూ అధ్యక్ష బాధ్యతలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నానని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి అధిష్ఠానంకు సంకేతం ఇచ్చినట్లుగా తెలిసింది.

జిల్లాను అంటిపెట్టుకుని ఉండే వారికే ఇవ్వాలని యోచన

రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్‌లుగా ఉన్న వారికి ఇతరత్రా బాధ్యతలను దృష్టిలో ఉంచుకొని జిల్లాలోనే ఉంటూ ఏదైనా అధికారిక పదవిలో ఉన్న వారిని ఎంపిక చేస్తే వివిధ రకాలుగా కలిసొస్తుందని టీడీపీ అధిష్ఠానం భావించినట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు పార్టీలో సీనియర్‌గా ఉన్న దామచర్ల జనార్దన్‌ను రాష్ట్రస్థాయి పదవిలో కొనసాగిస్తూ కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డికి పార్లమెంట్ అధ్యక్ష పదవిని కట్టబెట్టే ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. మంత్రి లోకేష్ వద్ద డాక్టర్ ఉగ్ర నూటికి నూరు శాతం మార్కులు పొందారు. రాష్ట్రంలో ఎక్కడ పార్టీపరంగా ప్రతిష్ఠాత్మక కార్యక్రమాలు జరుగుతున్నా ఆయనను పిలిచి ప్రత్యేక బాధ్యతలు అప్పగిస్తున్నారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగే కార్యకర్తల శిక్షణ తరగతుల్లో నాయకత్వ లక్షణాలపై డాక్టర్ ఉగ్ర చేత శిక్షణ ఇప్పిస్తున్నారు. ఇక జిల్లాలో దామచర్లకు ఉన్న ప్రత్యేక ప్రాధాన్యం తెలియంది కాదు. అధ్యక్ష బాధ్యతలు తీసుకోవాలని ఆయన వర్గీయులు ఒత్తిడి చేస్తున్నట్లు తెలిసింది. మరోవైపు పశ్చిమప్రాంతానికి ప్రాధాన్యం ఇచ్చి తనకు అవకాశం కల్పించాలని కందుల నారాయణరెడ్డి కోరడంతో ఆయన పేరును పరిశీలనలోకి తీసుకున్నారు.

ఆ ఇద్దరికీ నామినేటెడ్ పదవులు

గత ఎన్నికల్లో ఓడిపోయి పార్టీ ఇన్‌చార్జిలుగా ఉన్న ఎరిక్షన్‌బాబు, గొట్టిపాటి లక్ష్మిలకు నామినేటెడ్ పదవులు ఇచ్చే ఆలోచలలో అధిష్ఠానం ఉంది. ప్రొటోకాల్ సమస్యతో వైసీపీ ఎమ్మెల్యేల నుంచి వారు ఎదుర్కొంటున్న విమర్శలకు ఫుల్‌స్టాప్ పెట్టాలని అధిష్ఠానం ఆలోచిస్తున్నట్లు తెలిసింది. ఈవిషయమై ఇటీవల జిల్లాకు సంబంధం ఉన్న కొందరు మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య ప్రత్యేక చర్చ కూడా నడిచింది. ప్రస్తుతం జిల్లాస్థాయిలో ఖాళీగా ఉన్న ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఒడా)తోపాటు రాష్ట్రస్థాయిలో ఒక కార్పొరేషన్‌ను ఎంపిక చేసి వారికి ఇవ్వాలన్న ఆలోచనలో అధిష్ఠానం ఉన్నట్లు తెలుస్తోంది. అనంతరం సామాజికవర్గాల వారీగా పరిశీలన చేసి పార్టీ ఒంగోలు పార్లమెంట్ అధ్యక్ష పదవికి ఉగ్ర, దామచర్లలలో ఒకరిని ఎంపిక చేయనున్నట్లు సమాచారం. రాష్ట్రంలోని కొన్ని జిల్లాల అధ్యక్షుల ఎంపికపై అధిష్ఠానం ఇంకా తుది నిర్ణయానికి రాలేదని సమాచారం. దీంతో పార్లమెంట్ స్థాయి మహానాడులో ప్రకటించాలా? కడప మహానాడు తర్వాత ప్రకటించాలా? అన్న విషయమై తుది నిర్ణయానికి అధిష్ఠానం రాలేదని తెలుస్తోంది.

తాటిచెట్టు పైనుంచి పడి వ్యక్తి మృతి

సంతమాగులూరు, మే 19 (ఆంధ్రజ్యోతి) : తాటిచెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని మిన్నెకల్లు గ్రామంలో చోటుచేసుకొంది. గ్రామానికి చెందిన ఆంజనేయులు, మరో ఇద్దరితో కలిసి తాటికాయలు సేకరించడానికి గ్రామ శివార్లలోని తాటిచెట్ల వద్దకు వెళ్లారు. తాటికాయలు కోసే క్రమంలో ప్రమాదవశాత్తు చెట్టు నుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే ఆయన్ను వైద్యచికిత్స కోసం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స కొనసాగుతుండగా ఆంజనేయులు ఆదివారం మధ్యాహ్నం మృతిచెందాడు. ఆయన భార్య రాణి ఫిర్యాదు మేరకు సోమవారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ డ్రైవర్ మృతి

సంతమాగులూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ తిరగబడి డ్రైవర్ మృతి చెందిన ఘటన మండలంలోని సజ్జాపురం గ్రామంలోని ఓ గ్రానైట్ క్వారీ వద్ద చోటుచేసుకొంది. ఐదుగురు కార్మికులు సోమవారం ట్రాక్టర్లలో క్వారీలో పనికి వెళ్తూ ట్రాక్టర్‌పై కొండ ఎక్కుతుండగా తిరగబడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ నడుపుతున్న తమిళనాడు రాష్ట్రానికి చెందిన డ్రైవర్ ఇలుమలై నాగరాజ్(44) దాని కింద పడడంతో తలకు తీవ్ర గాయమైంది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనపై ఆయన కుమారుడు ఇలుమలై అజిత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంతమాగులూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శింగరకొండకు ప్రత్యేక గుర్తింపు వచ్చేలా కృషి

- మంత్రి గొట్టిపాటి రవికుమార్
- రాతి మండపం ప్రారంభం



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రులు రవికుమార్, స్వామి

అద్దంకి, మే 19 (ఆంధ్రజ్యోతి): శింగరకొండకు రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు వచ్చేలా అభివృద్ధి చేయనున్నట్లు విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో సుమారు రూ.6.83 కోట్లతో నిర్మించిన రాతిమండపాన్ని సోమవారం విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల బాలవీరాంజనేయస్వామి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం దాతల సహకారంతో అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతోందన్నారు. భక్తులు, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఆలయాన్ని అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు. ముందుగా విమాన శిఖర ప్రతిష్ఠ పూజా కార్యక్రమాలలో శృంగేరి పీఠం ఉత్తరాధి కారి విధుశేఖర భారతీ స్వామితో కలిసి మం త్రులు రవికుమార్, బాలవీరాంజనేయ స్వామి, ఒంగోలు, కందుకూరు ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, ఇంటూరి నాగేశ్వరరావులు పాల్గొన్నారు. ప్రసన్నాంజనేయస్వామికి మంత్రి రవికుమార్ పట్టువస్త్రాలు సమర్పించారు. జీవధ్వజస్తంభ పునఃప్రతిష్ఠం, ప్రత్యేక అభిషేకాలు, పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. సినీనటులు కొల్లా అశోక్ కుమార్, దేవదాయశాఖ తిరుపతి రీజనల్ జాయింట్ డైరెక్టర్ చంద్రశేఖర్ ఆజాద్, మహాకుంభాభిషేకం ప్రత్యేకాధికారి, కాకాని దేవాలయం డిప్యూటీ కమిషనర్, ఈవో లీలాకుమార్, శ్రీశైలం దేవస్థానం ఈవో ఎం.శ్రీనివాసరావు, బాపట్ల జిల్లా అసిస్టెంట్ కమిషనర్ సూర్యప్రకాశరావు, నర్సరావుపేట గ్రూపు దేవస్థానాల ఈవో రఘునాథరెడ్డి, అద్దంకి గ్రూపు దేవస్థానాల ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, శింగరకొండ ఆలయ ఈవో, అసిస్టెంట్ కమిషనర్ మద మంచి తిమ్మానాయుడు పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

అద్దంకి, మే19 (ఆంధ్రజ్యోతి):కారు ఢీకొని వ్యక్తికి గాయాలైన ఘటన అద్దంకిలోని శింగరకొండ రహదారిలో దామావారిపాలెం వద్ద చోటుచేసుకొంది స్థానికుల కథనం మేరకు అద్దంకి పట్టణంలోని కట్టకింద పాలేనికి చెందిన అఖిల్ శింగరకొండ రోడ్డులో దామావారిపాలెం వద్ద నిలబడి ఉండగా కారు ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడ్డ అఖిల్‌ను స్థానికులు అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా మెరుగైన చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఒంగోలు వైద్యశాలకు తరలించారు.

నిషేధాజ్ఞలు ధిక్కరిస్తే కఠిన చర్యలు

అనుమతులు లేకుండా వేట సాగించడంపై విచారణ



మత్స్యకారులతో మాట్లాడుతున్న ఎఫ్‌డీవో రవీంద్ర

వాడరేవు(చీరాల), మే 19 (ఆంధ్రజ్యోతి) : నిషేధాజ్ఞలు ధిక్కరించి వేటసాగించే మత్స్యకారులపై శాఖాపరమైన చర్యలు తప్పవని ఎఫ్‌డీవో రవీంద్ర హెచ్చరించారు. ప్రభుత్వం ప్రస్తుతం తీరంలో ఏప్రిల్ 15 నుండి జూన్ 14 వరకు వేట నిషేధం విధించిందన్నారు. ఏటా ఈ సమయంలో మత్స్య సంపద వృద్ధి చెందే క్రమంలో భాగంగా అధికారులు ఆంక్షలు విధిస్తారు. అయితే కర్రబోటు ఉండి లైసెన్స్ ఉన్న మత్స్యకారులకు మాత్రం వేట చేసుకునే వెసులుబాటు ఉంది. కానీ కొందరు లైసెన్స్ లేని మోటారు బోటు మత్స్యకారులు వేట సాగిస్తున్నారన్న ఫిర్యాదు అందిన నేపథ్యంలో మత్స్య శాఖ అధికారులు వాడరేవుకు చేరుకున్నారు. మెరైన్, ఈపూరుపాలెం పోలీసుల సహకారంతో తనిఖీలు నిర్వహించి అనధికారంగా వేట సాగిస్తున్నట్లు తెలుసుకుని ఆగ్రహం వ్యక్తం చేశారు. వేట నిలిపివేయకుంటే కేసులతోపాటు, లైసెన్స్‌లు రద్దు చేసి ప్రభుత్వం అందించే మత్స్యకార పథకాలను నిలుపుదల చేస్తామని హెచ్చరించారు.

రహదారులకు మహర్దశ

- బీటీ రోడ్ల ఏర్పాటుకు రూ.13.25 కోట్ల మంజూరు
- హామీని నిలబెట్టుకున్న ఎమ్మెల్యే ఏలూరి



గుంతలమయమైన రహదారి (ఫైల్)

పర్చూరు, మే 19 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ఐదేళ్ల పాలనలో గుంతలమయంగా మారిన పర్చూరు నియోజకవర్గంలోని పలు రహదారులకు కూటమి ప్రభుత్వంలో మహర్దశ పట్టనుంది. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కృషి ఫలితంగా నియోజకవర్గంలోని పలు రహదారులకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల కింద ప్రభుత్వం రూ.13.25 కోట్లు మంజూరు చేస్తూ నిధులు విడుదల చేసింది. దీంతో పర్చూరులోని పలు రహదారులు బీటీ రోడ్లతో కళకళలాడనున్నాయి. ఐదేళ్లు అస్తవ్యస్తంగా అధ్వానపు రహదారులతో ఇబ్బంది పడిన ప్రజలకు ఊరట లభించనుంది. ప్రధానంగా కోనంకి, వలపర్ల కడవకుదురు, ఇంకొల్లు ప్రధాన రహదారి నుంచి చింతగుంపల, వింజనంపాడు నుంచి తిమ్మరాజుపాలెం వరకు రహదారులు బీటీ రోడ్లుగా అభివృద్ధి చెందనున్నాయి.

నియోజకవర్గంలో పలు పల్లెలకు రహదారులకు ఆర్‌అండ్‌బీ రోడ్లతో అనుసంధానించేందుకు కూటమి ప్రభుత్వం రూ.13.25 కోట్లు మంజూరు చేస్తూ నిధులు విడుదల చేసింది. ప్రధానంగా వింజనంపాడు నుంచి తిమ్మరాజుపాలెం వరకు వయా పోలూరు, శ్యామలవారిపాలెం వరకు నాలుగు భాగాలుగా మొత్తం 10.50 కిలోమీటర్లు రూ.7.50 కోట్లతో నిర్మాణం చేపట్టనున్నారు. అదే విధంగా కడవకుదురు ఇంకొల్లు ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి చింతగుంపల్లి రహదారి వరకు రూ.1.60 కోట్లు మంజూరు చేశారు. ఎన్‌హెచ్-16 కోనంకి నుంచి వలపర్ల వయా జంగమేశ్వరం వరకు మూడున్నర కోట్లతో రహదారి నిర్మాణం చేపట్టనున్నారు. అలాగే ఎన్‌హెచ్-16 బొల్లాపల్లి వరకు రూ.65 లక్షలు మంజూరు చేశారు.

హామీ ఇచ్చి ఏడాదిలోనే నిధులు

ఎమ్మెల్యే ఏలూరి గత ఎన్నికల సమయంలో కోనంకి, వలపర్ల, ద్వారకాపాడు, చింతగుంపల, వింజనంపాడు, పోలూరు, శ్యామాలవారిపాలెం, బొల్లాపల్లి, గ్రామాలలో ప్రజలకు అధికారంలోకి వచ్చిన వెంటనే రహదారుల నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కాలం తిరగకముందే నిధులు మంజూరు చేయించి రోడ్డు నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. పలుమార్లు ఫైళ్లపై ఆయా శాఖల అధికారులతో చర్చించి వెంటనే నిధులు మంజూరు చేసేలా ఒత్తిడి తెచ్చారు. ఎమ్మెల్యే ఏలూరి కృషి ఫలితంగా ప్రభుత్వం నిధులు విడుదల చేసింది.

రోడ్డుకో చరిత్ర

గత టీడీపీ హయాంలో పలు రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. అనంతరం వచ్చిన వైసీపీ ప్రభుత్వం రహదారుల టెండర్లు అన్ని రద్దుచేసి రోడ్ల నిర్మాణానికి అనుమతులు నిలిపివేసింది. దీంతో రహదారుల నిర్మాణం పూర్తిగా నిలిచిపోయింది. నాడు చినగంజాం మండలం చింతగుంపల రోడ్డు నిర్మాణానికి రూ.2కోట్లతో ప్రతిపాదనలు సిద్ధంచేసి మంజూరు చేయించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే టెండర్లు రద్దు చేయడంతో రోడ్ల పనులు నిలిచిపోయాయి. దీంతో ఐదేళ్ల గ్రామస్థులు నరకయాతన అనుభవించారు. రోడ్ల నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేయించి నిధులు మంజూరు చేయించినా వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నిర్దాక్షిణ్యంగా టెండర్లు రద్దుచేయించి రహదారుల అభివృద్ధిని అడ్డుకుంది.

కార్పొరేషన్ స్థలంపై కబ్జాదారుల కన్ను

వీఐపీ రోడ్‌లోని స్థలాన్ని ఆక్రమించే యత్నం

అడ్డుకున్న అధికారులు, పోలీసులు

పార్కుగా అభివృద్ధి చేయాలని కోరుతున్న స్థానికులు

ఒంగోలు, కార్పొరేషన్, మే 19 (ఆంధ్రజ్యోతి) : కార్పొరేషన్ స్థలాలకు రక్షణ కరువైంది. ఖాళీ స్థలాలు కనిపిస్తే కబ్జారాయుళ్లు రెచ్చిపోతున్నారు. తాజాగా ఒంగోలులోని వీఐపీ రోడ్‌లోని విలువైన 30 గదుల ఖాళీ స్థలాన్ని ఆక్రమించేందుకు సిద్ధమయ్యారు. సోమవారం ఆ స్థలంలో ఏకంగా బోర్ వేస్తుండడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఆక్రమణను అడ్డుకునే ప్రయత్నం చేయగా, సిబ్బందిపై అతను దురుసుగాప్రవర్తించారు. ఇదేక్రమంలో స్థానికులు సైతం ఆక్రమణదారుడితో వాగ్వాదానికి దిగారు. వివరాల్లోకెళితే... స్థానిక వీఐపీ రోడ్‌లోని కార్పొరేషన్‌కు చెందిన సర్వే నెం.279/1B1లో రిజర్వు స్థలం 30 గదులు ఉంది. దాని విలువ ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం రూ.1.50 కోట్లు ఉంటుంది.

అధికారుల నోరు నొక్కిన ఆ ఫోన్ కాల్ ఎవరిది ?

వీఐపీ రోడ్‌లో కార్పొరేషన్ స్థలం ఆక్రమణ సమయంలో అడ్డుకున్న అధికారులు, స్థానికులపైనా బెదిరింపులకు పాల్పడుతున్న ఆక్రమణదారులు ప్రతిసారీ ఓ ఫోన్‌చేయడం, అటువైపు నుంచి అధికారులకు ఫోన్ రావడం, వారు మౌనం వహించడం అక్కడ చర్చనీయాంశమైంది. ఇలా సుమారు ఐదారు సార్లు జరగ్గా ఫోన్ వచ్చిన ప్రతిసారీ కార్పొరేషన్ అధికారులు వెనక్కి తగ్గడంపై విమర్శలు వచ్చాయి. దీంతో టౌన్ ప్లానింగ్ అధికారి నారాయణకు కూడా ఇదే తరహా అనుభవం రావడంతో అటువైపు వ్యక్తికి టౌన్‌ప్లానింగ్ అధికారి సరైన సమాధానమిచ్చారు. పంచాయతీగా ఉన్నప్పటి నుంచి ఆ స్థలం గురించి తనకు తెలుసన్నారు. దీనిపై ఎవరికి ఎలాంటి పట్టాలు ఇవ్వలేదని, ఈ విషయంలో జోక్యం చేసుకోవద్దని సమాధానం చెప్పడంతో చేసేదేమి లేక వారు అక్కడ నుంచి జారుకున్నారు.



కార్పొరేషన్ బోర్డు తొలగించి, పక్కన పడేసిన వైనం

చర్యలు తీసుకోవాలి

కార్పొరేషన్‌కు చెందిన స్థలం ఆక్రమణకు గురికాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు దామా శ్రీనివాసరావు కోరారు. ఖాళీ స్థలానికి రక్షణ కంచెలు వేసి, ఆ ప్రాంతాన్ని పార్కుగా అభివృద్ధి చేయాలని కోరారు. అదేవిధంగా స్థానికులు మాట్లాడుతూ తమ ప్రాంతానికి ఎలాంటి పార్కు లేదని, కనీసం కమ్యూనిటీ హాలు కూడా లేనందున కార్పొరేషన్ అధికారులు దృష్టి సారించి, అభివృద్ధి చేసి, ఆక్రమణల నుంచి కాపాడాలని కోరారు.



కార్పొరేషన్ సిబ్బందిపై దౌర్జన్యం చేస్తున్న ఆక్రమణదారుడు

కీలకంగా ఇద్దరు వ్యక్తులు

ఒంగోలుకు చెందిన ఇద్దరు వ్యక్తులు ఆ స్థలాన్ని కొట్టేసేందుకు తమ పలుకుబడిని ఉపయోగించి అధికార దర్పాన్ని ప్రదర్శించారు. కార్పొరేషన్ స్థలంలో బోర్ వేస్తుండటంతో అధికారులు అడ్డుకోగా, మా స్థలమంటూ బుకాయించారు. బయటకు పొండంటూ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారులను బెదిరించడంతోపాటు పదేపదే ఫోన్‌లో రాజకీయ సిఫార్సులు చేయించారు. వచ్చిన వారు ఏమి చేయాలో దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. అప్పటికే ఆక్రమణదారులు తమ వద్ద డీకే పట్టా ఉందని, 2000లో అప్పటి తహసీల్దారు, కలెక్టర్ తమకు పట్టా ఇచ్చారని దౌర్జన్యం చేశారు. అప్పటికీ ఆక్రమణ పనులు జరుగుతుండటంతో కార్పొరేషన్ సిబ్బంది విషయాన్ని కమిషనరు కే వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సూచన మేరకు పోలీసుల సహకారంతో అధికారులు ఆక్రమణను అడ్డుకుని బోర్‌ను తొలగించారు. అప్పటి వరకు బుకాయింపులకు పాల్పడిన ఆక్రమణదారులు కిమ్మనకుండా జారుకున్నారు. ఇదే విషయమై కమిషనరు మాట్లాడుతూ కార్పొరేషన్ రికార్డుల ప్రకారం 30 గదుల స్థలం కార్పొరేషన్‌కు చెందినదిగా తెలిపారు. ఇది ఆక్రమణకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరిక బోర్డు కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆక్రమణలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గంజాయిని తరలిస్తున్న ముగ్గురు అరెస్టు

2.150 కేజీలు స్వాధీనం



నిందితులతో సీఐ మల్లికార్జున, ఎస్సై నరసింహారావు

కంభం, మే 19 (ఆంధ్రజ్యోతి) : గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ మల్లికార్జున చెప్పారు. సోమవారం సాయంత్రం కంభం సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మల్లికార్జున మాట్లాడుతూ నెల్లూరు జిల్లా బాలయ్యపల్లి మండలం జిలిగాం గ్రామానికి చెందిన మామిళ్ల శ్రీనివాసులు, కృష్ణా జిల్లా గుడివాడ గ్రామానికి చెందిన వీరిశెట్టి వెంకటేష్, కంభం మండలం శీలంవీధికి చెందిన గంటా నవీన్ నిత్యం గంజాయి సేవించేవారు. గంజాయికి అలవాటు పడ్డ ఈ ముగ్గురు వైజాగ్‌కు చెందిన ఓ సాధువు వద్ద నుంచి గంజాయిని తక్కువ రేటుకు కొనుగోలు చేసి గంటా నవీన్ ద్వారా కంభం, బేస్తవారపేట మండలాల్లోని చుట్టుపక్కల గ్రామాల్లో అమ్ముకుని ఎక్కువ లాభాలు పొందేందుకు పథకం వేశారు. ఈక్రమంలో ఈనెల 14న విశాఖ నుంచి 2 కిలోల గంజాయిని తెచ్చి బేస్తవారపేట మండలం మోక్షగుండం గ్రామంలోని ముక్తేశ్వరస్వామి గుడి వద్ద ఉన్న మామిళ్ల శ్రీనివాసులుకు కిలో రూ.8వేల చొప్పున అమ్మాడు. ఆ గంజాయిని గుడి వద్ద ప్యాక్ చేస్తే చెడ్డ పేరు వస్తుందని భావించిన శ్రీనివాసులు, వీరిశెట్టి వెంకటేష్, గంటా నవీన్ గంజాయిని కంభం తీసుకొచ్చి చిన్న చిన్న ప్లాస్టిక్ కవర్లలో పెట్టి విక్రయించాలని భావించారు. దీంతో రావిపాడు పొలాల్లోని చెట్ల కింద పొట్లాలు కట్టాలని ఆటోలో తీసుకుని వెళ్తుండగా కంభం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా గమనించిన ఆ ముగ్గురు ఆటో దిగి నడిచి వెళ్తున్నారు. అనుమానం వచ్చిన పోలీసులు తనిఖీ చేయగా వారి వద్ద 2.150 కిలోల గంజాయి పట్టుబడింది. నిందితులు ముగ్గురినీ తహసీల్దార్ వద్ద హాజరుపరచి వారి వద్ద ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. ఆదివారం సాయంత్రం అదుపులోకి తీసుకున్న సీఐ మల్లికార్జున, ఎస్సై నరసింహారావు, సిబ్బంది రమేష్, పీరయ్య, శివయ్య, లాజర్లను జిల్లా ఎస్పీ అభినందించినట్లు తెలిపారు.

పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతం

ఒంగోలు విద్య, మే 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. మొదటి రోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. జిల్లాలోని 36 పరీక్షా కేంద్రాల్లో తెలుగు సబ్జెక్టు పరీక్షకు 778మందిని కేటాయించగా 494 మంది హాజరయ్యారు. స్కాడ్ అధికారులు 12 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. ఓపెన్ స్కూలు సొసైటీ ఇంటర్మీడియెట్ పరీక్షలు 16 కేంద్రాల్లో ఇంగ్లీషు సబ్జెక్టుకు 854 మంది విద్యార్థులను కేటాయించగా 690 మంది హాజరయ్యారు. ఓపెన్ సొసైటీ పదో తరగతి హిందీ పరీక్షకు 13 మందిని కేటాయించగా పది మంది హాజరయ్యారు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ మొదటి రోజు పరీక్షలన్నీ ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్ తెలిపారు.

విద్యాశాఖ ఉద్యోగుల బదిలీలకు గ్రీన్‌సిగ్నల్



ఒంగోలు విద్య, మే 19 (ఆంధ్రజ్యోతి) : విద్యాశాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈమేరకు పాఠశాల విద్య కమిషనర్ విజయరామరాజు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్‌జేడీ, డీఈవో, ఎంఈవో, ఉపవిద్యాధికారుల కార్యాలయాల్లో పనిచేస్తున్న సిబ్బంది బదిలీలను ప్రభుత్వం జారీ చేసిన ఉపాధ్యాయ బదిలీల జీవోకు అనుగుణంగా నిర్వహించనున్నారు. జూన్ 2వ తేదీ లోపు ప్రక్రియ పూర్తి చేయాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. విద్యాశాఖలో నాల్గోతరగతి ఉద్యోగులు, రికార్డు అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, సీనియర్ అసిస్టెంట్ స్థాయి ఉద్యోగులను డీఈవో.. సూపరింటెండెంట్ స్థాయి అధికారులను ఆర్‌జేడీ, ఏడీ స్థాయి అధికారులను బదిలీచేసే అధికారం కమిషనర్‌కు ఉంటుంది.



ఆలయంలో చేస్తున్న ధ్వజస్తంభప్రతిష్ఠ

వైభవంగా మల్లేశ్వర ఆలయ ప్రతిష్ఠ

ఇంకొల్లు, మే 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగండ్ల గ్రామంలో పునఃనిర్మాణం చేసిన శ్రీగంగాపార్వతీ సమేత మల్లేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవం సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేద పండితులతో నూతన ధ్వజస్తంభాన్ని, ఆలయంలో మూలవిరాట్ విగ్రహాలను ప్రతిష్ఠించారు. భక్తుల సహకారంతో రూ.2 కోట్లతో ఈ ఆలయాన్ని నిర్మించారు. నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న ఉత్సవ కార్యక్రమాలతో గ్రామంలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. చుట్టుపక్కల మండలాల నుంచి పెద్దఎత్తున భక్తులు హాజరై పూజలు చేశారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

స్వర్ణమ్మకు పసుపు, కుంకుమ

స్వర్ణ(పర్చూరు), మే 19 (ఆంధ్రజ్యోతి) : కారంచేడు మండలం స్వర్ణ గ్రామదేవత స్వర్ణమ్మకు ఆడపడుచులు సోమవారం పసుపు - కుంకుమలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తిరునాళ్ల ముందురోజు అమ్మవారికి ఆడపడుచులు ఇలా పసుపు కుంకుమ సమర్పించుకోవడం అనవాయితీగా వస్తోందని అర్చకులు చెబుతున్నారు. పెద్దఎత్తున భక్తులు తరలి రావడంతో ఆలయ ప్రాంగణంలో సందడి వాతావరణం నెలకొంది. అమ్మవార్ల తిరునాళ్ల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

లిక్కర్ లిటిగెంట్లు

మార్కాపురం టూ ఒంగోలుకు


నడిపించిన మాయాజాలం

నిబంధనలకు విరుద్ధంగా ఉన్నత అధికారుల ప్రత్యేక అనుమతి

మద్యం దుకాణాల చిరునామా మారుస్తూ గెజిట్

మూడు షాపులు షిఫ్ట్

ఒంగోలు క్రైం, మే 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా మద్యం దుకాణాలను గీతకార్మికుల శ్రేయస్సు కోసం కేటాయించింది. అంతేలైసెన్స్ ఫీజులో కూడా 50 శాతం కూడా రాయితీ ఇచ్చింది. అలాంటి దుకాణాలు ఏ మండలానికి కేటాయిస్తే ఆ మండలంలో ఎక్కడైనా ఏర్పాటు చేసుకోవచ్చు. జిల్లాలో లిక్కర్ మాఫియా మాయజాలంతో మార్కాపురం, కొనకనమిట్ల, తర్లుపాడులో గీత కార్మికులకు కేటాయించిన మూడు మద్యం దుకాణాలను ఒంగోలు పరిసర ప్రాంతాలలో ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపడం,



వారు అనుమతిస్తూ గెజిట్ విడుదల చేయడం చర్చనీయాంశంగా మారింది. ఒంగోలులో ఇప్పటికే 21 మద్యం దుకాణాలు, 15 బార్లు ఉన్నాయి. జనాభా ప్రాతిపాదికన లాటరీ ద్వారా ఎంపిక చేసిన గీతకార్మికులకు కేటాయించిన మద్యం దుకాణాలు ఒంగోలులో ఏర్పాటు చేయడం వలన ప్రస్తుతం ఉన్న మద్యం దుకాణాలు నష్టాలబాటలో నడుస్తాయని కొంతమంది వాపోతున్నారు. సిండికేట్లుగా ఏర్పడిన వారు మాత్రం ఈ దుకాణాల ద్వారా లబ్ధి పొందాలని యోచిస్తున్నారు. అంతేకాదు నిబంధనలకు విరుద్ధంగా ఇలాంటి ప్రతిపాదనలు చేయడం ఏమిటి అని ఎక్సైజ్ అధికారులను ప్రశ్నిస్తున్నారు. కొంతమంది వ్యాపారులు 50 శాతం రాయితీతో గీతకార్మికులు మద్యం దుకాణాలు ఏర్పాటు చేస్తే తమ మద్యం దుకాణాలు మూసివేసుకోవాల్సిందేనని ప్రస్తుతం మద్యం దుకాణాల యజమానులు వాపోతున్నారు. ఎక్సైజ్ అధికారులు వాస్తవ పరిస్థితులను ఉన్నతాధికారులకు తెలయజేయకుండా నిబంధనలకు విరుద్ధంగా ప్రతిపాదనలు చేయడం విమర్శలకు తావిస్తోంది.

సీపీఎస్ ఉద్యోగులకు న్యాయం చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, మే 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ రంగ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు కోరారు. సోమవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసి వినతి పత్రం అందజేశారు. సోమవారం నెల్లూరులో ప్రారంభమైన చైతన్య యాత్ర సాయంత్రం ఒంగోలు చేరింది. ఆ తర్వాత యూనియన్ నాయకులు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2004 తర్వాత ఉద్యోగంలోకి వచ్చిన



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏపీసీపీఎస్ఈఏ ప్రతినిధులు

వారి సంఖ్య 3.5 లక్షల మంది ఉన్నారని తెలిపారు. సీపీఎస్‌ను నిరసిస్తూ అనేక విధాలుగా ఆందోళనలు నిర్వహిస్తూ వచ్చామని వివరించారు. సీపీఎస్ విధానాన్ని వ్యతిరేకిస్తూ 2015లో సంఘం ఏర్పడి చేసిన పోరాట ఫలితంగా 2017లో గ్రాట్యూటి, ఫ్యామిలీ పెన్షన్‌ను సాధించామన్నారు. చైతన్యయాత్ర ఈనెల 23న రాజమండ్రిలో ముగుస్తుందని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యను పరిష్కరించకపోతే సెప్టెంబరు 1వ తేదీ గుంటూరు నుంచి విజయవాడ వరకు పెన్షన్ మార్చ్ నిర్వహించనున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బాజీపఠాన్, ప్రధాన కార్యదర్శి కరిమి రాజేశ్వరరావులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిన్నపురెడ్డి కిరణ్‌కుమార్, వరకుమార్, టౌన్ అధ్యక్షుడు శ్రీనివాసులు, సీపీఎస్ జిల్లా అధ్యక్షుడు వి. రమేష్‌బాబు, పీ నాగేశ్వరరావు, ఎస్‌కే రాజా, ఐవీ వెంకటేశ్వర్లు, షరీఫ్, హనుమంతరావు, డీసీహెచ్ వెంకటేశ్వర్లు, డి. శ్రీనివాసరావు ఉన్నారు.

అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలి

'మీకోసం' కార్యక్రమంలో కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, మే 19 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో సోమవారం జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణతో కలిసి కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజానీకం



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ అన్సారియా

పలు రకాల సమస్యలను విన్నవించారు. ఆయా అర్జీలపై కలెక్టర్ అన్సారియా మాట్లాడుతూ అధికారుల వద్దకు వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. మీకోసం కార్యక్రమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్న విషయాన్ని ప్రతి అధికారీ గుర్తుంచుకోవాలన్నారు. ప్రతి ఒక్క అర్జీని నిర్దేశించిన గడువులోపు పరిష్కరించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ పెండింగ్ ఉంచవద్దని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో చిన ఓబులేషు, డిప్యూటీ కలెక్టర్లు కుమార్, శ్రీధర్, వరకుమార్, డిప్యూటీ కలెక్టర్ పార్థసారథి పాల్గొన్నారు.

సనాతన ధర్మాన్ని కాపాడాలి

శృంగేరి పీఠం విదుశేఖర భారతి స్వామిజీ

ఇంకొల్లు, మే 19 (ఆంధ్రజ్యోతి): సకల జనులందరికీ శ్రేయస్సు కలగాలని, సనాతన ధర్మాన్ని కాపాడాలని శృంగేరి పీఠం విదుశేఖర భారతిస్వామిజీ ఉద్బోధించారు. సోమవారం సాయంత్రం మండలంలోని శృంగేరి పీఠ పాలనాధీనంలో ఉన్న పావులూరి పొలిమేర వీరాంజనేయస్వామి ఆలయాన్ని ఆయన సందర్శించారు. ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు, భక్తులు స్వామివారికి పూలతో ఘన స్వాగతం పలికారు. విదుశేఖర భారతి స్వామీజీ ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన మండపాలు, అతిథిగృహాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం భక్తులనుద్దేశించి ప్రసంగించారు. సకల జనులకు ఆంజనేయస్వామి అనుగ్రహం ఉండాలని ఆశీర్వదించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆయన వెంట మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి, మధుసూదనరెడ్డి ఉన్నారు.



సందేశం ఇస్తున్న స్వామిజీ



పావులూరు ఆంజనేయస్వామికి హారతి ఇస్తున్న స్వామిజీ

కొండపిని అభివృద్ధిపథంలో నడిపిస్తాం

పది నెలల్లో రూ. 50 కోట్ల అభివృద్ధి పనులు..

రూ. 450 కోట్లతో తాగునీటి పథకానికి ప్రతిపాదనలు

సాగు నీటి ఇక్కట్లు తొలగిస్తాం

మినీ మహానాడులో మంత్రి డాక్టర్ స్వామి

గ్రామాల్లో వైషమ్యాలు వీడి కలిసికట్టుగా పనిచేయాలని సత్య హితవు

కొండపి, మే 19 (ఆంధ్రజ్యోతి) : వచ్చే నాలుగేళ్లలో కొండపి నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి పథంలో నడిపిస్తామని మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి హామీ ఇచ్చారు. కొండపిలోని శ్రీసాయి సీతారామ కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన నియోజకవర్గ మినీమహానాడులో ఆయన పాల్గొని మాట్లాడారు. అధికారం చేపట్టిన అనతికాలంలోనే రూ.50 కోట్లపైగా అభివృద్ధి పనులు చేశామని తెలిపారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు రూ. 4వేలు పెన్షన్ ఇస్తున్నామని తెలిపారు. మహిళలకు దీపం పథకం కింద ఉచితంగా గ్యాస్‌సిలిండర్లు అందజేశామన్నారు. గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకొని వెళ్లాలని కోరారు. రాబోయే రెండున్నరేళ్లలో నియోజకవర్గంలో 60 గ్రామాలకు రామతీర్థం నుంచి పైపులైన్ ద్వారా తాగునీటి సమస్యను తీర్చడానికి రూ.450 కోట్ల ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం పొగాకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఇప్పటికే పలుమార్లు చర్చించామని తెలిపారు. సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషిచేస్తామని స్వామి హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలకు ఏ హోదాలో ఉన్నా అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు.





మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ స్వామి, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య

ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తాం : సత్య

కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన నియోజకవర్గంలోని ప్రతి కార్యకర్తకు న్యాయంచేస్తామని రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కలిసికట్టుగా ఉండే నాయకుల్లో అధికారం వచ్చాక నిస్తేజం, నిరుత్సాహం కనిపిస్తోందన్నారు. గ్రామాల్లో నాయకులు వైషమ్యాలను వీడి కలిసికట్టుగా పనిచేయాలని హితవుపలికారు. ప్రభుత్వ కార్యాలయాల్లో టీడీపీ జెండా మోసిన కార్యకర్తలకు గౌరవం ఇవ్వని, పనిచేయని అధికారులను వెంటనే తొలగించాలని మంత్రి స్వామిని కోరారు. నియోజకవర్గ ప్రజల కోసం మంత్రి స్వామి, తను, తన తండ్రి పూర్ణచంద్రరావు ముగ్గురు అహర్నిశలు పనిచేస్తున్నామన్నారు. ఇప్పటికే కొండపి అభివృద్ధిపై మంత్రి లోకేష్‌తో చర్చించామన్నారు. రాబోయే రోజుల్లో నియోజవర్గ రూపురేఖలు మారుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ, మహానాడు పరిశీలకులు అడకా స్వాములు, మలిశెట్టి వెంకటేశ్వర్లు టీడీపీ నేతలు గొర్రెపాటి రామయ్య, కొండ్రగుంట శ్రీనివాసులు, పొకూరి రవీంద్రబాబు, చదలవాడ చంద్రశేఖర్, బత్తుల నారాయణ స్వామి, బెల్లం సత్యం, ఎర్రమోతు శ్రీనివాసులు, వేల్పుల సింగయ్య, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా శైలజ స్కిన్ ఆసుపత్రి ప్రారంభం



ఆసుపత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, పక్కన లైవ్ స్టాక్ కార్పొరేషన్ చైర్మన్ రియాజ్, వైద్యులు

ఒంగోలు కలెక్టరేట్, మే 19 (ఆంధ్రజ్యోతి): వైద్యరంగంలో అపార అనుభవం ఉన్న డాక్టర్ డి.శైలజ, డాక్టర్ ఆర్.శ్రీకాంత్‌లు కొత్తగా శైలజ స్కిన్ క్లినిక్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. ఒంగోలులోని పోలీస్ గ్రౌండ్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన శైలజ స్కిన్ క్లినిక్‌ను మేయర్ గంగాడ సుజాత, లైవ్ స్టాక్ కార్పొరేషన్ చైర్మన్ షేక్ రియాజ్‌లతో కలిసి ఎమ్మెల్యే దామచర్ల ప్రారంభించారు. ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన వివిధ విభాగాలను ఎమ్మెల్యే సందర్శించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో దామచర్ల మాట్లాడుతూ గతంలో స్థానిక లంబాడీడొంకలో ఏడాది పాటు వైద్యసేవలు అందించిన డాక్టర్ శైలజ కొత్తగా ఆస్పత్రి నిర్మాణం చేయడం సంతోషమన్నారు. స్కిన్ స్పెషలిస్టుగా మరింత పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీడీసీసీ బ్యాంకు చైర్మన్ డాక్టర్ సీతారామయ్య, వైద్యాధికారులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. కాగా వైద్యశాలను ఏర్పాటు చేసిన డాక్టర్లు శైలజ, శ్రీకాంత్‌లను వారు అభినందించారు.

ప్రభుత్వ సేవలు పూర్తిస్థాయిలో ప్రజలకు అందించాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ అన్సారియా, జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు కలెక్టరేట్, మే 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ సేవలు పూర్తిస్థాయిలో ప్రజలకు అందించేలా జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయా నంద్ ఆదేశించారు. సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. స్టేట్ ప్రాజెక్టు మానటరింగ్ గ్రూప్, యోగాంధ్ర-2025 క్యాంపెయిన్, కోర్టు సముదాయాల్లో మరుగుదొడ్ల నిర్మాణాల పురోగతి, ప్రభుత్వ పథకాల సేవలు, ప్రజా స్పందనల వంటి అంశాలపై సమీక్షించారు. వాటికి సంబంధించి ప్రతి 15 రోజులకు ఒకసారి సమీక్షిస్తామని, ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే కలెక్టర్లు త్వరగా పూర్తి చేయాలన్నారు. వచ్చేనెల జూన్ 21నుంచి జరగనున్న యోగాంధ్ర-25 క్యాంపెయిన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయలని చెప్పారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ గోపాలకృష్ణ, డీఆర్వో చినఓబులేషు, అధికారులు చిరంజీవి, వెంకటనాయుడు, డాక్టర్ వెంకటేశ్వర్లు, జోసెఫ్‌కుమార్, హేనసుజన్, శ్రీహరి, కమిషనర్ వెంకటేశ్వరరావు, సీపీవో వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

● ఎస్పీ దామోదర్



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు క్రైం, మే19 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదులు త్వరితగతిన చట్టపరిధిలో పరిష్కరించాలని ఎస్పీ ఏఆర్.దామోదర్ ఆదేశించారు. సోమవారం ఒంగోలులోని ఎస్పీ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి 70మంది తమ సమస్యలను ఎస్పీకి విన్నవించారు. స్వయంగా ఫిర్యాదిదారుల సమస్యలను అడిగి తెలుసుకున్న ఆయన సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. అర్జీదారుల ఫిర్యాదులను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్పీ డీఎస్పీ సురేష్‌బాబు, మహిళ పోలీస్‌స్టేషన్ డీఎస్పీ రమణకుమార్, ఎస్సీ ఎస్టీ సెల్ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్, డీటీసీ ఇన్‌స్పెక్టర్ సమీముల్లా, ఎస్ఐ రజియాసుల్తాన్ పాల్గొన్నారు.

వానలోనూ కొనసాగిన దీక్షలు



ప్రార్థనలతో నిరసన వ్యక్తం చేస్తున్న సీహెచ్‌వోలు

ఒంగోలు కలెక్టరేట్, మే 19 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జోరువానలోనూ తమ ఆందోళన కొనసాగించారు. స్థానిక కలెక్టరేట్ ఎదుట జరుగుతున్న చేపట్టిన దీక్షలు సోమవారానికి 21వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ సీహెచ్‌వోల న్యాయమైన సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. సమస్యల పరిష్కారం కోసం దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం కానీ, ఇటు అధికారులు గాని పట్టించుకున్న పరిస్థితి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. 23శాతం ఇంక్రిమెంట్‌తో పాటు పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గంటా ప్రసన్న, పి.శైలజ, దీప్తి, కామేష్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు దర్శిలో భారతీ మహాస్వామి యాత్ర

దర్శి, మే 19(ఆంధ్రజ్యోతి): శ్రీశృంగేరి శారదా పీఠాధీశ్వరులు జగద్గురువులు శ్రీ భారతీతీర్థ మహాస్వామి వారి కరకమల సంధ్యాతులు శ్రీవిధుశేఖర భారతీ మహాస్వామి విజయయాత్రలోభాగంగా మంగళవారం సాయంత్రం దర్శికి విచ్చేయనున్నట్టు భక్త బృందం తెలిపారు. స్వామీజీకి స్థానిక గడియార స్తంభం వద్ద పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో భక్తులకు అనుగ్రహ భాషణం ఇస్తారు. బుధవారం ఉదయం భక్తులు కలిసే అవకాశం కల్పిస్తారు. ఈ కార్యక్రమంలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు.

సైనికుల శౌర్యపరాక్రమాలకు సెల్యూట్

మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ● ఆపరేషన్ సిందూర్‌కు సంఘీభావంగా తిరంగా ర్యాలీ



జాతీయ జెండాలు చేతపట్టి ర్యాలీ నిర్వహిస్తున్న మంత్రి స్వామి, సత్య, శ్రేణులు

కొండపి, మే 19 (ఆంధ్రజ్యోతి) : భారతదేశ సైనికుల శౌర్యపరాక్రమాలను, వీరోచిత పోరాటాన్ని చూసి దేశం గర్విస్తోందని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి అన్నారు. సోమవారం కొండపిలో ఆపరేషన్ సిందూర్‌కు సంఘీభావంగా తిరంగా ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీ స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి ప్రారంభమై శ్రీ సీతారామకల్యాణ మండపం వరకు కొనసాగింది. మంత్రి స్వామి మాట్లాడుతూ పెహల్గాం ఉగ్రదాడికి పాల్పడిన పాకిస్థాన్ వెన్నులో భారత త్రివిధ దళాలు వణుకు పుట్టించాయన్నారు. భారతదేశం శక్తి సామర్థ్యాలను ప్రపంచానికి చాటిచెప్పడం సైనికుల ఘనకీర్తికి నిదర్శనమని కొనియాడారు. మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య మాట్లాడుతూ పాకిస్థాన్ ఉగ్రవాదులు అమాయక పర్యాటకులను బలి తీసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విపత్కర సమయంలో ఆపరేషన్ సిందూర్‌తో ప్రధాని మోదీ, భారత సైనికులు దీటుగా పాకిస్థాన్‌కు బుద్ధి చెప్పారన్నారు.

జీవో నెంబరు 4ను నిలుపుదల చేయాలి



ఒంగోలులో తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న వీఆర్వోలు



సంతనూతలపాడులో తహసీల్దార్ ఆదిలక్ష్మికి వినతిపత్రం ఇస్తున్న వీఆర్వోలు

● వీఆర్వోల వినతులు

ఒంగోలు(రూరల్), మే19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వీఆర్వోలు అదనంగా ఉన్నారని ప్రభుత్వం జీవో నెంబరు 4ను ప్రకటించిందని, అందువల్ల ఆ జీవోను ఉపసంహరించుకోవాలని పలువురు వీఆర్వోలు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం ఒంగోలులో అర్బన్ తహసీల్దార్ పి.మధుసూదనరావుకు నగరం, మండలంలోని వీఆర్వోలు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో గ్రామ సచివాలయాల వీఆర్వోల సర్దుబాటు కారణంగా ఎక్కువ మంది ఉన్నట్లు ప్రభుత్వం ప్రకటించటం తగదన్నారు. వీఆర్వోలకు పని వత్తిడి ఎక్కువగా ఉందని, వారికి ఇప్పటికి తక్కువగానే ఉన్నట్లు చెప్పారు. వీఆర్వోలను సర్దుబాటు చేయటం వల్ల ఇంకా కొరత ఏర్పడుతుందన్నారు. రాష్ట్రంలో వీఆర్వోలను పూర్తిస్థాయిలో నియమించాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్వోలు యజద్, పాపారావు, ఎం.రమణి, ఎం.సురుష్, గంగాభవాని, వసుంధర పాల్గొన్నారు.

పనిభారం తగ్గించాలి

సంతనూతలపాడు: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెం.4ను వెంటనే రద్దు చేయాలని కోరుతూ సంతనూతలపాడు మండల వీఆర్వోలు సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో తహసీల్దార్ వి.ఆదిలక్ష్మికి వినతిపత్రం అందించారు. ప్రస్తుతం మూడు గ్రామాలకు, రెండు గ్రామాల వారీగా ఒక వీఆర్వో ఉన్నారని, సచివాలయానికి ఒక వీఆర్వోను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వీఆర్వోల సంఘం ప్రధానకార్యదర్శి ఏసీ.ఆదిరెడ్డి, రవికుమార్, ఎ.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పుగుండూరు పంచాయతీ రికార్డులు ఎక్కడ?

● సెలవుపై వెళ్లిన కార్యదర్శి వద్దనే రికార్డులు

● గ్రామస్థుల విమర్శలు



ఉప్పుగుండూరు గ్రామ పంచాయతీ కార్యాలయం

నాగులుప్పలపాడు, మే 19 (ఆంధ్రజ్యోతి): ఉప్పుగుండూరు పంచాయతీ కార్యాలయానికి సంబంధించిన రికార్డులు సెలవుపై వెళ్లిన కార్యదర్శి తనవద్ద ఉంచుకొని అనధికారికంగా రికార్డుల నిర్వహణ చేస్తున్న కార్యదర్శి తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉప్పుగుండూరు మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న కిరణ్‌కుమార్ ఈనెల 13వ తేదీ నుంచి మెడికల్ లీవ్ తీసుకునివెళ్లారు. ఈ మధ్య కాలంలో పంచాయతీలో జరిగిన పనుల వివరాల రికార్డులు, నిధులు జమా ఖర్చుల రికార్డులు, ఎంబుక్‌లు, ఇతర పంచాయతీ రికార్డులన్నింటిని కార్యదర్శి వద్దే ఉంచుకోవడం పట్ల ఆయన తీరుపై ఆరోపణలు వస్తున్నాయి. ఈ రికార్డులు గ్రామానికి చెందిన ప్రైవేటు వ్యక్తుల వద్ద ఉంచారనే వార్తలు గుప్పుమంటున్నాయి. ఇటీవల గ్రామంలో జరిగిన అభివృద్ధి పనుల్లో, పంచాయతీ నిర్వహణకు వినియోగించిన నిధుల్లో అక్రమాలు జరగడంతో రికార్డుల్లో తమకు అనుకూలంగా మార్చుకునేందుకు పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కుమార్ ఆకస్మిక సెలవుపై వెళ్లి రికార్డులను అప్పగించడం లేదన్న ప్రజల ఆరోపణలకు బలం చేకూరుతోంది. ఈ రికార్డుల నిర్వహణపై గ్రామ పంచాయతీ కార్యదర్శి కిరణ్ కుమార్, జూనియర్ అసిస్టెంట్ కృపాచార్యులు మధ్య అంతర్గత పోరు నడుస్తున్నది. తనును రికార్డుల నిర్వహణ చేయనీయకుండా కార్యదర్శి కిరణ్‌కుమార్ అడ్డుకొంటున్నారని జూనియర్ అసిస్టెంట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కొద్ది కాలం క్రితం ఇక్కడి సర్పంచ్ జయమ్మ చెక్ పవర్ రద్దు కాగా విచారణలో ఆమె ప్రమేయం లేదని గుర్తించిన ఉన్నతాధికారులు తిరిగి చెక్ పవర్ కల్పించిన రోజు నుంచి రికార్డులు కనిపించకపోవడం పట్ల ప్రజలు విమర్శిస్తున్నారు. కాగా సచివాలయం-2 కార్యదర్శిగా పనిచేస్తున్న రమణకు ఎంపీడీవో వై.మహాలక్ష్మి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించినా సెలవుపై వెళ్లిన కార్యదర్శి కిరణ్‌కుమార్ చార్జ్ అప్పగించలేదు. ఈక్రమంలో పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కుమార్‌పై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు ఎంపీడీవో సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

ప్రమాదకరంగా గ్రానైట్ రాళ్ల రవాణా

● కొరడా ఝుళిపించిన పోలీసులు

● ఐదు వాహనాల సీజ్



రాళ్లు కిందపడేలా టిప్పర్‌లో లోడింగ్ చేసిన నిర్వాహకులు



పోలీసులు సీజ్ చేసిన వాహనాలు

చీమకుర్తి, మే19(ఆంధ్రజ్యోతి) : నిబంధనలకు విరుద్ధంగా, ప్రమాదకర రీతిలో గ్రానైట్ రాళ్లను రవాణా చేస్తున్న రవాణాదారులపై పోలీసులు కొరడా ఝుళిపించారు. సోమవారం ఏకంగా ఐదు వాహనాలను సీజ్ చేసినట్లు సీఐ సుబ్బారావు తెలిపారు. రవాణాశాఖాధికారులు, విజిలెన్స్, మైన్స్ అధికారులు ప్రమాదకరమైన రవాణాపై సరైన దృష్టి పెట్టకపోవటంతో వాహనదారులు ఇష్టారీతిన ప్రవర్తిస్తున్నారు. దీనివల్ల రోడ్డుపై రాకపోకలు సాగిస్తున్న వారు భయభ్రాంతులు గురవ్వటంతో పాటు ఏక్షణానా ఏ రాయి పడి ప్రాణం మీదకు వస్తుందో అని హడలెత్తుతూ ప్రయాణం సాగిస్తున్నారు. ఈ విషయాన్ని పలువురు పోలీసులు దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో సీఐ సుబ్బారావు తన సిబ్బందితో కలిసి నిబంధనలకు విరుద్ధంగా రాకపోకలు సాగిస్తున్న గ్రానైట్ వాహనాలను పరిశీలించారు. రాళ్లు దొర్లిపడేవిధంగా లోడింగ్ చేసుకొని రవాణా సాగిస్తున్న ఐదు వాహనాలను సీజ్ చేసి చీమకుర్తి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీసులు ఇలాంటి వాహనాలను సీజ్ చేస్తున్నారని తెలుసుకున్న మరికొన్ని వాహనాలు రవాణా నిలిపివేసి తప్పించుకున్నారు. రోడ్డుపై ప్రయాణికులకు, ఇతర వాహనాలకు ఇబ్బందికరంగా, ప్రాణప్రమాదంగా గ్రానైట్ రవాణా చేస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ సుబ్బారావు హెచ్చరించారు. నిబంధనల మేరకు గ్రానైట్ రవాణాను నిర్వహించుకోవాలని ఆయన స్పష్టం చేశారు.

అకాల వర్షానికి తడిసిన వరి ఓదెలు



వర్షానికి తడిసిన వరి ఓదెలను చూపుతున్న రైతు

తాళ్లూరు, మే 19(ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం ఉదయం కురిసిన అకాల వర్షానికి పలుగ్రామాల్లో కోసిన వరి ఓదెలు తడిసిపోయాయి. దారంవారిపాలెం, తూర్పుగంగవరం, సోమవరప్పాడు తదితర గ్రామాల్లో వరి కోతలు కోసి పొలాల్లో ఓదెలు వేశారు. వర్షానికి ఓదెలు తడిసిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మొక్కజొన్న పంట కోత పూర్తికాగా 90శాతం మేర అమ్మకాలు పూర్తయ్యాయి. కోత కోసి అమ్మేందుకు సిద్ధంగా ఉంచిన మిగిలిన పది శాతం మొక్కజొన్న గింజలను వర్షానికి తడవకుండా ఉండేందుకు రైతులు పడరాని పాట్లు పడ్డారు. పలుగ్రామాల్లో సైడు కాలువలు పూడకుపోవడంతో వర్షపు నీరు రోడ్లపై ప్రవహించింది.

కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

సంతనూతలపాడు, మే19(ఆంధ్రజ్యోతి): ఎండ్లూరు డొంకవద్ద మహిళాప్రాంగణంలో నిరుద్యోగ మహిళలకు కంప్యూటర్ కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి రవితేజయాదవ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. శిక్షణ పూర్తయిన వెంటనే ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. జిల్లాలోని 15-45 సంవత్సరాల వయస్సుగల నిరుద్యోగ మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. వివరాలకు సెల్‌నెం.9963005209ను సంప్రదించాలన్నారు.

పలు శిక్షణలకు దరఖాస్తుల ఆహ్వానం

ఎండ్లూరు డొంకవద్ద మహిళాప్రాంగణంలో త్వరలో మగ్గంవర్క్, బ్యూటీషియన్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ, ఫ్యాబ్రిక్ కట్టర్ కోర్సులకు శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని మేనేజర్ అంజమ్మ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 18-45 సంవత్సరాల వయస్సు గల నిరుద్యోగ మహిళలు దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు సెల్.నెం.8333921346ను సంప్రదించాలని కోరారు.

బీజేపీ వైపాలెం కన్వీనర్‌కు పరామర్శ



నాగేశ్వరరావును పరామర్శించి ఆర్థికసాయం అందజేస్తున్న శివారెడ్డి

ఒంగోలు కలెక్టరేట్, మే 19 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ యర్రగొండపాలెం అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ యనమల నాగేశ్వరరావును ఆ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు పీ వీ.శివారెడ్డి పరామర్శించారు. నాగేశ్వరరావుకు గుండెపోటు రావడంతో మెరుగైన చికిత్స కోసం గుంటూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. సమాచారం అందుకున్న శివారెడ్డి సోమవారం నాగేశ్వరరావును పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అనంతరం వైద్యాధికారులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. పార్టీ నాయకులు, కార్యకర్తల కోసం ఎల్లప్పుడూ తనవంతు సహాయ సహకారాలు ఉంటాయని శివారెడ్డి తెలిపారు.

ఏపీఈఏపీసెట్‌కు 91.13శాతం హాజరు

ఒంగోలు విద్య, మే 19 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు సోమవారం నిర్వహించిన ఏపీఈఏపీసెట్‌కు 91.13శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈప్రవేశ పరీక్షకు 1,692 మందిని కేటాయించగా 1542 మంది పరీక్ష రాశారు. రాష్ట్రవ్యాప్తంగా సగటున 92.03శాతం కాగా జిల్లాలో ఒక శాతం తక్కువగా హాజరయ్యారు.

విద్యార్థినులకు చట్టాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న మహిళా పోలీస్

సంతనూతలపాడు, మే 19(ఆంధ్రజ్యోతి): పేర్నమిట్టలోని పీర్లమాన్యంలోని క్విజ్ హైస్కూల్‌లో విద్యార్థినులకు గుడ్‌టచ్-బ్యాడ్‌టచ్, పోక్సో కేసులపై ఎస్పీ ఆదేశాల మేరకు రూరల్ సీఐ ఎన్.శ్రీకాంత్‌బాబు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. త్వరలో పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థినుల సంరక్షణ కోసం అవసరమైన చర్యలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్న సీఐ తెలిపారు. కార్యక్రమంలో తాలూకా పోలీస్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు



మద్దిపాడులో పరిశీలిస్తున్న అధికారులు

మద్దిపాడు, మే 19 (ఆంధ్రజ్యోతి): గుండ్లకమ్మ పరివాహక ప్రాంతంలో ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ నారాయణరెడ్డి, ఎస్ఐ శివరామయ్య హెచ్చరించారు. సోమవారం వెల్లంపల్లి, మద్దిపాడు, కొలచనకోట, కీర్తిపాడు ఇసుకరీచ్‌లను పరిశీలించారు. సొంతంగా గృహాలు నిర్మించుకునే వారు ఉచితంగా ఇసుక సరఫరా చేసుకోవచ్చని వారు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

చీమకుర్తి, మే19(ఆంధ్రజ్యోతి) : చీమకుర్తిలోని ఎంఎస్ఆర్ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివిన పూర్వవిద్యార్థుల ఆత్మీయ కలయిక సోమవారం ఉత్సాహభరితమైన వాతావరణంలో జరిగింది. 2006-08బ్యాచ్ పూర్వ విద్యార్థులు సమావేశంలో పాల్గొని ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు.

కానిస్టేబుల్ ఈవ్‌టీజింగ్

● దేహశుద్ధి చేసిన ప్రజలు

ఒంగోలు క్రైం, మే19(ఆంధ్రజ్యోతి): యువతుల పట్ల అసభ్య పదజాలంతో మాట్లాడుతున్న ప్రత్యేక విభాగంలో పని చేస్తున్న కానిస్టేబుల్‌కు పలువురు దేహశుద్ధి చేశారు. పూటుగా మద్యం తాగి స్కూటీ మీద వెళుతున్న యువతుల పట్ల అసభ్యపదజాలంతో మాట్లాడాడు. ఈ సంఘటన ఆదివారం రాత్రి ఒంగోలు నగరం మంగమూరు రోడ్డు జంక్షన్ సమీపంలో జరిగింది. దీంతో స్కూటీ మీద వెళుతున్న యువతులు వెంటనే వారి బంధువులకు తెలియజేయడంతో అక్కడకు వచ్చి సదరు కానిస్టేబుల్‌ను చితకబాదారు. వెంటనే డయల్ 100 కాల్ చేసి పోలీసులకు అప్పగించి వెళ్లారు.

సుందరయ్య ఉద్యమ స్ఫూర్తితో సాగాలి



సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, మే 19 (ఆంధ్రజ్యోతి): పుచ్చలపల్లి సుందరయ్య ఉద్యమ స్ఫూర్తితో ముందుకు సాగాలని సీపీఎం నాయకులు కోరారు. ఒంగోలులోని సుందరయ్యభవన్‌లో సోమవారం మార్క్సిస్ట్ పార్టీ ఉద్యమ నిర్మాత సుందరయ్య 40వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా కార్యదర్శి ఎస్‌కే.మాబు అధ్యక్షతన జరిగిన సభలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పూనాటి ఆంజనేయులు మాట్లాడుతూ ప్రపంచంలో జరిగిన క్యూబా, వియత్నాం విముక్తి పోరాటాలను మించిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి సుందరయ్య నాయకత్వం వహించారని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు వై.సిద్ధయ్య, జీవీ.కొండారెడ్డి, కంకణాల అంజనేయులు, చీకటి శ్రీనివాసరావు, కాలం సుబ్బారావు, బి.రఘురాం, రమాదేవి, జి.శ్రీనివాసులు, వినోద్, కేఎఫ్‌బాబు, జి.నరసయ్య, కంకణాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మద్దిపాడులో..

మద్దిపాడు : పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి కార్యక్రమాలను సోమవారం మండలంలోని పలుగ్రామాల్లో నిర్వహించారు. మద్దిపాడులోని కళామందిరం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఆదిలక్ష్మి, నాయకులు సుబ్బారావు, నరసింహారావు, వెంకటేశ్వర్లు రామారావు, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రత్యేక పూజలు

గిద్దలూరు, మే 19 (ఆంధ్రజ్యోతి) : హనుమాన్ జయంతి సందర్భంగా పట్టణంలోని రేడియో బావి సెంటర్ వద్ద గల శ్రీ అభయాంజనేయస్వామి దేవస్థానంలో ఈనెల 20 నుంచి 22వ తేదీ వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటీ ప్రతినిధులు తెలిపారు. 20వ తేదిన ప్రత్యేక పూజలు, 21న రాత్రి కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలు, పట్టుకుంటే పట్టుచీర కార్యక్రమం, 22న గ్రామోత్సవం ఉంటుందని తెలిపారు. ఈ 3 రోజులపాటు భక్తులకు అల్పాహారాన్ని ప్రసాదంగా అందజేస్తున్నట్లు ప్రతినిధులు తెలిపారు.

22న బైక్ ర్యాలీ

హనుమాన్ జయంతి సందర్భంగా ఈనెల 22వ తేదీ గురువారం సాయంత్రం 4గంటలకు హనుమాన్ శోభాయాత్ర బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు బీహెచ్‌పీ, నియోజకవర్గ దేవాలయాల కమిటీ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని నేషనల్ హైవేపై ఉన్న హెచ్‌పీ పెట్రోల్ బంక్ నుంచి బైక్ ర్యాలీ ప్రారంభమై పట్టణంలోని ప్రధాన వీధుల మీదుగా సాగుతుందని, ప్రతి ఒక్కరూ ఈ శోభాయాత్రలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

22 నుంచి ఆంజనేయస్వామి జయంతి ఉత్సవాలు

మార్కాపురం రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బొడిచెర్ల గ్రామంలో ఈనెల 22 నుంచి ఆంజనేయస్వామి జయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. ఈ నెల 22 గురువారం నుంచి 27వ తేదీ మంగళవారం వరకు ప్రత్యేక పూజా, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. స్వామి వారి జయంతి ఉత్సవాలలో జరిగే ప్రత్యేక పూజల్లో గ్రామస్థులు హాజరై స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

కార్యకర్తల కష్ట ఫలితమే విజయం

- స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటుదాం
- నియోజకవర్గ సమగ్రాభివృద్ధే లక్ష్యం
- ఎమ్మెల్యే నారాయణరెడ్డి
- జోష్ నింపిన మినీ మహానాడు

మార్కాపురం, మే 19 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ నాయకులు ఎన్ని దౌర్జన్యాలకు పాల్పడినా, అక్రమ కేసులు బనాయించి ఇబ్బందులు పెట్టినా మొక్కవోని దీక్షతో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు నిలబడి పోరాటం చేయబట్టే ప్రభుత్వం రాష్ట్రంలో ప్రభంజనం సృష్టించిందని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ మహానాడు కార్యక్రమం కాలేజీ రోడ్డులోని శుభం కన్వెన్షన్ హాలులో సోమవారం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ముందుగా స్థానిక దోర్నాల బస్టాండ్‌లోని పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆపరేషన్ సిందేర్‌లో దేశం కోసం ప్రాణాలర్పించిన వీర జవాన్లకు మౌనం పాటించి అంజలి ఘటించారు. అనంతరం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సత్యనారాయణ అధ్యక్షతన మహానాడు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల మాట్లాడుతూ టీడీపీ కార్యకర్తలు క్రమశిక్షణగల సైనికులన్నారు. వారి కృషి, త్యాగాల ఫలితంగానే పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. రాష్ట్ర భవిష్యత్ కోసం ఈ విజయాన్ని శాశ్వతం చేసుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. పార్టీ కుటుంబంలాంటిదన్నారు. చిన్నచిన్న సమస్యలుంటే మనమే అంతర్గతంగా సమీక్షించుకుని చక్కదిద్దుకోవాలన్నారు. మనపై ప్రతిపక్ష పార్టీ చేస్తున్న అసత్య ప్రచారాలను తిప్పకొట్టాలన్నారు. ఐదేళ్లపాటు రాక్షసపాలన సాగిందన్నారు. అన్ని వ్యవస్థలను వైసీపీ నాయకులు నిర్వీర్యం చేశారన్నారు. ముఖ్యంగా ఆర్థిక విధ్వంసంతో రాష్ట్రం వెనుకబడిపోయిందన్నారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ఎంతో అనుభవశాలి అయిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఒకవైపు సంక్షేమాన్ని కొనసాగిస్తూనే పారిశ్రామికంగా అభివృద్ధి చేసి రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎన్ని ఆర్థిక అవరోధాలు ఉన్నా ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారన్నారు. ఇక నుంచి గ్రామ, మండలస్థాయిలో సమస్యలను ఎక్కడికక్కడ పరిష్కరించుకోవాలన్నారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వాటిని మండల స్థాయిలోని కమిటీ దృష్టికి తీసుకెళ్లాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చూపాల్సిన అవసరం ఉందన్నారు. నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేసి విజయ ఢంకా మోగిద్దామన్నారు. చాలాచోట్ల గ్రామాల్లో వైసీపీ నాయకులు పెత్తనం చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. మన వాళ్ల సహకరించకుంటే వాళ్ల అంతటిస్థాయిలో రెచ్చిపోయే అవకాశాలు లేవన్నారు. ఎక్కడైనా కట్టుతప్పితే పార్టీ ఆదేశానుసారం క్రమశిక్షణ చర్యలు తప్పవన్నారు. పార్టీ భవితవ్యం మనందరికీ ముఖ్యమన్నారు. అభివృద్ధి కోసం అందరం కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు.



నివాళి అనంతరం ఎన్టీఆర్ విగ్రహం ముందు ఎమ్మెల్యే కందుల, టీడీపీ నాయకులు, కార్యకర్తలు

వెలిగొండ, మార్కాపురం జిల్లాను సాధిస్తా

పశ్చిమ ప్రకాశానికి ఆశాదీపమైన పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టును 2026 ఆగస్టు కల్లా పూర్తి చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. ఇప్పటికే సుమారు మూడు విడతల్లో ప్రభుత్వం నిధులు కూడా మంజూరు చేసిందన్నారు. గత వైసీపీ హయాంలో జగన్‌రెడ్డి ప్రాజెక్టు పూర్తికాకుండానే జాతికి అంకితం చేశారన్నారు. టన్నెల్స్ పనులను ఇష్టారీతిన చేశారన్నారు. ఏ బడ్జెట్‌లోనూ ప్రాజెక్టుకు గత వైసీపీ ప్రభుత్వం నిధులు కేటాయించలేదన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మంత్రుల బృందం ప్రాజెక్టు సమగ్ర స్వరూపాన్ని పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చిందన్నారు. ప్రస్తుతం పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయన్నారు. అదే విధంగా మార్కాపురం జిల్లా సాధన కోసం కృషి చేస్తున్నామన్నారు. ఇప్పటికే పలు పర్యాయాలు ముఖ్య నేతలను కలిసి జిల్లా ఆవశ్యకతను కూడా వివరించామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మార్కాపురాన్ని జిల్లా చేస్తానని ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందేనన్నారు. అలాగే మెడికల్ కాలేజీ పనులు కూడా పీపీపీ పద్ధతిలో త్వరలో ప్రారంభమవుతాయన్నారు. ఇవి పూర్తయితే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు. అంతేకాక ప్రతి నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు ఎం ఎస్ఎంఈ పార్కులను ప్రభుత్వంకేటాయించిందన్నారు.రిలయన్స్ బయోగ్యాస్ ప్లాంట్లు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రైతు లు ముందుకు వస్తే ఎన్ని ప్లాంట్లు అయినా ఇచ్చేందుకు కంపెనీ సిద్ధంగా ఉందన్నారు. ఇవి ఏర్పాటైతే ఈ ప్రాంతంలో వెనుకబాటుతనాన్ని రూపుమాపేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. ఈ సందర్భంగా పలువురు టీడీపీ ముఖ్య నేతలు ప్రసంగించారు. ఆయా పట్టణాలు, మండలాల్లోని సమస్యలను తెలియజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వక్కలగడ్డ మల్లికార్జున్, డాక్టర్ స్వర్ణ గీత, మాలపాటి వెంకటరెడ్డి, గుంటక సుబ్బారెడ్డి, వరికుంట్ల అనిల్, కామసాని రామిరెడ్డి, కంచర్ల కాశయ్య, అన్ని పట్టణ, మండల కమిటీల అధ్యక్ష, కార్యదర్శులు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎమ్‌పీటీసీలు, క్లస్టర్ ఇంచార్జీలు, బూత్ కమిటీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

నేడు గిద్దలూరులో మినీ మహానాడు

గిద్దలూరు టౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ మినీ మహానాడును మంగళవారం గిద్దలూరులో నిర్వహిస్తున్నట్లు టీడీపీ కార్యాలయం సోమవారం ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గల విరా సుబ్బరత్నం కల్యాణ మండపంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉదయం 9.30 గంటలకు మినీ మహానాడు ప్రారంభం అవుతుందని, నియోజకవర్గంలోని టీడీపీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆ ప్రకటనలో తెలిపారు.



అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

వైభవంగా పోలేరమ్మ తిరునాళ్ల

ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పొదలకొండపల్లి పంచాయతీ పరిధిలోని పొట్టిరెడ్డిపల్లె గ్రామంలో గత రెండు రోజులుగా పోలేరమ్మ తిరునాళ్ల వైభవంగా నిర్వహిస్తున్నారు. సోమవారం ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి తిరునాళ్లలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గోడి ఓబులరెడ్డి, గోపాల్, బైలడుగు బాలయ్య పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై కళాకారుల ప్రదర్శన



వీధి నాటకం ద్వారా అవగాహన కల్పిస్తున్న కళాకారులు

గిద్దలూరు టౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పలు కూడళ్లు, ఆర్టీసీ బస్టాండ్ వద్ద వీధి నాటకాల ద్వారా హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై కళాజాతా బృందం అవగాహన కల్పించారు. సోమవారం శ్రీవిఘ్నేశ్వర సొసైటీ కళాజాతా బృందం ఆధ్వర్యంలో ఎయిడ్స్ రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఎయిడ్స్ వ్యాధి ఎలా వస్తుంది, ఎలా వ్యాపించదు అంశాలపై కళాకారులు అవగాహన కల్పించారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత, చిన్నచూపు లేకుండా సమాజంలో కలిసి జీవించాలని, గర్భిణి నుంచి బిడ్డకు రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. సుఖవ్యాధులు, చికిత్స, కండోం ఉపయోగాల గురించి అవగాహన కల్పించారు. ఎయిడ్స్ వ్యాధి ఉన్న వారు ఏఆర్‌టీ యంత్రాల ద్వారా ఇచ్చే మందులు క్రమం తప్పకుండా వాడినట్లయితే జీవిత కాలం పెంచుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో బృందం సభ్యులు ప్రసాద్‌బాబు, ప్రివెన్షన్ యూనిట్ హెచ్‌వోసీ డైరెక్టర్ ఆనంద్‌బెంజిమన్, డిపో మేనేజర్ చంద్రశేఖర్, ఖాజావలి, భవాని, రిబ్కా, సునీతకరుణ పాల్గొన్నారు.

పోరాట యోధుడు సుందరయ్య

మార్కాపురం వన్‌టౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి) : ఉద్యమమే ఊపిరిగా కడదాకా నడిచిన పోరాట యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఎం నాయకుడు రూబెన్ అన్నారు. సుందరయ్య కాలనీలో సోమవారం సుందరయ్య వర్థంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో జవ్వాజి రాజు, కాశయ్య, నన్నేసా, మల్లికార్జున, రాజాబాబు, భాస్కర్, ఇమ్మానియేల్, అంజమ్మ, దేవమ్మ పాల్గొన్నారు.

సచివాలయ విధుల నుంచి తప్పించాలి

గిద్దలూరు టౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి) : గ్రామ సచివాలయం నుంచి తప్పించి 2019కి ముందు ఉన్న రెవెన్యూ క్లస్టర్ విధానంలో పని చేయించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు వైపీ రంగయ్య అన్నారు. ఆమేరకు మంగళవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా రంగయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీవోలో గ్రామ సచివాలయాలు, వార్డు సచివాలయాలు రేషనలైజేషన్‌లో భాగంగా గ్రామ రెవెన్యూ అధికారులకు పనిభారం పెరగడంతో మానసిక ఆందోళనకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వం ఈ సమస్యకు పరిష్కారం చూపాలన్నారు. గ్రామ రెవెన్యూ అధికారులను తహసీల్దార్ ఆధ్వర్యంలో విధులు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు హెచ్.వెంకటరామయ్య, మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.ఈశ్వర్‌రెడ్డి, యు.రాజశేఖర్‌రెడ్డి, వీఆర్వోలు అచ్చయ్య, నాగేంద్ర, కొండయ్య, స్వర్ణదేవి, రామయ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.

డీఈవో కార్యాలయ ముట్టడికి తరలిరండి



మాట్లాడుతున్న ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక నాయకులు

మార్కాపురం, మే 19 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక సంఘం పిలుపు మేరకు ఈ నెల 21న జరిగే డీఈవో కార్యాలయ ముట్టడి కార్యక్రమానికి భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని ఐక్య వేదిక నాయకులు కోరారు. జడ్పీ బాయ్స్ హైస్కూల్‌లో సోమవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో సంఘ నాయకులు మాట్లాడుతూ పాఠశాలల్లో సమాంతర మీడియం ఉండాలన్నారు. తెలుగు, ఇంగ్లీష్ బాషల్లో విద్యాబోధన జరగాలన్నారు. హైస్కూల్స్‌లో 40 మంది విద్యార్థులకు ఒక సెక్షన్ ఉండాలన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో హెడ్మాస్టర్లుగా ఎస్జీటీ ఉపాధ్యాయులకు పదోన్నతి ఇచ్చి భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్, ఎస్టీయూ, వైఎస్సార్‌టీఎ, ఆర్‌యూపీపీ యూనియన్‌ల నాయకులు ఓవీ వీరారెడ్డి, ఎస్‌కె మౌళాలి, పాపయ్య, దండా వెంకటరెడ్డి, టీవీ రమణ, పి.వెంకటేశ్వర్లు, బట్టగిరి చిన్నారెడ్డి, ఆర్‌పీబీ శ్రీనివాస్, ఎం.కృష్ణమూర్తి, ఎన్.శ్రీనివాసరెడ్డి, ప్రాన్సిస్, ఎస్.చంద్రశేఖరయ్య, జయరామిరెడ్డి, అల్లూరి శ్రీనివాసులు, బీవీ రాజారమేష్ పాల్గొన్నారు.

గిద్దలూరు : సమస్యల పరిష్కారం కోసం ఈనెల 21వ తేదిన ఉమ్మడి ప్రకాశం జిల్లా విద్యాశాఖ కార్యాలయం ముట్టడిని జయప్రదం చేయాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు కోరారు. ఇందులో భాగంగా ఐక్యవేదిక నాయకులు సోమవారం సాయంత్రం సమావేశమయ్యారు. ఈనెల 21న ఉమ్మడి జిల్లా కేంద్రంలో, 23న అమరావతిలోని విద్యాభవన్‌ను ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

పొదిలి : ఐక్య ఉపాధ్యాయ స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 21న జరిగే డిఈవో కార్యాలయ ముట్టడిని జయప్రదం చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పి బాలవెంకటేశ్వర్లు కోరారు. సోమవారం యూటీఎఫ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

ప్రభుత్వ సేవలు ప్రజలకు అందాలి

ఒంగోలు కలెక్టరేట్, మే 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ సేవలు పూర్తి స్థా యిలో ప్రజలకు అందించేలా జిల్లా కలె క్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశించారు. సోమవారం కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. స్టేట్ ప్రాజెక్టు మానటరింగ్ గ్రూప్, యోగాంధ్ర-2025 క్యాంపెయిన్, కోర్టు సముదాయాల్లో మరుగుదొడ్ల నిర్మాణాల పురోగతి, పథకాల సేవలు, ప్రజా స్పందనల వంటి అంశాలపై సమీక్షించారు. వాటికి సంబంధించి ప్రతి 15 రోజులకు ఒకసారి సమీక్షిస్తామని, ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే కలెక్టర్లు త్వరగా పూర్తి చేయాలన్నారు.



కథల పుస్తకాలను చదువుతున్న విద్యార్థులు

వేసవి శిక్షణతో ఉపయోగం

గిద్దలూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ తరగతులు విద్యార్థులకు ఎంతో ఉపయోగమని గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి అన్నారు. ఇప్పటివరకు నేర్చుకున్న చదరంగం ఆటపై సోమవారం పోటీలు నిర్వహించారు. చిన్నారుల చేత కథలు చదివించి అందులో నీతిని చెప్పించారు. కార్యక్రమంలో యువ ప్రగతిపథం అధ్యక్షులు ఫరూఖ్, ఫ్యాకల్టీ రామిరెడ్డి పాల్గొన్నారు.

బేస్తవారపేట : బేస్తవారపేట గ్రంథాలయంలో విద్యార్థులకు జరుగుతున్న వేసవి తరగతుల శిక్షణ కార్యక్రమం వరమని గ్రంథపాలకుడు పీవీ సుబ్బారెడ్డి అన్నారు. విద్యార్థులు వేసవిలో బయట తిరగకుండా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన శిక్షణ వారికి ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. విద్యార్థులకు కథలు చెప్పడం, చదివించడం, చదరంగం, స్పోకెన్ ఇంగ్లీష్, గ్రామర్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు పీవీ గురుస్వామి పాల్గొన్నారు.

వైస్ ఎంపీపీ ఎన్నిక ప్రశాంతం



ధ్రువీకరణ పత్రాన్ని అందుకుంటున్న మల్లారెడ్డి

మార్కాపురం రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశపు హాలులో వైస్ ఎంపీపీ ఎన్నిక ప్రశాంతంగా జరిగింది. ఎన్నికల నిర్వహణ అధికారి డీఎల్‌డీవో కొల్లి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఎంపీడీవో శ్రీనివాసులుతో కలిసి సోమవారం నిర్వహించారు. మండలంలో మొత్తం 15 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, రెండు స్థానాలు ఖాళీ అయ్యాయి. ప్రస్తుతం 13 మంది వైసీపీ ఎంపీటీసీలు ఉండగా, ఈ ఎన్నికకు మండలంలోని 11 మంది ఎంపీటీసీ సభ్యులు హాజరయ్యారు. అందరూ కలిసి ఏకగ్రీవంగా కొండేపల్లి వైసీపీ ఎంపీటీసీ సభ్యుడు కుందురు మల్లారెడ్డిని ఎన్నుకున్నారు. గజ్జలకొండ 1, 2 ఎంపీటీసీలు ఇద్దరు ఈ ఎన్నికకు హాజరు కాలేదు. డీఎల్‌డీవో శ్రీనివాసరెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసులు వైస్ ఎంపీపీగా ఎన్నికైన మల్లారెడ్డికి ధ్రువీకరణ పత్రాన్ని అందజేసి ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం వైస్ ఎంపీపీని ఎంపీపీ బండి లక్ష్మీదేవి, జడ్పీటీసీ సభ్యుడు నారు బాపన్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, నాయకులు సన్మానించారు.

కృష్ణ ఎన్నిక ఏకగ్రీవం

ఎర్రగొండపాలెం, మే 19 (ఆంధ్రజ్యోతి) : త్రిపురాంతకం మండల పరిషత్ ఉపాధ్యక్షుడిగా మేడపి గ్రామ ఎంపీటీసీ సభ్యుడు పాటిబండ్ల కృష్ణ ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారని ఎన్నికల అధికారి డీజే వండర్‌మెన్ తెలిపారు. సోమవారం ఉదయం వైస్ ఎంపీపీ కోసం మేడపి ఎంపీటీసీ సభ్యుడు పాటిబండ్ల కృష్ణ నామినేషన్ దాఖలు చేశారు. ఆ యన పేరును ముడివేముల ఎంపీటీసీ సభ్యుడు సాయపునేని సుబ్బారావు ప్రతిపాదించగా, ఎంపీపీ ఆళ్ల సుబ్బమ్మ బలపరిచారు. 12 ఎంపీటీసీ సభ్యుడు హాజరై ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. అనంతరం ఎన్నికల అధికారి వండర్‌మెన్ కొత్తగా ఎంపికైన వైస్ ఎంపీపీ కృష్ణ చేత ప్రమాణం స్వీకారం చేయించి, ఎన్నికైనా డిక్లరేషన్ ఫారాన్ని అం దజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, ఎంపీపీ ఆళ్ల సుబ్బమ్మ, ఎంపీడీవో రాజ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యుడు ఆళ్ల ఆంజనేయరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



ఎన్నికల అధికారి నుంచి ధ్రువీకరణ పత్రాన్ని స్వీకరిస్తున్న కృష్ణ

భారత్ జోలికొస్తే బుద్ధి చెప్పక తప్పదు

- ఎమ్మెల్యే నారాయణరెడ్డి
- పట్టణంలో ఉత్సాహంగా తిరంగా ర్యాలీ

మార్కాపురం, మే 19 (ఆంధ్రజ్యోతి) : భారతదేశం జోలికొస్తే ఎవరికైనా బుద్ధి చెప్పక తప్పదని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన నేపథ్యంలో సోమవారం ఉదయం పట్టణంలో టీడీపీ, జనసేన పార్టీ, బీజేపీ, రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగులు, మెప్మా, మున్సిపల్ సిబ్బంది, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జాతీయ జెండాలతో తిరంగా ర్యాలీని నిర్వహించారు. ముందుగా స్థానిక గడియార స్తంభం వద్ద ర్యాలీనీ ఎమ్మెల్యే నారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగ్రదాడులతో పొరుగు దేశం పాకిస్థాన్ దుందుడుకు చర్యలకు మన దేశ ఆర్మీ దీటుగా సమాధానం ఇచ్చిందన్నారు. ఒకవైపు ఉగ్రవాదులను దేశంలోనే ఉంచుకుని దేశంపైకి పురిగొల్పిందన్నారు. మన దేశ రక్షణ వ్యవస్థ సత్తా ఏంటో ప్రపంచానికి తెలిసిందన్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మేకిన్ ఇండియా నినాదంతో స్వదేశీ పరిజ్ఞానాన్ని పెంపొందించుకుంటున్నామన్నారు. రక్షణరంగంలో ఎవరికీ తీసిపోని దుర్భేధ్యంగా తయారైందన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో దేశం కోసం కొందరు సైనికులు వీరమరణం పొందారన్నారు. వారి త్యాగాలు వెలకట్టలేనివన్నారు. ర్యాలీ దోర్నాల బస్టాండ్ వరకు సాగింది. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వక్కలగడ్డ మల్లికార్జున్, తాళ్లపల్లి సత్యనారాయణ, మాలపాటి వెంకటరెడ్డి గుంటక సుబ్బారెడ్డి, బీజేపీ నాయకులు పీవీ కృష్ణారావు, శాసనాల సరోజిని, శిరసనగండ్ల శ్రీనివాసులు, మద్దెల లక్ష్మి, జనసేన నాయకులు ఎస్‌వీ సురేష్‌బాబు, ఖాశిం, రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగులు, మెప్మా మహిళలు పాల్గొన్నారు.



తిరంగా ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే కందుల, నాయకులు, రిటైర్డ్ ఆర్మీఉద్యోగులు



పొగాకు ధరలపై వేలం నిర్వహణాధికారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ

రైతులను ఆదుకోవాలి

ఎమ్మెల్యే బూచేపల్లి

పొదిలి, మే 19 (ఆంధ్రజ్యోతి) : అమరావతితోపాటు రైతులనూ ఆదుకోవాలని వైసీపీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక పొగాకు బోర్డ్‌ను ఆయన సందర్శించారు. అనంతరం రైతులతో మాట్లాడి ప్రస్తుత ధరలు ఎలా ఉన్నాయని ఆరా తీశారు. రైతులు ధరలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని నిధులు కేటాయించి మార్క్‌ఫెడ్‌తో కొనుగోలు చేయించాలన్నారు. రాజధాని కోసం వేల కోట్లు ఖర్చు చేస్తున్నారని అందులో కొంత రైతులకు కేటాయించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ రైతుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిట్టుబాటు ధర కల్పించే విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రైతు బాగుంటేనే మనందరం బాగుంటామన్నారు. కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ రమణారెడ్డి, పంచాయతీరాజ్ విభాగం కార్యదర్శి సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, కొనకనమిట్ల జడ్పీటీసీ సభ్యుడు అక్కిదాసరి ఏడుకొండలు, చెన్నారెడ్డి, శ్రీను, వెంకటరెడ్డి, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

ప్రతి అర్జీనీ పరిష్కరిస్తాం

ఎర్రగొండపాలెం, మే 19 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన ప్రతి అర్జీనీ పరిష్కరిస్తామని తహసీల్దార్ మంజునాథరెడ్డి తెలిపారు. ఎంపీడీవో కార్యాల యంలో సోమవారం జరిగిన మీకోసం కార్యక్రమంలో ప్రజల నుంచి ఆయన అర్జీలను స్వీకరించారు. సర్వేనెంబరు 539లో కొండ పోరంబోకు భూములు కొన్నేళ్లుగా తమ స్వాధీనంలో ఉన్నాయని ఆ భూమిలో నివేశస్థలాల పట్టాలు మంజూరు చేయాలని తిరుమలగిరి గిరిజనులు సోమవారం అర్జీ ఇచ్చారు. వీరభద్రాపురంలో తమ ఇంటికి కరెంటు బిల్ రూ.40వేలు వచ్చిందని సమస్యను పరిష్కరించాలని యజమాని అర్జీ అందజేశారు. గోళ్లవీడపిలో తమ భూమికి ఆన్‌లైన్ చేయాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో బీ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.



కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

కంభం, మే 19 (ఆంధ్రజ్యోతి) : శ్రవణా నక్షత్రం సందర్భంగా సోమవారం శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. దంపతులు, భక్తులు పాల్గొన్నారు. పూజారి ఆంజనేయశర్మ స్వామి కల్యాణాన్ని జరిపించిన అనంతరం తీర్థప్రసాదాలను అందజేశారు.

ఆంజనేయ స్వామికి తమలపాకుల అలంకరణ



తమలపాకుల అలంకరణలో ఆంజనేయస్వామి

మార్కాపురం వన్‌టౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి) : నాగులపుట్ట వీరంజనేయస్వామి ఆలయంలో స్వా మి జయంతి ఉత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు స్వామి మూలవిరాట్‌కు అభిషేకం, విశేష అలంకారం, అర్చన నిర్వహించారు. అనంతరం తమలపాకులతో మూల విరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామిని దర్శించుకున్నారు. దేవస్థానం కమిటీ అధ్యక్షుడు కాశీరామ్‌సింగ్, ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు, కార్యదర్శి సురేష్, కోశాధికారి రామడుగు వెంకటసుబ్బయ్యల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.

నేడు తిరంగా ర్యాలీ

గిద్దలూరు టౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి) : భారత్ సైనికుల విరోచిత పోరాటానికి సంఘీభావంగా మంగళవారం పట్టణంలో తిరంగార్యాలీ ఉదయం 8.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు టీడీపీ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో గాంధీబొమ్మ సెంటర్ నుంచి ఆర్టీసీ బస్టాం డ్ వరకు తిరంగా ర్యాలీ నిర్వహించనున్నారు. బీజేపీ, జనసేన పార్టీ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు మాజీ సైనికులు, రిటైర్డ్ ఉద్యోగులు, యువకులు తిరంగా ర్యాలీలో పాల్గొనాలని కోరారు.

సుందరయ్య ఆశయబాటలో పయనించాలి

పామూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): పుచ్చలపల్లి సుందరయ్య ఆశయ సాధన కోసం కార్యకర్తలు ఆయన చూపిన బాటలో పయనించి పార్టీ అభివృద్ధికి పాటుపడాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సయ్యద్ హనీఫ్ అన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి షేక్ పాపిరెడ్డిపల్లి మీరావలి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు షేక్ అల్లాభక్ష్, షేక్ ఖాదర్‌బాషా, కె.మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి కృషి చేయాలి

పామూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): టీడీపీ బలోపేతానికి గ్రామ కమిటీలు కృషి చేయాలని ఆపార్టీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని నర్రమారెళ్ల, నుచ్చుపొద గ్రామ పంచాయతీల్లో గ్రామ కమిటీల ఎంపిక కోసం కార్యకర్తలతో సమావేశం ఆదివారం రాత్రి నిర్వహించారు. ఈసందర్భంగా నర్రమారెళ్ల గ్రామ అధ్యక్షుడిగా గుంటుపల్లి నాగమల్లేశ్వరరావు, నుచ్చుపొద గ్రామ అధ్యక్షుడిగా కామేపల్లి సూర్యప్రకాష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. కార్యక్రమాల్లో నాయకులు ప్రభాకర్‌చౌదరి, బి.నరసింహారావు, అమీర్‌బాబు, జి.శ్రీను, కోటిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నారాయణస్వామి హుండీ ఆదాయం రూ.2 లక్షల 50వేలు

సీఎస్‌పురం(పామూరు), మే 19 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం శ్రీనారాయణస్వామి దేవస్థానం ఆదివారం హుండీ ఆదాయం రూ.2,50,954 వచ్చినట్లు ఈవో నరసింహబాబు తెలిపారు. మండలంలోని చిలంకూరు గ్రామానికి చెందిన కాకునూరి చిన్న వెంకటేశ్వర్లు, గురవమ్మ దంపతులు మహాప్రాకార నిర్మాణానికి రూ.41,116 విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో దేవస్థాన వ్యవస్థాపక అధ్యక్షుడు కొమ్మినేని చిన్నఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి

సీఎస్‌పురం(పామూరు), మే 19 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై అధికారులు దృష్టి సారించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. సోమవారం మీ కోసం కార్యక్రమంలో భాగంగా అధికారులతో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యక్రమంలో పామూరు, సీఎస్‌పురం ఎంపీడీవోలు ఎల్.బ్రహ్మయ్య, కె.వాణి, ఏపీవో బి.మల్యాద్రి పాల్గొన్నారు.

పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

తాళ్లూరు, మే 19(ఆంధ్రజ్యోతి): పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. స్థానిక ప్రభుత్వ ఉన్నతపాఠశాల, శ్రీసరస్వతీ హైస్కూల్‌లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. తెలుగు పరీక్షకు 33 మంది హాజరుకావాల్సి ఉండగా, 12మంది గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను ఎంఈవో జి.సుబ్బయ్య తనిఖీ చేశారు.

బార్ అసోసియేషన్ కార్యవర్గం

దర్శి, మే 19(ఆంధ్రజ్యోతి): దర్శి బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పల్లెపోగు ప్రేమ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా కిలారి రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శిగా ఎన్.సుబ్బారెడ్డి, సహాయ కార్యదర్శిగా మారెడ్డి లక్ష్మీనారాయణ, కోశాధికారిగా ఎస్.మనోహరమ్మ, మహిళా కార్యదర్శిగా వి.శాంతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే, లైబ్రేరియన్‌గా వీరిశెట్టి శ్రీను, ఎగ్జిగ్యూటివ్ సభ్యులుగా వీరపనేని రంగా, శివశర్మ, ఎర్రంశెట్టి రాజశేఖర్, ఎస్ఎంవీఎల్ నర్సింహారావు, వి.శ్రీనివాసరెడ్డి ఎన్నికయ్యారు.

24న దర్శిలో జాబ్‌మేళా

దర్శి, మే 19(ఆంధ్రజ్యోతి): స్థానిక పొట్టి శ్రీరాములు డిగ్రీ కళాశాలలో ఈనెల 24న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల కరస్పాండెంట్ పి.పెద్దిరాజు తెలిపారు. ఈ మేళాలో 15 బహుళ జాతీయ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. నిరుద్యోగ యువతీ యువకులు ఈ జాబ్ మేళాలో పాల్గొని ఉద్యోగ అవకాశాలు పొందాలని ఆయన కోరారు.

ప్రశాంతంగా తిరునాళ్లను నిర్వహించాలి

సీఎస్‌పురం(పామూరు), మే 19 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురంలోని రాచూరి పెద్దమ్మతల్లి తిరునాళ్లను ప్రశాంతంగా జరుపుకొనేలా దేవస్థాన నిర్వాహకులు తగిన చర్యలు చేపట్టాలని సీఐ ఎం.బీమానాయక్ సూచించారు. సోమవారం సీఎస్‌పురంలోని వడ్డెరాజుల నగర్‌లో సోమవారం దేవస్థాన నిర్వాహకులు, వివిధ సామాజికవర్గాల నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 30 నుంచి జూన్ 5వరకు జరిగే తిరునాళ్లలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు, వివాదాలకు అవకాశం ఇవ్వరాదన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ సుమన్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక

సీఎస్‌పురం(పామూరు), మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డిజీపేట గ్రామానికి చెందిన బీసీ నాయకుడు చీపు శ్రీనివాసులు వైసీపీని వీడి మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు బోయిళ్ల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఉగ్ర సమక్షంలో సోమవారం టీడీపీలో చేరారు. కనిగిరిలో జరిగిన మినీమహానాడు కార్యక్రమంలో టీడీపీలో చేరగా ఉగ్ర పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

కార్యకర్తల సంక్షేమమే నా అజెండా!

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి
- మినీమహానాడుకు భారీగా తరలివచ్చిన టీడీపీ శ్రేణులు



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి



నామినేటెడ్ పదవులు పొందిన వారిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

కనిగిరి, మే 19 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తల సంక్షేమమే తన అజెండా అని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. సోమవారం కనిగిరిలోని ప్రైవేటు ఫంక్షన్ హాలులో జరిగిన మినీమహానాడులో తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి డాక్టర్ ఉగ్ర పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం టీడీపీ నేతలతో కలసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతం ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలు, నాయకులు, శ్రేణులు, అభిమానులే పార్టీకి ముఖ్యమన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి హామీని పూర్తి చేసేందుకు తాను కష్టపడుతున్నానన్నారు. అదే సమయంలో కార్యకర్తలకు, శ్రేణులకు దగ్గరగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు చెప్పారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో భాగంగా ఒక్కొక్కటిగా నెరవేర్చే క్రమంలో కొంత కార్యకర్తలకు, నాయకులకు తాను దూరంగా ఉన్నా, వారి మనసులకు దగ్గరగానే ఉన్నానని మినీమహానాడుకు వచ్చిన జన వాహిని మరోసారి రుజువు చేసిందన్నారు. పార్టీ కోసం పనిచేసిన ప్రతి నాయకుడికి పదవుల కల్పించడంలో స్వార్థానికి తావులేకుండా ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన చంద్రబాబుతోనే సాధ్యమని నేటి పాలన రుజువు చేస్తుందన్నారు. కనిగిరి లాంటి మారుమూల ప్రాంతంలో పారిశ్రామిక బాటలు వేసేందుకు తన సంకల్పానికి చేయూత ఇస్తూ ముందుకు నడిపిస్తున్న సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌కు రుణపడి ఉంటామన్నారు. రిలయన్స్ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుతో కనిగిరిలోని ప్రజలకు ఉపాధి లభిస్తుందన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో రైల్వే లైన్, ట్రిపుల్‌ఐటీ, బైపాస్, మంచినీటి సమస్య పరిష్కారానికి కృషి చేసి నట్లు చెప్పారు.

టీడీపీ ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడు, రాష్ట్ర పర్యాటకశాఖ అభివృద్ధి చైర్మన్ నూకసాని బాలాజి మాట్లాడుతూ తెలుగు దేశం పార్టీ సంస్థాగతంగా బలంగా ఉందంటే చంద్రబాబు సారథ్యం, కార్యక ర్తల కృషి అని అన్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు నోళ్ళు పెగిలిన నేతలు ఇప్పుడు పత్తా లేకుండా పోయారన్నారు. అధికారాన్ని చూసి విర్రవీగితే కాలమే సమాధానమే చెప్తుందని చేప్పేరోజులు ఇంకా ఉన్నాయన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను చంద్రబాబు ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నారన్నారు. కనిగిరి నియోజకవర్గంలో అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయిస్తూ ఎమ్మె ల్యే డాక్టర్ ఉగ్ర ముందంజలో ఉన్నారని నూకసాని బాలాజీ పేర్కొన్నారు. అనంతరం మినీమహానాడుకు సంబంధించి తీర్మానాలు చేశారు. తొలుత వివిధ కారణాలచే మృతి చెందిన టీడీపీ శ్రేణులకు సంతాపం వెలిబుచ్చి కొద్దిసేపు మౌనం పాటించారు.



మినీమహానాడులో పాల్గొన్న టీడీపీ శ్రేణులు

కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ శ్యామల కాశిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ యారవ రమాదేవి, టీడీపీ మండల కన్వీనర్ పిచ్చాల శ్రీనివాసులురెడ్డి, ఆరు మండలాల అధ్యక్షులు నంబుల వెంకటేశ్వర్లు, పువ్వాడి రామయ్య, పువ్వాడి వెంకటేశ్వర్లు, బొమ్మనబోయిన వెంగయ్య, సానికొమ్మ తిరుపతిరెడ్డి (ఎస్టీఆర్), ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, మైనారిటీ నాయకులు రోషన్ సంధాని, జంషీర్ అహ్మద్, అహ్మద్, పట్టణ అధ్యక్షుడు తమ్మినేని శ్రీనివాసులురెడ్డి, నారపరెడ్డి (యడవల్లి) శ్రీనివాసులురెడ్డి, ఫిరోజ్, ముచ్చుమూరి చెంచిరెడ్డి, గోనా ప్రతాప్, అడుసుమల్లి ప్రభాకర్, బ్రహ్మం గౌడ్, కరణం అరుణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం: మినీమహానాడులో నామినేటెడ్ పదవులు పొందినవారిని ఘనంగా సన్మానించారు. డీసీఎంఎస్ చైర్మన్ శ్యామల కాశిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ యారవ రమాదేవి, పీఏసీయార్డు సొసైటీ చైర్మన్ తోడేటి గోపిలను ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి సత్కరించారు.

ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్థాన్‌కు గుణపాఠం

కనిగిరి, మే 19 (ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్ ఉగ్రవాదులకు ఆపరేషన్ సిందూర్ ద్వారా తగిన గుణపాఠం చెప్పామని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. అపరేషన్ సిందూర్‌ను ప్రయోగించి ప్రత్యర్థి పాకిస్థాన్ ముష్కరులకు తగిన గుణపాఠం చెప్పిన భారత త్రివిధ దళాలకు సంఘీభావంగా ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ సోమవారం నిర్వహించారు. పామూరు బస్టాండు సెంటరులో జరిగిన మానవహారంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ భవిష్యత్తులో ఇండియా వైపు కుట్రలు పన్నే ప్రతి ఒక్కరికి ఈ ఆపరేషన్ ఒణుకు పుట్టించేలా శ్రమించిన భారత త్రివిధ దళాధిపతులకు, జవాన్లుకు శిరస్సు వంచి పాదాభివందనాలు చేస్తున్నానన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఆర్డీవో, తహసీల్దార్ రవిశంకర్, మున్సిపల్ కమిషనర్ జోసఫ్‌దానియేలు, వివిధశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి, తదితరులు

సంక్షేమానికి ఆద్యుడు ఎన్టీఆర్

టీడీపీ ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడు డాక్టర్ నూకసాని బాలాజీ

దర్శి, మే 19(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమానికి ఆద్యుడు ఎన్టీఆర్ అని టీడీపీ ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడు, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ అన్నారు. దర్శిలో సోమవారం సాయంత్రం జరిగిన మినీ మహానాడులో ఆయన మాట్లాడుతూ అవినీతి అక్రమాల్లో కూరుకుపోయిన అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించి పార్టీ పెట్టిన 9 నెలల్లో అధికారం చేపట్టిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కిందన్నారు. ఆయన సాధించిన విజయం గిన్నీస్ రికార్డుల్లోకి ఎక్కిందన్నారు. తెలుగు జాతి ఖ్యాతిని ప్రపంచ వ్యాప్తంగా ఇనుమడింపజేసిన మహనీయుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. వైసీపీ అరాచక పాలనకు అంతమొందించిన యోధుడు చంద్రబాబు అని చెప్పారు. ప్రజల సొమ్ము దోచుకొని ప్రజలపై అక్రమ కేసులు బనాయించిన వైసీపీ నాయకులు చట్టం నుంచి తప్పించుకోలేరని స్పష్టం చేశారు. వైసీపీ పాలనలో అక్రమాలకు పాల్పడిన నాయకులు, అధి కారులు జైళ్లకు క్యూ కడుతున్నారన్నారు.

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు గౌరవం ఇచ్చి తగిన గుర్తింపు ఇస్తామన్నారు. కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. టీడీపీ కార్యకర్తల జోలికి రావాలంటే ముందు నన్ను దాటి రావాలని స్పష్టం చేశారు. పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం ఎన్టీఆర్ పార్టీని స్థాపించటం జరిగిందన్నారు. ఆయన ఆశయాలతో చంద్రబాబు రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను గతంలో ఎన్నడూలేని విధంగా అమలు చేస్తున్నారని చెప్పారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దర్శి నియోజకవర్గంలో నిలిచిపోయిన అభివృద్ధి పథకాలు ప్రారంభమయ్యాయన్నారు. గడచిన 11 నెలల్లో దర్శి అభివృద్ధికి రూ.125 కోట్లు సాధించామన్నారు. పార్టీ అభ్యున్నతికి కార్యకర్తలు, నాయకులు సమిష్టిగా కృషి చేయాలన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, పాల్గొన్న నూకసాని బాలాజీ, మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే పాపారావు తదితరులు

రాష్ట్ర వ్యవసాయ మిషన్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లా డుతూ ప్రతిఒక్కరూ పార్టీ పట్ల నిబద్ధతతో పనిచేస్తే గుర్తింపు లభిస్తుందన్నారు. అం దుకు తామే నిదర్శనమని అన్నారు. టీడీపీలో కష్టపడి పనిచేసిన వారు ఉన్నత శిఖరాలు అందుకునే అవకాశం ఉంటుందన్నారు. టీడీపీని బలో పేతం చేసేందుకు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. దర్శి నియోజకవర్గ అభివృ ద్ధికి అహర్నిశలు పనిచేస్తున్నారని ప్రశంసించారు. మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు, నాయకులు సమిష్టిగా పనిచేసి దర్శిలో విజయపతాకాన్ని ఎరుగవేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గత టీడీపీలో పనులు చేసిన నిర్వాహకులకు బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఆ పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని సూచించారు.



మినీమహానాడులో పాల్గొన్న టీడీపీ శ్రేణులు

కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, ఏఎంసీ చైర్మన్ దారం నాగవేణి, సుబ్బారావు, తాళ్లూరు ఎంపీపీ పి.శ్రీనివాసరావు, దర్శి పట్టణ టీడీపీ అధ్యక్షుడు పుల్లలచెరువు చిన్నా, రూరల్ అధ్యక్షుడు మారెళ్ల వెంకటేశ్వర్లు, దొనకొండ పట్టణ అధ్యక్షుడు షేక్ తోహీద్, రూరల్ అధ్యక్షుడు మోడి ఆంజనేయులు, కురిచేడు పట్టణ అధ్యక్షుడు మేడా నాగేశ్వరరావు, రూరల్ అధ్యక్షుడు పిడతల నెమలయ్య, ముండ్లమూరు, తాళ్లూరు మండలాల పార్టీ అధ్యక్షులు కూరపాటి శ్రీనివాసరావు, మేడగం వెంకటే శ్వరరెడ్డి, మాజీ ఎంపీపీ మందలపు వెంకటరావు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ కె. వెలుగొండారెడ్డి, తెలుగు మహిళా నాయకురాలు ఎం.శోభారాణి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అకాల వర్షానికి తడిసిన వరి ఓదెలు



వర్షానికి తడిసిన వరి ఓదెలు

తాళ్లూరు, మే 19(ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం ఉదయం కురిసిన అకాల వర్షానికి పలుగ్రామాల్లో కోసిన వరి ఓదెలు తడిసిపోయాయి. దారంవారిపాలెం, తూర్పుగంగవరం, సోమవరప్పాడు తదితర గ్రామాల్లో వరి కోతలు కోసి పొలాల్లో ఓదెలు వేశారు. వర్షానికి ఓదెలు తడిసిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మొక్కజొన్న పంట కోత పూర్తికాగా 90శాతం మేర అమ్మకాలు పూర్తయ్యాయి. కోత కోసి అమ్మేందుకు సిద్ధంగా ఉంచిన మిగిలిన పది శాతం మొక్కజొన్న గింజలను వర్షానికి తడవకుండా ఉండేందుకు రైతులు పడరాని పాట్లు పడ్డారు. పలుగ్రామాల్లో సైడు కాలువలు పూడకుపోవడంతో వర్షపు నీరు రోడ్లపై ప్రవహించింది.

తాళ్లూరులోని తూర్పుపాలెంలో మురుగు కాలువలు లేకపోవడంతో వర్షపునీరు రోడ్డుపై చేరింది. దీంతో ఆప్రాంత ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తూర్పుగంగవరం, సోమవరప్పాడు, దోసకాయపాడు ఎస్సీ కాలనీ, తదితర గ్రామాల్లో మురుగు నీరు రోడ్లపై ప్రవహించటంతో ప్రజలు నానా అవస్థలు పడ్డారు.

పార్టీ పదవుల కేటాయింపులో సమతుల్యం

- దర్శి నియోజకవర్గంలో టీడీపీ కమిటీల నియామకం పూర్తి

దర్శి, మే 19(ఆంధ్రజ్యోతి): దర్శి నియోజకవర్గంలో టీడీపీ పదవుల నియామకంలో సమతుల్యం పాటించటంతో పాటు బలహీన వర్గాలకు పెద్దపీట వేశారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు, మాజీ ఎమ్మెల్యే పాపారావు కలిసి అన్నీ మండలాల నాయకులు, కార్యకర్తలతో చర్చించి కమిటీలను ఎంపిక చేశారు. నియోజకవర్గంలోని మూడు మండలాల పార్టీ అధ్యక్షులుగా బీసీలను నియమించారు. దొనకొండ పట్టణ టీడీపీ అధ్యక్షుడుగా మైనార్టీ వర్గానికి చెందిన వ్యక్తికి అవకాశం కల్పించారు. కురిచేడు పట్టణ అధ్యక్షుడిగా వైశ్య సామాజికవర్గానికి చెందిన నాయకుడికి పదవి కట్టబెట్టారు. మిగిలిన పదవులు జనరల్ కేటగిరికి దక్కాయి. మండల కమిటీలను సోమవారం సాయంత్రం మినీ మహనాడులో పార్టీ జిల్లా అధ్యక్షుడు, పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ నూకసాని బాలాజీ అధికారికంగా ప్రకటించారు.

టీడీపీ దర్శి పట్టణ అధ్యక్షుడిగా పుల్లలచెరువు చిన్నా, దర్శి మండల అధ్యక్షుడిగా మారెళ్ళ వెంకటేశ్వర్లు, దొనకొండ మండల అధ్యక్షుడిగా మోడి ఆంజనేయులు, దొనకొండ పట్టణ అధ్యక్షుడిగా షేక్ తోహీద్‌అంజూమ్, కురిచేడు మండల అధ్యక్షుడిగా పిడతల నెమలయ్య, కురిచేడు పట్టణ అధ్యక్షుడిగా మేడా నాగేశ్వరరావు, తాళ్లూరు మండల అధ్యక్షుడిగా మేడగం వెంకటేశ్వరరెడ్డి, ముండ్లమూరు మండల అధ్యక్షుడిగా కూరపాటి శ్రీనివాసరావును నియమించారు. మండల కమిటీలు, పట్టణ కమిటీల నియామకంలో పార్టీలోని నాయకులు, కార్యకర్తలతో చర్చించి ఆమోదయోగ్యమైన కమిటీలను నియమించారని పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

దొనకొండ, మే 19(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు దుక్కులు చేసుకొని పచ్చిరొట్ట ఎరువు పంటలను సాగు చేయాలని మండల వ్యవసాయాధికారి లక్ష్మీనారాయణ సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వ్యవసాయశాఖ ద్వారా పచ్చిరొట్ట విత్తనాలు అయిన జనుములు, పిల్లి పెసరలు, జీలుగలు 50 శాతం రాయితీపై అందజేస్తున్నట్లు తెలిపారు. ఈఏడాది మండలానికి జీలుగలు మూడు క్వింటాళ్లు, జనుములు ఏడు క్వింటాళ్లు కేటాయించినట్టు చెప్పారు. పచ్చిరొట్ట వేయటం వల్ల నేల గుల్లగా మారి నీరు ఇంకే గుణం పెరుగుతుందన్నారు. నేలలో సూక్ష్మజీవులు పెరిగి జీవరసాయనిక చర్యలు కూడా జరుగుతాయన్నారు. తద్వార నేల సారం పెరిగి ఉత్పాదకత సామర్థ్యం పెరుగుతుందన్నారు. పచ్చిరొట్ట విత్తనాలు కావాల్సిన రైతులు ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకం, సెల్‌ఫోన్ నెంబరుతో రైతుసేవా కేంద్రానికి వెళ్లి కావాల్సిన విత్తనాలు పొందవచ్చునని తెలిపారు.

మెరుగైన విద్యావ్యవస్థకు ప్రభుత్వ కృషి అభినందనీయం

దొనకొండ, మే 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత ఐదేళ్లుగా అస్తవ్యస్తమైన విద్యావ్యవస్థను ప్రస్తుత ప్రభుత్వం గాడిలో పెడుతుందని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం నాయకులు రెహమాన్, మండ్లా శ్రీనివాసులు అన్నారు. మెరుగ్గైన విద్యావ్యవస్థ కోసం ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ప్రతి పంచాయతీలో మోడల్ ప్రైమరీ స్కూల్, 60 మంది పిల్లలు ఉంటే ఐదు ఉపాధ్యాయ పోస్టులు మంజూరు చేస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యకోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందన్నారు. ఒక్క పాఠశాలను మూసివేయకుండా గత ప్రభుత్వంలా పోస్టులు రద్దు చేయకుండా మెరుగ్గైన విద్యావ్యవస్థే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో తగినంత పిల్లలు పెరిగేలా చూసుకుంటే తప్ప ప్రభుత్వ పాఠశాలల్లో నియామకాలు ఉండవని, ఆదిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని వారు కోరారు.

దొనకొండలో ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలపాలి



రైల్వే డివిజనల్ సీనియర్ డీవోఎంకు వినతిపత్రం అందజేస్తున్న అడ్వకేట్ జయరావు

దొనకొండ, మే 19(ఆంధ్రజ్యోతి): దొనకొండ రైల్వేస్టేషన్‌లో కరోనా సమయం నుంచి ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం లేకపోవటంతో ఈ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై దొనకొండకు చెందిన అడ్వకేట్ జొన్నలగడ్డ జయరావు స్థానిక ప్రజల విజ్ఞప్తులతో హైకోర్టును ఆశ్రయించారు. గుంటూరు రైల్వే ఉన్నతాధికారులను ఈవిషయమై హైకోర్టు వివరణ కోరింది. అందుకు గుంటూరు రైల్వే సీనియర్ డివిజనల్ ఆపరేటింగ్ మేనేజర్ జాగిర్‌నాద్ శ్రీనాథ్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన నిర్ణయం తీసుకుంటామని నెలక్రితం హైకోర్టుకు స్పష్టం చేశారు.

ఈవిషయమై అడ్వకేట్ జయరావు సోమవారం గుంటూరు రైల్వే డివిజనల్ కార్యాలయంలో సీనియర్ డీవోఎం శ్రీనాథ్‌ను కలుసుకొని దొనకొండలో ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టింగ్ సమస్యను ప్రస్తావించారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించి ఇప్పటికే జోనల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, వీలైనంత త్వరలో దొనకొండ రైల్వేస్టేషన్‌లో ఐదు లేదా ఆరు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపింగ్ సౌకర్యం కల్పుతుందని స్పష్టమైన హామీ ఇచ్చినట్లు అడ్వకేట్ జయరావు తెలిపారు.

డీఈవో కార్యాలయ ముట్టడిని విజయవంతం చేయాలి

దర్శి, మే 19(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈనెల 21న తలపెట్టిన డీఈవో కార్యాలయ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కేవీజీ కీర్తి పిలుపునిచ్చారు. సోమవారం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో దర్శి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి మీనుగ శ్రీనివాసరావు, కె.వెంకటేశ్వర్లు విక్రమ్, నాగార్జున అట్లూరి రామారావు, బైరెడ్డి రంగారావు, టి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సైనికులకు సంఘీభావంగా తిరంగా ర్యాలీ

కురిచేడు, మే 19(ఆంధ్రజ్యోతి): సైనికులకు సంఘీభావంగా సోమవారం కురిచేడులో తిరంగా ర్యాలీ నిర్వహించారు. బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీలు సంయుక్తంగా పంచాయతీ కార్యాలయం నుంచి ప్రధాన కూడిల వరకు త్రివర్ణ పతాకాలతో ర్యాలీ నిర్వహించారు. మన సైనికుల త్యాగాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు కురంగా నాగేశ్వరరావు, కాట్రాజు నాగరాజు, మేరువ పెద్దిరెడ్డి, మేడా నాగేశ్వరరావు, లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ జేబీ రామారావు, కొత్తా అయ్యప్పసెట్టి, సూరె నాసరయ్య గుప్తా, రావూరి క్రిష్ణారావు, జవ్వాజి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన కలిగిఉండాలి

తాళ్లూరు, మే 19(ఆంధ్రజ్యోతి): వ్యాధులపై ఉద్యోగులు అవగాహన కలిగి ఉండాలని ఫిజియోథెరఫిస్ట్ వెంకటరమణ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ సమావేశం హాలులో సచివాలయాల ఉద్యోగులకు ఫిజియోథెరపీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పలురకాల వ్యాధులు వ్యాప్తి చెందడానికి గల కారణాలు వివరించారు. వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో దారా హనుమంతరావు, సానికొమ్ము సత్యం, తదితరులు పాల్గొన్నారు.

మినీమహానాడుకు తరలివెళ్లిన టీడీపీ శ్రేణులు

పామూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): కనిగిరిలో సోమవారం నిర్వహించిన మినీ మహానాడుకు పామూరు, సీఎస్‌పురం మండలాల నుంచి పెద్ద సంఖ్యలో టీడీపీ శ్రేణులు తరలివెళ్లారు. ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డితో కలిసి పామూరు, సీఎస్‌పురం మండలాల పార్టీ అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు, బొమ్మనబోయిన వెంగయ్యలు జ్యోతిప్రజ్వలన కార్యక్రమంలో పాల్గొన్నారు. మినీమహానాడుకు పామూరు నుంచి తరలివెళ్లిన వారిలో ఏఎంసీ చైర్మన్ యారవ రమాశ్రీనివాసులు, ఏ.ప్రభాకర్‌చౌదరి, బొల్లా నరసింహారావు, ఆకుపాటి వెంకటేష్, మనోహర్, ఎస్వీ నారాయణ, సయ్యద్ అమీర్ బాబు, షేక్ ఖాజారహంతుల్లా, తదితరులు, సీఎస్‌పురం నుంచి తోడేటి గోపి, పెద అల్లురయ్య, షేక్ రజ్జబ్‌బాషా, బొబ్బూరి రమేష్, మన్నేపల్లి శ్రీను, బి.వెంకటాద్రి, తోట చిన్న తదితరులు ఉన్నారు.

పీసీపల్లి: కనిగిరిలో సోమవారం జరిగిన టీడీపీ మినీ మహానాడుకు పీసీపల్లి మండలం నుంచి పార్టీశ్రేణులు తరలివెళ్లారు. మండలంలోని 18 పంచాయతీల నుంచి గ్రామకమిటీ అధ్యక్షులు, యూనిట్ ఇన్‌చార్జ్‌లు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, బూత్ ఇన్‌చార్జ్‌లు, ఆయా పంచాయతీలోని పార్టీశ్రేణులతో కలిసి మినీ మహానాడులో పాల్గొన్నారు. మినీ మహానాడుకు తరలివెళ్లిన వారిలో మండల పార్టీ అధ్యక్షుడు వేమూరి రామయ్య, అన్ని పంచాయతీల గ్రామ కమిటీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

తాళ్లూరు: దర్శిలో సోమవారం జరిగిన మినీమహానాడుకు తాళ్లూరు మండలం నుంచి తెలుగు తమ్ముళ్లు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. టీడీపీ మండల నూతన అధ్యక్షుడు మేడగం వెంకటేశ్వరరెడ్డి, ప్రస్తుత అధ్యక్షుడు బి.ఓబుల్‌రెడ్డి, ఎంపీపీ తాటికొండ శ్రీను ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. తరలివెళ్లిన వారిలో నాయకులు శాగం కొండారెడ్డి, గొల్లపూడి వేణుబాబు, కాలేషావలి, రామకోటిరెడ్డి, రాచకొండ వెంకట్రావు, ఐ.శ్రీనివాసరెడ్డి, మన్నేపల్లి సమర, పిన్నిక రమేష్, వి.సుబ్బయ్య, సత్యం, కాశీంసైదా, నాగార్జునరెడ్డి, తదితరులు ఉన్నారు.

నేడు దర్శిలో భారతీ మహాస్వామి యాత్ర

దర్శి, మే 19(ఆంధ్రజ్యోతి): శ్రీశృంగేరి శారదా పీఠాధీశ్వరులు జగద్గురువులు శ్రీ భారతీతీర్థ మహాస్వామి వారి కరకమల సంధ్యాతులు శ్రీవిధుశేఖర భారతీ మహాస్వామి విజయయాత్రలో భాగంగా మంగళవారం సాయంత్రం దర్శికి విచ్చేయనున్నట్టు భక్త బృందం తెలిపారు. స్వామీజీకి స్థానిక గడియార స్తంభం వద్ద పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో భక్తులకు అనుగ్రహ భాషణం ఇస్తారు. బుధవారం ఉదయం భక్తులు కలిసే అవకాశం కల్పిస్తారు. ఈ కార్యక్రమంలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఉష్ణోగ్రత (అంచనా)

20-5-2025	గరిష్టం	కనిష్టం
గుంటూరు	36	27
తెనాలి	36	28
నరసరావుపేట	35	25
బాపట్ల	35	28
రెంటచింతల	38	26
చీరాల	34	26



- ఇదీ గుంటూరు, బాపట్ల జిల్లాల్లో భూసార పరీక్షల తీరు..
- ఒక్క ల్యాబ్ ఉన్నా..పల్నాడు జిల్లానే కొద్దిగా మెరుగు
- వేలల్లో మట్టి నమూనాల సేకరణ లక్ష్యం..
- క్షేత్రస్థాయిలో జరుగుతున్నది ఒకటి .. రెండే
- ల్యాబ్‌లలో సిబ్బంది, రసాయనాల కొరత..
- ప్రభుత్వ సూక్ష్మ పోషకాలు కోల్పోవాల్సిందేనా..?

1,2... అంటే పెద్ద పరీక్షే!



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

భూసార పరీక్షలు యజ్ఞంలా చేయాలని ప్రభుత్వం నిర్ణయించినా ఆచరణలో వ్యవసాయ శాఖ చతికిల పడింది. మట్టి నమూనాలను టార్గెట్‌ల మేర సేకరిస్తున్నారే తప్ప..ఆ మేరకు పరీక్షలు జరగడం లేదు. రైతులకు పుడమి ఆరోగ్య కార్డులు పంపిణీ చేయాలని ప్రభుత్వం సంకల్పించినా ఆచరణలో సాధ్యమయ్యే పరిస్థితులు లేవు. వర్షాలు ఈ సారి ముందుగానే కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించింది. దీంతో అన్నదాతలు సాగుకు సమాయత్తమవుతున్నారు. అయితే పంట సాగు నాటికి భూసార పరీక్షలు పూర్తి కావు. పంటల సాగులో భూసార పరీక్షలు కీలకం.

భూసార పరీక్షలతో లాభాలు..

భూమిలో సారం ఎంత ఉందో పరీక్షల ద్వారా నిర్ధారిస్తారు. సాగు నేలలో సూక్ష్మపోషకాలు ఏ మోతాదులో ఉన్నాయో పరీక్షల ద్వారా గుర్తిస్తారు. పరీక్షల ఆధారంగా భూమి సారాన్ని నిర్ధారించి ఏ పంటలు సాగు చేస్తే మంచి దిగుబడులు పొందవచ్చో అన్నదాతలకు తెలియజేస్తారు. భూసారం బాగుంటేనే పంటల దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయి. నేలలో ప్రధాన పోషకాలైన ఉదజని సూచికతో పాటు, మట్టి పరీక్షల ద్వారా ఆమ్ల, క్షార లవణాలస్థాయి(పీహెచ్)తో పాటు పాస్ఫరస్, పోటాషియం, ఆర్గానిక్ కార్బన్, సల్ఫర్, జింక్, ఐరన్, కాపర్, బోరాన్, మెగ్నీషియం నేలలో ఏ మోతాదులో ఉన్నాయో పరీక్షల ద్వారా గుర్తిస్తారు. పొలంలో పంటలు బాగా పండాలంటే నేల ఆరోగ్యంగా ఉండాలి. భూమిలో సరైన పోషకాలు ఉన్నాయా.. లోపాలు ఉన్నాయా అనేది పరీక్షల ద్వారా నిర్ధారిస్తారు. ఈ మేరకు ఎంత మోతాదులో ఎరువులు వాడాలో రైతులకు సూచిస్తారు. ఇంతటి ప్రాధాన్యం కలిగిన భూసార పరీక్షలు అటకెక్కాయి.



ల్యాబ్‌లో మట్టి పరీక్షలు పరికరాలు

గుంటూరు జిల్లాలో ఒకటి..

గుంటూరు జిల్లాలో మట్టి నమూ నాల పరీక్షల కోసం మూడు ల్యాబ్‌లు ఉన్నా యి. 13,882 మట్టి నమునాలను పరీక్షించాలనేది లక్ష్యం కాగా ఇప్పటికి 10,269 నమూనాలను సేకరిం చారు. టార్గెట్‌లో 74.07 శాతం మాత్రమే సేకరణ పూర్తయింది. సేకరించిన నమూనాల్లో ఒకటే నమూనాను పరీక్షించి సాయిల్ హెల్త్ కార్డు సిద్ధం చేశారు. ఈ జిల్లాలో నమూనాల పరీక్షల్లో అంతులేని నిర్లక్ష్యం నెలకొంది. మట్టి నమూనాల పరీక్షలు ఇలా కొనసాగితే ఏడాదికి పూర్తయినా.. పూర్తయి నట్లేనని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మట్టి నమూనాల పరీక్షలు వేగవంతం చేసి వచ్చే జూన్ కన్నా హెల్త్ కార్డులు అందజేయాలని రైతులు కోరుతున్నారు.

సూక్ష్మపోషకాలు కోల్పోయే పరిస్థితి..

జింక్, బోరాన్, మెగ్నీషియం, గంధకం, ఇనుము, మాంగనీస్, రాగి, భాస్వరం, నత్రజని, పొటాషియం వంటి సూక్ష్మ పోషకాలు.. వచ్చే సీజన్‌లో పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. భూసార పరీక్షల ద్వారా సూక్ష్మ పోషకాల లోపాలను నిర్ధారించనున్నారు. ఈ మేరకు సూక్ష్మ పోషకాలను రాయి తీపై అందించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. మట్టి నమూనాల పరీక్షలు ఇలానే సాగితే ప్రభుత్వం అందజేయనున్న సూక్ష్మ పోషకాలను రైతులు కోల్పోయే ప్రమాదం ఉంది.

1, 2.. ఇవి పోటీ పరీక్షల్లో విద్యార్థుల ర్యాంకుల కాదు.. వ్యవసాయాధారిత జిల్లాల్లో వ్యవసాయ శాఖ నిర్వహించిన మట్టి నమూనా పరీక్షలు.. మట్టి నమూనాల పరీక్షలు లక్ష్యం ఘనంగా ఉన్నా.. ఆచరణ శూన్యంగా ఉంది. పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల పరిధిలో 60,124 మట్టి నమూనాల పరీక్షల లక్ష్యం కాగా.. ఇప్పటికి 452 నమూ నాల పరీక్షలు మాత్రమే పూర్తయినట్లు వ్యవసాయ శాఖ గణాంకాలు తెలియజేస్తున్నాయి. జిల్లాల వారీగా ఆచరణ సాధ్యం కాని స్థాయిలో మట్టి పరీక్షల టార్గెట్‌లు ఇచ్చిన ప్రభుత్వం.. కేత్రస్థాయిలో వసతులు కల్పించ డాన్ని విస్మరించింది. పరీక్షల ల్యాబ్‌లలో రసాయనాలు, పరికరాలు, సిబ్బంది కొరత వెంటాడుతోంది.

పల్నాడులో రోజుకు 100 నమూనాల పరీక్ష..

పల్నాడు జిల్లాలో రోజుకు వంద నుంచి 150 లోపే మట్టి నమూనాల పరీక్షలు జరుగుతున్నాయి. 28 మండలాలకు ఉన్నది ఒక్క ల్యాబే. దీనిలో కూడా సిబ్బంది కొరత నెలకొంది. చిలకలూరిపేటలోని ల్యాబ్‌ను సిబ్బంది, పరికరాల కొరతతో మూసివేశారు. దీంతో జిల్లాలో సేకరించిన మట్టి నమూనాలను నరసరావుపేట ల్యాబ్ లో మాత్రమే చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ల్యాబ్‌లో వసతులు లేక మహిళా సిబ్బంది తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. అయితే జిల్లాలో 23,437 మట్టి నమూనాల పరీక్షల చేయాలని లక్ష్యంగా నిర్ణ యించారు. 18,953 మట్టి నమూనాలను సేకరించారు. 80.87 శాతం మట్టి నమూనాల సేకరణ పూర్తి చేశారు. ఇందులో 452 మట్టి నమూనాలను పరీక్షించి సాయిల్ హెల్త్ కార్డులను సిద్ధం చేశారు. నిర్దేశించిన లక్ష్యంలో 2.38 శాతం మాత్రమే మట్టి నమూనాల పరీక్షలు పూర్తయ్యాయి. రోజుకు వంద చొప్పున నమూనాల పరీక్షలు చేస్తే ఖరీఫ్ సీజన్ ముగిసే లోపు కూడా భూసార పరీక్షల కార్డులు రైతులకు అందే పరిస్థితి ఉండదు. పల్నాడు జిల్లాలో సేకరించిన మట్టి నమూనాల్లో 50 శాతం గుంటూరు.. బాపట్ల పరీక్ష కేంద్రాలకు తరలించేందుకు అనుమతి కోరుతూ లేఖ రాసినట్లు జేడీ మురళీ తెలిపారు. గుంటూరు, బాపట్ల జిల్లాతో పోలిస్తే పల్నాడు జిల్లాలో పరీక్షలు కొంత మెరుగ్గా ఉంది.



నరసరావుపేటలోని భూసార పరీక్షల ల్యాబ్

బాపట్ల జిల్లాలో రెండు..

బాపట్ల జిల్లాలో మట్టి నమూనాల పరీక్షలకు మూడు ల్యాబ్‌లు ఉన్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. అయితే ల్యాబ్‌లు ఉన్నా నమూనాల పరీక్షల్లో తీవ్ర నిర్లక్ష్యం తాండవిస్తోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ జిల్లాలో 22,825 మట్టి నమూనాల పరీక్షల లక్ష్యం కాగా ఇప్పటికి 14,798 మట్టి నమూనాలను సేకరించారు. 64.83 శాతం మట్టి నమూనాలను సేకరించగా వీటిలో రెండు నమూనాల పరీక్షలు పూర్తి చేసి సాయిల్ హెల్త్ కార్డులు సిద్ధం చేశారు. సిబ్బంది, రసాయనాల కొరత వల్లే మట్టి పరీక్షలు జరగడం లేదన్న వాదనను సదరు అధికారులు వినిపిస్తున్నారు.



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

మహానాడుతో పార్టీకి పునరుత్తేజం

ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, కొల్లూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): మహానాడు కార్యక్రమంతో టీడీపీకి పునరుత్తేజం వస్తుందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం వేమూరులో నిర్వహించిన మినీ మహానాడు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సభలో మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీని స్వర్గీయ నందమూరి తారక రామారావు 43 ఏళ్ల క్రితం స్థాపించారని, మే 28వ తేదీ ఆయన జయంతిని పురస్కరించుకుని ఏటా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో నాయకులు, కార్యకర్తలు పండుగ వాతావరణంలో మహానాడు కార్యక్రమం జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ మహానాడు మాత్రం ఎంతో ప్రత్యేకమన్నారు. ఒక్క చాన్స్ అంటూ ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన జగన్‌ను ప్రజాక్షేత్రంలో ఆ వ్యక్తి పనికి రాడని ప్రజలే గత సార్వత్రిక ఎన్నికల్లో తీర్పునిచ్చి గద్దెదించారని గుర్తుచేశారు. మళ్లీ ముఖ్యమంత్రి చంద్రబాబు తిరోగమనంలో ఉన్న రాష్ట్రాన్ని పురోగతి సాధించేందుకు అహర్నిశలు కష్టపడుతున్నారన్నారు. పార్టీ విజయానికి కృషి చేసిన కార్యకర్తలకు ప్రభుత్వపరంగా, పార్టీ పరంగా పదవులు దక్కుతాయన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకటసుబ్బయ్య, పార్టీ పరిశీలకులు వంగా సాంబిరెడ్డి, వేమూరు మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ గొట్టిపాటి పూర్ణకుమారి, బాపట్ల పార్లమెంట స్థాయి అధికార ప్రతినిధి విజయబాబు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సాయిబాబా, మైనేని మురళీకృష్ణ పాల్గొన్నారు.

పాడి రైతుకు బీమా రక్ష

సేద్యం నష్టాలను మిగిల్చిన ప్రతిసారీ ఎంతోకొంత పాడి పరిశ్రమే అన్నదాతలను ఆదుకుంటూ వస్తోంది. అంతటి కీలకమైన రంగాన్ని గత ప్రభుత్వం పూర్తిగా గాలికొదిలేసి.. పాడి రైతుల ప్రయోజనాలకు గండి కొట్టింది. పశువులకు బీమా విషయంలో పూర్తిగా నిర్లక్ష్యం వహించింది. అటు రైతులూ సొంతంగా బీమా చేసుకోకుండా చేసి.. వారిని నిలువునా వంచించింది. అరకొరగా చేసిన బీమాకు సొమ్ము అందించడానికి ఏళ్ల తరబడి రైతులను కార్యాలయాల చుట్టూ తిప్పింది.. ఈ బాలారిష్టాలను తొలగించి పాడి పరిశ్రమను తిరిగి గాడిలో పెట్టడానికి కూటమి ప్రభుత్వం వడివడిగా అడుగులేస్తోంది.



- రైతులు కట్టే ప్రీమియం వాటా తగ్గింపు
- తొలి విడతలో మూడు జిల్లాలకు రూ.88 లక్షలు విడుదల
- దశల వారీగా నిధుల విడుదలకు కసరత్తు
- రైతులకు పశుసంవర్ధక శాఖ అవగాహన

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

పశు బీమాపై కూటమి ప్రభుత్వం దృష్టిపెట్టింది. 2014-19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వంలో బీమా ప్రీమియం వాటా రైతులు చెల్లించాల్సింది 20 శాతం ఉండేది. ఇప్పుడు దానిని 15 శాతానికి తగ్గించి, రైతులకు మరింత మేలు చేసేలా మార్గదర్శకాలు జారీ చేయడంతో పాటు.. తొలి విడతలో భాగంగా మూడు జిల్లాలకు ప్రీమియం వాటా తాలూకా నిధులను ప్రభుత్వం విడుదల చేయడంతో పాడి రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రైతు వాటా 5 శాతం తగ్గింపు..

పశువులకు చెల్లించే బీమా ప్రీమియం సొమ్ములో గతంలో రైతు వాటా 20 శాతంగా ఉండేది. ఇప్పుడు దానిని 15 శాతానికి తగ్గించగా.. మిగిలిన 85 శాతంలో కేంద్రం 60, రాష్ట్రం 40 శాతం భరించే విధంగా మార్గదర్శకాలు జారీ అయ్యాయి. ప్రీమియం వాటాకు సంబంధించి తొలి విడత నిధుల విడుదలను కూడా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే విడుదల చేసింది. దీనిలో భాగంగా బాపట్ల జిల్లాకు రూ.32 లక్షలు విడుదల కాగా.. 63 శాతం పశుసంవర్ధకశాఖ ఖర్చు చేసింది. పల్నాడు జిల్లాలో రూ.30 లక్షలు, గుంటూరు జిల్లాలో రూ.26 లక్షలు తొలి విడతలో భాగంగా బీమా ప్రీమియం నిధులు విడుదల కాగా.. 70 శాతం ఈ రెండు జిల్లాల పరిధిలో ఇప్పటికే ఖర్చు చేశారు. పశువుకు బీమా రూ.30 వేలుగా ఉంటే.. ప్రీమియం సొమ్ము రూ.1,920గా ఉంది. ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటా రూ.1,632 ఉంటే.. రైతు వాటాను రూ.283కే ప్రభుత్వం పరిమితం చేసింది. పశువులకు బీమా రూ.50 వేలు వరకు, గొర్రెలు, మేకలకు రూ.6 వేలు వరకు కల్పించేలా ఆదేశాలు జారీ చేసింది. గతంలో బీమా సౌకర్యం ఐదు పశువులకు మాత్రమే గరిష్ఠంగా ప్రభుత్వం కల్పించేది. దానిని ఇప్పుడు పది వరకు పెంచింది. గొర్రెలు, మేకలకు (మిగతా 6వ పేజీలో)



మినీ మహానాడులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

కార్యకర్తల సంక్షేమం కోసం కృషి

ఎమ్మెల్యే వేగేశన ● ఘనంగా బాపట్లలో మినీ మహానాడు

బాపట్ల, మే 19 (ఆంధ్రజ్యోతి) : పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికీ పదవుల కేటాయింపులో సముచిత స్థానం కల్పిస్తామని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ స్పష్టం చేశారు. బాపట్ల నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో సోమవారం సాయంత్రం నియోజకవర్గ మహానాడు నిర్వహించారు. టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీరామారావు విగ్రహానికి పుష్పాంజలిఘటించి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇటీవల మరణించిన పార్టీ నాయకులకు సంతాపం ప్రకటిస్తూ మౌనం పాటించారు. అనంతరం మినీ మహానాడుకు అధ్యక్షత వహించి ఎమ్మెల్యే వేగేశన మాట్లాడారు. తెలుగుదేశం పార్టీకి బలం, బలగం కార్యకర్తలేనన్నారు. రాబోయే రోజుల్లో ప్రతిఒక్కరికి న్యాయం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ నెల 21న పార్లమెంట్ స్థాయి మహానాడు కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. కడప జిల్లాలో జరిగే మహానాడు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. బావుడా చైర్మన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు సలగల రాజశేఖరబాబు, కార్యనిర్వాహక కార్యదర్శి తాతా జయప్రకాష్ నారాయణ, నియోజకవర్గ పరిశీలకుడు బొంతు శివసాంబిరెడ్డి, మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ కావూరి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అద్దంకిలో ఆధ్యాత్మిక శోభ



శోభాయమానంగా కలశయాత్ర

వేడుకగా మహా కుంభాభిషేకం

అద్దంకి, మే 19 (ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా అద్దంకి మండలంలోని శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి మహాకుంభాభిషేకం సందర్భంగా కలశయాత్ర సోమవారం శోభాయమానంగా సాగింది. అద్దంకి పట్టణంలోని పాత దర్శి రోడ్డులో గుండ్లకమ్మ నది వద్ద ఉన్న ఊట చలమల నుంచి జలాన్ని సేకరించారు. సోమవారం ఉదయం 6 గంటలకు ప్రారంభమైన కలశయాత్ర సుమారు 7 కి.మీ దూరంలో ఉన్న శింగరకొండకు ఉదయం 8.45 గంటలకు చేరింది. వర్షపు జల్లులు కురుస్తున్నప్పటికీ మహిళలు లెక్కచేయకుండా ముందుకుసాగారు. గజరాజుపై శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం పూజారి శ్రీరామ చంద్రమూర్తి కలశంతో ఆశీనులయ్యారు. యాత్రకు ఆటంకం లేకుండా నామ్‌రోడ్డులో ట్రాఫిక్‌ను మళ్లించారు.

వైభవంగా మహాకుంభాభిషేకం

ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో సోమవారం ఉదయం మహాకుంభాభిషేకం జీవ ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ వైభవంగా జరిగాయి.



ప్రత్యేక అలంకరణలో ప్రసన్నాంజనేయస్వామి



స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

ఉదయం కృష్ణ యజుర్వేద హవన సహిత మహాకుంభాభి షేకాన్ని శృంగేరిపీఠం ఉత్తరాధికారి విధుశేఖర భారతి తన శిష్య బృందంతో కలిసి నిర్వహించారు. విమాన శిఖర పూజలు, జీవ .ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ కార్యక్రమాలను చేశా రు. మంత్రులు గొట్టిపాటి రవికుమార్, బాల వీరాంజనేయస్వామి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, ఇంటూరి నాగేశ్వరరావు, దర్శి టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి, కడియాల లలిత్‌సాగర్ దంపతులు, ఈవో తిమ్మానాయుడు, రిషిత దంపతులు పాల్గొన్నారు. సుమారు 40 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించు కున్నట్లు అంచనా. దేవస్థానం ఆ. ధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలలో రాతి ముఖ మండపం ప్రధాన దాతలు నలమలపు విజయభాస్కర్‌రెడ్డి, శ్రీదేవి, కోట శ్రీనివాసకుమార్, నాగలక్ష్మి, గుంజి కృష్ణారావు, రమాదేవి, కాట్రగడ్డ అనిల్‌కుమార్, శ్రీవిద్య, జీవధ్వజస్తంభం దాత మేదరమెట్ల శంకరారెడ్డితో పాటుకుమారులు రాజశేఖరరెడ్డి, చంద్రశేఖరరెడ్డి దంపతులు పాల్గొన్నారు. చీరాల డీఎస్పీ మొయిన్, సీఐలు సుబ్బరాజు, మల్లికార్జునరావు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.





విమాన కలశం వద్ద పూజలు నిర్వహిస్తున్న శృంగేరి పీఠం ఉత్తరాధికారి విధుశేఖర భారతీస్వామి

అవీ..ఇవీ..

పంటసాగుహక్కుపత్రంతో రాయితీలు


కౌలు రైతులకు సూచనలిస్తున్న తహసీల్దార్ సింగారావు

పంగులూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): కౌలు రైతులకు ప్రభుత్వ పథకాలు అందాలంటే పంటసాగు హక్కు పత్రం కలిగి ఉండాలని తహసీల్దార్ సింగారావు అన్నారు. మండలంలోని రేణంగివరం, కశ్యాపురం గ్రామాలలో సోమవారం సీసీఆర్ కార్డులపై కౌలు రైతులకు అవగాహన కల్పించారు. సున్నావడ్డీతో పంటరుణాలు, పంటలబీమాతో పాటు అన్నదాత సుఖీభవ, తదితర పథకాల ప్రయోజనాలు పొందాలంటే కార్డు తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రభుత్వం అందించే సాయంతో పాటు పంట ఉత్పత్తుల అమ్మకానికి కౌలు రైతులు గుర్తింపు కార్డు కలిగి ఉండాలని ఏవో సుబ్బారెడ్డి సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బోరెడ్డి ఓబుల్‌రెడ్డి, వీఆర్‌వో సుమతి, వీఆర్‌ఏ శివాణి, పలువురు రైతులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రామనామ పారాయణం


పారాయణం చేస్తున్న భక్తులు

పర్చూరు, మే 19 (ఆంధ్రజ్యోతి) :పర్చూరులో వేంచేసిన శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయంలో శ్రీరామనామ సప్తాహ పారాయణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. సోమవారం స్వామివార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈనెల 22న జరిగే శ్రీహనుమాన్ జయంతిని పురస్కరించుకొని, ఐదు రోజులుగా మహిళా భక్తులు నిత్యం శ్రీరాముని, హనుమంతిని నామకీర్తల భజనా కార్యక్రమాలు చేపడుతున్నారు. 22న జరిగే పూర్ణాహుతితో పాటు 108 సార్లు హనుమచాలీసా పారాయణం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. చివరిరోజు ఆలయంలో పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నారు.

కానిస్టేబుల్ ఈవ్‌టీజింగ్

● దేహశుద్ధి చేసిన ప్రజలు

ఒంగోలు క్రైం, మే19(ఆంధ్రజ్యోతి): యువతుల పట్ల అసభ్య పదజాలంతో మాట్లాడుతున్న ప్రత్యేక విభాగంలో పని చేస్తున్న కానిస్టేబుల్‌కు పలువురు దే హశుద్ధి చేశారు. పూటుగా మద్యం తాగి స్కూటీ మీద వెళుతున్న యువతుల పట్ల అసభ్యపదజాలంతో మాట్లాడాడు. ఈ సంఘటన ఆదివారం రాత్రి ఒంగో లు నగరం మంగమూరు రోడ్డు జంక్షన్ సమీపంలో జరిగింది. దీంతో స్కూటీ మీద వెళుతున్న యువతులు వెంటనే వారి బంధువులకు తెలియజేయడంతో అక్కడకు వచ్చి సదరు కానిస్టేబుల్‌ను చితకబాదారు. వెంటనే డయిల్ 100 కాల్ చేసి పోలీసులకు అప్పగించి వెళ్లారు..

అకాల వర్షానికి తడిసిన వరి ఓదెలు

తాళ్లూరు, మే 19(ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం ఉదయం కురిసిన అకాల వర్షానికి పలుగ్రామాల్లో కోసిన వరి ఓదె లు తడిసిపోయాయి. దారంవారిపాలెం, తూర్పుగంగవరం, సోమవరప్పాడు తదితర గ్రామాల్లో వరి కోతలు కోసి పొలాల్లో ఓదెలు వేశా రు. వర్షానికి ఓదెలు తడిసిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మొక్కజొన్న పంట కోత పూర్తికాగా 90శాతం మేర అమ్మకా లు పూర్త య్యాయి. కోత కోసి అమ్మేందుకు సిద్ధంగా ఉంచిన మిగిలిన పది శాతం మొక్కజొన్న గింజలను వర్షానికి తడవకుండా ఉంచేం దుకు రైతులు పడరాని పాట్లు పడ్డారు. పలుగ్రామాల్లో సైడు కాలువలు పూడకుపోవడంతో వర్షపు నీరు రోడ్లపై ప్రవహించింది.

గ్రామాల్లో పారిశుధ్యం పడక

● రోడ్లవెంబడే ఎరువుల దిబ్బలు
● పట్టించుకోని పాలక వర్గాలు

బల్లికురవ. మే 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతి నెల మూడో శనివారాన్ని స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రగా పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశాలను జారీ చేసింది. గ్రామాలలో మాత్రం పారిశుధ్యం పడకేసిందని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. అధికారులు పర్యటనలకు వచ్చామా..? వెళ్లామా...? వ్యవహరిస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి పరిశీలనలు చేపట్టటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మండలకేంద్రం బల్లికురవ మం డల కేంద్రంలో అద్దంకి రోడ్డు, కొమ్మాలపాడు రోడ్డులో పెద్దఎత్తున పేడదిబ్బలు, వ్యర్థాలు రోడ్డుపైకి చేరాయి. మండల కేంద్రంలోనే ఇంత వరకు చెత్త సంపద కేంద్రం ఏర్పాటు చేయకపోవటంతో పెద్ద ఎత్తున రోడ్లవెంబడి వ్యర్థాలు పడవేస్తున్నారు. అలానే అంబడిపూడి గ్రామానికి వెళ్లే ప్రదాన సీసీ రోడ్డు పేడదిబ్బలతో కుంచించుకుపోతుంది. ఈ రోడ్డులో పశువైద్యశాల కూడా ఉంది. అయిన అధికారులు ఎవరు ఈ సమస్య గురించి పట్టించుకో వడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎరువుల దిబ్బలవలన రోడ్లపై నడిచే ప్రజలు ముక్కు మునుకు వెళ్లాల్సిన పరిస్థితి ఉందని ప్రజలు అంటున్నారు. ఆలానే కొప్పెరపాడు, వల్లాపల్లి, కూకట్లపల్లి, కొణిదెన, చెన్నుపల్లి గ్రామాలలో పారిశుధ్యం పడకేసింది. రోడ్లపై గుండానే మురుగు పారుతుందని ప్రజలు పేర్కొంటున్నారు. అధికారులు ఇప్పటికైన ప్రభుత్వ ఆదేశాలను పాటించి పారిశుధ్య కార్యక్రమాలను సక్రమంగా అమలు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.


బల్లికురవ రోడ్డులో ఉన్న ఎరువుల దిబ్బలు


అంబడిపూడి రహదారిలో ఇరువైపుల ఉన్న పేడదిబ్బలు

భారతీయ సంస్కృతి సంప్రదాయాలు గొప్పవి

శృంగేరిపీఠం ఉత్తరాధికారి విదుశేఖర భారతి

అద్దంకి,మే19 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో గొప్పవి అని శృంగేరిపీఠం ఉత్తరాధికారి విదుశేఖర భారతి అన్నారు. శింగరకొండలో మహా కుంభాభిషేకం అనంతరం భక్తులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఆంజనేయస్వామిని ప్రార్థించి ఏ కార్యము ప్రారంభించినా దిగ్వి జయంగా పూర్తవుతుందన్నారు. ప్రతిఒక్కరూ తమ వృత్తితో పాటు భగవంతుని ఆరాధన దిన చర్యలో భాగం చేసుకోవాలన్నారు. ప్రసిద్ధ క్షేత్రంగా ఉన్న శింగరకొండలో ప్రసన్నాంజనేయస్వామి సన్నిధానంలో అనేక మంది భక్తుల సంకల్పంతో, విశేష సహకారంతో నిర్మించిన రాతి మండపం ప్రారంభం, మహాకుంభా భిషే కం చేసుకోవడం భక్తుల అదృష్టమ న్నారు. ఆంజనేయస్వామి మహిమ అపారమైనద న్నారు. శింగరకొండలో ఆంజనేయస్వామి, లక్ష్మీనరశింహ స్వామి దేవాల యాలు ఉండ టం ఎంతో విశేషం అన్నారు. ఆంజనేయ స్వామి ఉపవాసం చేయ డం వల్ల సకల అభీ ష్టాలు నెరవేరతాయన్నారు. అనంతరం లక్ష్మీ నర సింహస్వామి దేవా లయంలో ప్రత్యేక పూజ లు చేశారు. ఈఓ శ్రీనివాసరావు, పూజా రులు విధుశేఖర భారతికి స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సంతమాగులూరు : మండలంలోని కొప్పరం గ్రామానికి శృంగేరి శారదా పీఠం ఉత్తరాధికారి విదుశేఖర భారతి సోమవారం సాయంత్రం వచ్చారు. ఆయనకు గ్రామస్థులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన ధూళిపాదపూజ, అనుగ్రహ బాషణ, చేశారు. చంద్రమౌళిదర్పణ పూజ అంగరంగ వైభవంగా నిర్వహించారు. నేడు కొప్పరం గ్రామంలో నిర్వహిస్తున్న కొప్పరం సిద్ధాంతి చింతలపాటి వీర నీలకంఠ సిద్ధాంతి శత జయంతి సభలో పాల్గొన్నారు. సిద్ధాంతి రాసిన గ్రంథాలలో ఏడు గ్రంథాలు ఆవిష్కరించారు.


అనుగ్రహభాషణం చేస్తున్న విదుశేఖర భారతి

ప్రమాదకరంగా గ్రానైట్ రాళ్ల రవాణా

● కొరడా ఝుళిపించిన పోలీసులు
● ఐదు వాహనాల సీజ్

చీమకుర్తి, మే19(ఆంధ్రజ్యోతి) : నిబంధనలకు విరుద్ధంగా, ప్రమాదకర రీతిలో గ్రానైట్ రాళ్లను రవాణా చేస్తున్న రవాణాదారులపై పోలీసులు కొరడా ఝుళిపించారు. సోమవారం ఏకంగా ఐదు వాహనాలను సీజ్ చేసినట్లు సీఐ సుబ్బారావు తెలిపారు. రవాణాశాఖాధికారులు, విజిలెన్స్, మైన్స్ అధికారులు ప్రమాదకరమైన రవాణాపై సరైన దృష్టి పెట్టకపోవటంతో వాహనదారులు ఇష్టారీతిన ప్రవర్తిస్తున్నారు. దీనివల్ల రోడ్డుపై రాకపోకలు సాగిస్తున్న వారు భయ భ్రాంతులు గురవ్వటంతో పాటు ఏక్షణానా ఏ రాయి పడి ప్రాణం మీదకు వస్తుందో అని హడలెత్తుతూ ప్రయాణం సాగిస్తున్నారు. ఈ విషయాన్ని పలువురు పోలీసులు దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో సీఐ సుబ్బారావు తన సిబ్బందితో కలిసి నిబంధనలకు విరుద్ధంగా రాకపోకలు సాగిస్తున్న గ్రానైట్ వాహనాలను పరిశీలించారు. రాళ్లు దొర్లిపడేవిధంగా లోడింగ్ చేసుకొని రవాణా సాగిస్తున్న ఐదు వాహనాలను సీజ్ చేసి చీమకుర్తి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీసులు ఇలాంటి వాహనాలను సీజ్ చేస్తున్నారని తెలుసుకున్న మరికొన్ని వాహనాలు రవాణా నిలిపివేసి తప్పించుకున్నారు. రోడ్డుపై ప్రయాణికులకు, ఇతర వాహనాలకు ఇబ్బందికరంగా, ప్రాణప్రమాదంగా గ్రానైట్ రవాణా చేస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ సుబ్బారావు హెచ్చరించారు. నిబంధనల మేరకు గ్రానైట్ రవాణాను నిర్వహించుకోవాలని ఆయన స్పష్టం చేశారు.


రాళ్లు కిందపడేలా టిప్పర్‌లో లోడింగ్ చేసిన నిర్వాహకులు


పోలీసులు సీజ్ చేసిన వాహనాలు

వానలోనూ కొనసాగిన దీక్షలు

ఒంగోలు కలెక్టరేట్, మే 19 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జోరువానలోనూ తమ ఆందోళన కొనసాగించారు. స్థానిక కలెక్టరేట్ ఎదుట జరుగుతున్న చేపట్టిన దీక్షలు సోమవారానికి 21వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ సీహెచ్‌వోల న్యాయమైన సమస్య ల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. సమస్యల పరిష్కారం కోసం దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం కానీ, ఇటు అ ధికారులు గాని పట్టించుకున్న పరిస్థితి లేకుండా పోయిందని ఆవేదన వ్య క్తం చేశారు. 23శాతం ఇంక్రిమెంట్‌తో పాటు పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. కా ర్యక్రమంలో నాయకులు గంటా ప్రసన్న, పి.శైలజ, దీప్తి, కామేష్, రామాం జనేయులు తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతుకు 'బీమా' రక్ష

(5వ పేజీ తరువాయి)

వంద వరకు వెసులుబాటు కల్పించింది. ఒక్కసారి బీమా చెల్లిస్తే మూడేళ్ల పాటు అది అమల్లో ఉండేలా ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ ఉత్తర్వులన్నీ ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రాగా.. ఈ నెల మొదటి వారం నుంచి బీమా ప్రక్రియను యంత్రాంగం ముమ్మరం చేసింది.

ఎక్కువ శాతం బీమా గొడుకు కిందకు..

జిల్లా వ్యాప్తంగా ఉన్న పశు సంపదలో దాదాపు 30 శాతం వరకైనా బీమా గొడుకు కిందకు తెచ్చేలా గ్రామాల్లో అవగాహన కల్పించే చర్యలకు ప్రభుత్వం సిద్ధమైంది. పశుసంవర్ధక శాఖ లెక్కల ప్రకారం బాపట్ల జిల్లాలో ఆవులు, ఎద్దుల సంఖ్య 21,930గా ఉండగా, గేదెలు 3,81,764 ఉన్నాయి. గొర్రెలు 4,27,523, మేకలు 49,990, పందులు 3,219 కాగా కోళ్లు 7,76,022 ఉన్నాయి. పల్నాడు జిల్లాలో ఆవుల సంఖ్య 68,000, గేదెలు 4,69,048, గొర్రెలు 4,80,000, మేకలు 1,58,000, పందులు 1,800 నమోదై ఉన్నాయి. గుంటూరు జిల్లాలో గేదెల సంఖ్య 2,20,000 వరకు ఉండగా.. మేకలు, గొర్రెలు కలిపి మూడు లక్షల వరకు ఉన్నాయి. వీటన్నింటికీ బీమా కల్పించేలా పాడి రైతులకు అవగాహన కల్పించడానికి పశు సంవర్ధకశాఖ సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి, రైతులను చైతన్య పరుస్తున్నారు

బకాయిలు చెల్లించి, పాడికి ఊతం

వైసీపీ ఏలుబడిలో అరకొరగా అమలు చేసిన పాడి సంబంధిత పథకాల బకాయిలను కూడా ఈ ప్రభుత్వం చెల్లించింది. బాపట్ల జిల్లాలో రూ.2కోట్ల వరకు పెండింగ్ మొత్తాలను చెల్లించగా గుంటూరు, పల్నాడు జిల్లాల పరిధిలో దాదాపు రూ.5 కోట్ల వరకు చెల్లించింది. బీమాను ఏడాది పొడవునా ఉధృతంగా అమలు చేసేలా పశుసంవర్ధక శాఖకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. గడచిన మూడు నెలల వ్యవధిలో దాదాపు 3 శాతం పశు సంపద వృద్ధి.. మూడు జిల్లాల్లో నమోదు కావడం గమనార్హం.

వీఆర్‌వోల పోరుబాట


వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌వోలు

ఒంగోలు కలెక్టరేట్, మే 19 (ఆంధ్రజ్యోతి) : గ్రామ రెవెన్యూ అధికారులు (వీఆర్వోలు) పోరుబాట పట్టారు. పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని.. గ్రామ, వార్డు సచివాలయాల రేషనలైజేషన్ కారణంగా పెరిగిన పనిభారాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు దశలవారీ ఆందోళనకు దిగారు. అందులోభాగంగా సోమవారం జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో తహసీల్దార్లను కలిసి సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీవో నంబరు 4 ద్వారా గ్రామ, వార్డు సచివాల యాల రేషనలైజేషన్‌తో తమపై పనిభారం పడుతున్నదని వీఆర్వోలు వాపోతున్నారు. రేషనలైజేషన్‌లో మిగిలిపోయిన గ్రామ రెవెన్యూ అధికారులకు నిర్దిష్టమైన విధి విధానాలతో జీవో జారీ చేయాలని, గ్రామ రెవెన్యూ అధికారులను గ్రామ సచివాలయం నుంచి తప్పించి 2019కి పూర్వం ఉన్న రెవెన్యూ క్లస్టర్ విధానంలో మండల తహసీల్దార్ ఆధ్వర్యంలో విధులు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్ర కమిటీ సూచనలకు అనుగుణంగా జిల్లావ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని వీఆర్వోల సంఘ జిల్లా అధ్యక్షుడు వైపీ రంగయ్య తెలిపారు.

టీడీపీకి కొత్తసారథి

ఒంగోలు పార్లమెంట్ అధ్యక్ష పదవికి పరిశీలనలో ముగ్గురు ఎమ్మెల్యేల పేర్లు

ఇప్పుడా.. కడప మహానాడు తర్వాత

ప్రకటిస్తారా అన్నదానిపై ఇంకా రాని స్పష్టత

ఇద్దరు ఇన్‌చార్జిలకు నామినేటెడ్ పోస్టులు

తెలుగుదేశం పార్టీ ఒంగోలు పార్లమెంట్ సారథి మారనున్నారు. ఆ పదవిని మరొకరికి అప్పగించాలని అధిష్ఠానం నిర్ణయించింది. ముగ్గురు ఎమ్మెల్యేల పేర్లను ప్రధానంగా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. వీరిలోనే ఒకరిని ఖరారు చేసే అవకాశం ఉంది. శుక్రవారం నిర్వహిస్తున్న జిల్లాస్థాయి మహానాడులో ప్రకటించాలా? లేక రాష్ట్ర మహానాడు తర్వాతా? అన్నదానిపై తర్జనభర్జన జరుగుతోంది. దీంతోపాటు పార్టీ దర్శి, ఎర్రగొండపాలెం ఇన్‌చార్జిలుగా ఉన్న గొట్టిపాటి లక్ష్మి, గూడూరి ఎరిక్షన్‌బాబులకు నామినేటెడ్ పదవులు ఇచ్చే అంశాన్ని అధిష్ఠానం సీరియస్‌గా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.


దామచర్ల జనార్దన్


ముక్కు ఉగ్రనరసింహారెడ్డి


కందుల నారాయణరెడ్డి

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

టీడీపీ ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడిగా ప్రస్తుతం నూకసాని బాలాజీ ఉన్నారు. ఈ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నామినేటెడ్ పదవులు ఇచ్చిన తొలి జాబితాలోనే ఆయనకు టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పదవిని ఇచ్చి గౌరవించింది. జోడు పదవుల్లో ఉండటానికి ఆయన సిద్ధంగా ఉన్నప్పటికీ అధిష్ఠానం వేరే విధంగా ఆలోచన చేస్తున్నట్లు తెలిసింది. పార్టీ నిర్మాణం, కార్యకర్తలను గుర్తించడం, గౌరవించడం అన్న అంశాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. ఈ విషయంపై ఆపార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ప్రత్యేక పరిశీలన చేసినట్లు సమాచారం. తదనుగుణంగా నియోజకవర్గాన్ని, జిల్లాను అంటి పెట్టుకొని పనిచేసే వారికే పార్టీ పదవులు అప్పగించే ఆలోచనలతో అధిష్ఠానం ఉంది.

పరిశీలనలో దామచర్ల,ఉగ్ర, కందుల పేర్లు

జిల్లాల వారీ మంత్రులు, కార్పొరేషన్ పదవులు ఏఏ సామాజికవర్గాల వారికి దక్కాయి, ఇంకా ఎవరికి నామినేటెడ్ పదవులు లభించే అవకాశాలు ఉన్నాయి అన్న అంశాలను పరిగణనలోకి తీసుకుంది. అందుకు అనుగుణంగా సామాజిక వర్గాల సమన్వయానికి కూడా ప్రాధాన్యంఇస్తూ పార్టీ పార్లమెంట్ అధ్యక్షుడిని ఎంపిక చేయాలని నిర్ణయించు కున్నట్లు తెలిసింది. ఆ పదవికి సంబంధించి ఒంగోలు, కనిగిరి ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి పేర్లు పరిశీలనలో ఉన్నాయి. అవకాశం ఇస్తే తానూ అధ్యక్ష బాధ్యతలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నానని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అధిష్ఠానంకు సంకేతం ఇచ్చినట్లుగా తెలిసింది.

రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్‌లుగా ఉన్న వారికి ఇతరత్రా బాధ్యతలను దృష్టిలో ఉంచుకొని జిల్లాలోనే ఉంటూ ఏదైనా అధికారిక పదవిలో ఉన్న వారిని ఎంపిక చేస్తే వివిధ రకాలుగా కలిసొస్తుందని టీడీపీ అధిష్ఠానం భావించినట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు పార్టీలో సీనియర్‌గా ఉన్న దామచర్ల జనార్దన్‌ను రాష్ట్రస్థాయి పదవిలో కొనసాగిస్తూ కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డికి పార్లమెంట్ అధ్యక్ష పదవిని కట్టబెట్టే ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. మంత్రి లోకేష్ వద్ద డాక్టర్ ఉగ్ర నూటికి నూరు శాతం మార్కులు పొందారు. రాష్ట్రంలో ఎక్కడ పార్టీపరంగా ప్రతిష్ఠాత్మక కార్యక్రమాలు జరుగుతున్నా ఆయనను పిలిచి ప్రత్యేక బాధ్యతలు అప్పగిస్తున్నారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగే కార్యకర్తల శిక్షణ తరగతుల్లో నాయకత్వ లక్షణాలపై డాక్టర్ ఉగ్ర చేత శిక్షణ ఇప్పిస్తున్నారు. ఇక జిల్లాలో దామచర్లకు ఉన్న ప్రత్యేక ప్రాధాన్యం తెలియంది కాదు. అధ్యక్ష బాధ్యతలు తీసుకోవాలని ఆయన వర్గీయులు ఒత్తిడి చేస్తున్నట్లు తెలిసింది. మరోవైపు పశ్చిమప్రాంతానికి ప్రాధాన్యం ఇచ్చి తనకు అవకాశం కల్పించాలని కందుల నారాయణరెడ్డి కోరడంతో ఆయన పేరును పరిశీలనలోకి తీసుకున్నారు.

ఆ ఇద్దరికీ నామినేటెడ్ పదవులు

గత ఎన్నికల్లో ఓడిపోయి పార్టీ ఇన్‌చార్జిలుగా ఉన్న ఎరిక్షన్‌బాబు, గొట్టిపాటి లక్ష్మిలకు నామినేటెడ్ పదవులు ఇచ్చే ఆలోచలలో అధిష్ఠానం ఉంది. ప్రొటోకాల్ సమస్యతో వైసీపీ ఎమ్మెల్యేల నుంచి వారు ఎదుర్కొంటున్న విమర్శలకు ఫుల్‌స్టాప్ పెట్టాలని అధిష్ఠానం ఆలోచిస్తున్నట్లు తెలిసింది. ఈవిషయమై ఇటీవల జిల్లాకు సంబంధం ఉన్న కొందరు మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య ప్రత్యేక చర్చ కూడా నడిచింది. ప్రస్తుతం జిల్లాస్థాయిలో ఖాళీగా ఉన్న ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఒడా)తోపాటు రాష్ట్రస్థాయిలో ఒక కార్పొరేషన్‌ను ఎంపిక చేసి వారికి ఇవ్వాలన్న ఆలోచనలో అధిష్ఠానం ఉన్నట్లు తెలుస్తోంది. అనంతరం సామాజిక వర్గాల వారీగా పరిశీలన చేసి పార్టీ ఒంగోలు పార్లమెంట్ అధ్యక్ష పదవికి ఉగ్ర, దామచర్లలలో ఒకరిని ఎంపిక చేయనున్నట్లు సమాచారం. రాష్ట్రంలోని కొన్ని జిల్లాల అధ్యక్షుల ఎంపికపై అధిష్ఠానం ఇంకా తుది నిర్ణయానికి రాలేదని సమాచారం. దీంతో పార్లమెంట్ స్థాయి మహానాడులో ప్రకటించాలా? కడప మహానాడు తర్వాత ప్రకటించాలా? అన్న విషయమై తుది నిర్ణయానికి అధిష్ఠానం రాలేదని తెలుస్తోంది.



కోలాహలంగా..

టీడీపీ నియోజకవర్గ మినీ మహానాడులు ప్రారంభం

తొలిరోజు కొండపి, కనిగిరి, దర్శి, మార్కాపురంలో నిర్వహణ

పార్టీ పటిష్టతపై ముఖ్యనేతల దిశానిర్దేశం

నేడు గిద్దలూరులో మినీ పండుగ

పలుచోట్ల సైనికులకు మద్దతుగా తిరంగా ర్యాలీల్లో పాల్గొన్న నేతలు


కనిగిరి మినీ మహానాడులో జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర

ఒంగోలు, మే 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో తెలుగుదేశం పార్టీ మినీ మహానాడులు కోలాహలం ప్రారంభమయ్యాయి. మొత్తం ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా కొండపి, కనిగిరి, దర్శి, మార్కాపురంలలో సోమవారం వీటిని నిర్వహించారు. పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొన్నారు. నియోజకవర్గ పరిధిలోని గ్రామ, మండల, పట్టణ కమిటీలు, అనుబంధ సంఘాల బాధ్యులతో మినీ మహానాడుల నిర్వహణకు అధిష్ఠానం ఆదేశించగా అలాగే నిర్వహించారు. కొండపి నియోజకవర్గ మినీ మహానాడు కొండపిలో ఏర్పాటు చేశారు. మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి, రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య పాల్గొన్నారు. కనిగిరిలో అక్కడి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, మార్కాపురంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, దర్శిలో అక్కడి టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మిల సారథ్యంలో మినీ మహానాడులు జరిగాయి. గ్రామ, పట్టణాలకు చెందిన ముఖ్యనాయకులంతా ఉత్సాహంగా హాజరయ్యారు. టీడీపీ ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడైన రాష్ట్ర టూరిజం బోర్డు చైర్మన్ నూకసాని బాలాజీ కనిగిరి, దర్శి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గడిచిన 11 మాసాల్లో రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం సాధించిన విజయాలను ఈ సందర్భంగా నాయకులు వివరించారు. విభిన్నవర్గాల ప్రజల కోసం అమలు చేస్తున్న పథకాలను కొనియాడారు. పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయాలని కోరారు. అందుకు కేడర్ ఇంకా చురుగ్గా పనిచేయాలని సూచించారు. మరోవైపు ఆయా నియోజకవర్గాల పరిధిలో శాశ్వత అభివృద్ధి అంశాలు, ప్రజా సమస్యల పరిష్కారంపై పలు తీర్మానాలు చేశారు. జిల్లాలో మిగిలిన నాలుగు నియోజకవర్గాల్లో గిద్దలూరుకు సంబంధించి మినీ మహానాడు మంగళవారం నిర్వహిస్తున్నారు. వై.పాలెంలో, ఒంగోలులో 21న, సంతనూతలపాడు నియోజకవర్గ మినీ మహానాడు 22న నిర్వహించనున్నారు. ఈసందర్భంగా ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా పలుచోట్ల తెలుగు తమ్ముళ్లు భారీ ర్యాలీలు చేపట్టారు.


కొండపి మినీ మహానాడులో మాట్లాడుతున్న మంత్రి స్వామి, పక్కన మారిటైం బోర్డు చైర్మన్ సత్య

అవీ..ఇవీ..

తాటిచెట్టు పైనుంచి పడి వ్యక్తి మృతి

సంతమాగులూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): తాటిచెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని మిన్నెకల్లు గ్రామంలో చోటుచేసుకొంది. గ్రామానికి చెందిన ఆంజనేయులు, మరో ఇద్దరితో కలిసి తాటికాయలు సేకరించడానికి గ్రామ శివార్లలోని తాటిచెట్ల వద్దకు వెళ్లారు. తాటికాయలు కోసే క్రమంలో ప్రమాదవశాత్తు చెట్టు నుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే ఆయన్ను వైద్యచికిత్స కోసం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గుంటూరులో చికిత్స కొనసాగుతుండగా ఆంజనేయులు గాయాలతో ఆదివారం మధ్యాహ్నం మృతిచెందాడు. ఆయన రాణి ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ తిరగబడి డ్రైవర్ మృతి



ట్రాక్టర్ తిరగబడి మృతి చెందిన నాగరాజు

సంతమాగులూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ తిరగబడి డ్రైవర్ మృతిచెందిన ఘటన మండలంలోని సజ్జాపురం గ్రామంలోని ఓ గ్రానైట్ క్వారీ వద్ద చోటుచేసుకొంది. ఐదుగురు కార్మికులు సోమవారం ట్రాక్టర్లలో క్వారీలో పనికి వెళ్తూ ట్రాక్టర్‌పై కొండ ఎక్కుతుండగా ట్రాక్టర్ తిరగబడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ నడుపుతున్న తమిళనాడు రాష్ట్రానికి చెందిన డ్రైవర్ ఇలుమలై నాగరాజ్(44) ట్రాక్టర్ కింద పడడంతో తలకు తీవ్ర గాయమైంది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. ఆయనతో పాటు ట్రాక్టర్ లో ఉన్న మిగిలిన నలుగురు వ్యక్తులు చిన్న చిన్న దెబ్బలు తగిలాయి. ఈ ఘటనపై ఆయన కుమారుడు ఇలుమలై అజిత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంతమాగులూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోయిన నగదు పర్సు అప్పగింత

- అభినందించిన వన్‌టౌన్ సీఐ సుబ్బారావు

చీరాల, మే 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి చెందిన కర్ని నాగ బ్రహ్మ చారి సోమవారం పట్టణంలో నగదు పర్స్, ఏటీఎం కార్డులు పోగొట్టు కున్నాడు. ఈ క్రమంలో కొంతసేపు వెదుకులాడి చేసేదేమీలేక వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే కొద్దిసేపటికే స్థానిక జవహర్‌నగర్‌కు చెందిన పాలపర్తి శ్రీనిసరావు తనకు నగదు పర్స్, ఏటీఎం కార్డులు ముంతావారిసెంటర్‌లో దొరికాయని వన్‌టౌన్ స్టేషన్‌కు వచ్చాడు. అయితే వెంటనే సిఐ సుబ్బారావు శ్రీనివాసరావు చేతుల మీదుగానే పర్సు యజమానికి అప్పగించాడు. ప్రతిఒక్కరూ ఇతరుల పట్ల బాధ్యతగా జీవించినప్పుడే ఆనందంగా జీవిస్తారని తెలిపారు. శ్రీనివాసరావును అభినందించారు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

అద్దంకి, మే19(ఆంధ్రజ్యోతి):కారు ఢీకొని వ్యక్తికి గాయాలైన ఘటన అద్దంకిలోని శింగరకొండ రహదారిలో దామావారిపాలెంట వద్ద చోటుచేసుకొంది స్థానికుల కథనం మేరకు అద్దంకి పట్టణంలోని కట్టకింద పాలేనికి చెందిన అఖిల్ శింగరకొండ రోడ్డులో దామావారిపాలెం వద్ద నిలబడి ఉండగా కారు ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడ్డ అఖిల్‌ను స్థానికులు అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా మెరుగైన చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఒంగోలు వైద్యశాలకు తరలించారు.

ఏఎన్ఎం మృతిపై విచారించాలి



సమావేశమైన ప్రభుత్వ ఉద్యోగుల సంఘ ప్రతినిధులు

చీరాల, మే 19 (ఆంధ్రజ్యోతి) : రేపల్లె అర్బన్ హెల్త్‌సెంటర్ ఏఎన్ఎం సింగోటి కోటేశ్వరమ్మ మృతిపై పారదర్శకంగా విచారించాలని, నేరస్థులను కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి పసుమర్తి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. కేవలం పని భారంతోనే ఆమె మృతిచెందినట్లు తెలిపారు. సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జూన్ 5న విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో రాష్ట్రకౌన్సిల్ జరుగుతుందని వివరించారు. కార్యక్రమానికి ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని పిలునిచ్చారు. కార్యక్రమంలో ప్రతినిధులు వినోద్, శ్రీనివాసరావు, రవికుమార్, భాగ్యలక్ష్మీ, వెంకాయమ్మ, నజీరీన్, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల చేర్పులు, మార్పులను వేగవంతం చేయాలి

- ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు



మాట్లాడుతున్న ఆర్‌డీవో చంద్రశేఖరనాయుడు

చీరాల, మే 19 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో ఓటు వ మార్పులు, చేర్పులను వేగవంతం చేయాలని, సమస్యలున్న చోట పరిష్కారం దిశగా ముందుకు సాగాలని, ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు పేర్కొ న్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్లు గోపీకృష్ణ, పార్వతి ఆధ్వర్యంలో అన్ని రాజకీయ పార్టీలు, బిఎల్‌వోలతో ఫాం 6,7లపై సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు జరిగిన నమోదు ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. పలు అంశాలపై చర్చించి సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రహదారులకు మహర్దశ

- బీటీ రోడ్ల ఏర్పాటుకు రూ.13.25 కోట్లు మంజూరు
- తీరనున్న గ్రామీణుల కష్టాలు



గుంతలమయమైన రహదారి (ఫైల్)

పర్చూరు, మే 19 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ఐదేళ్ల పాలనలో గుంతలమయంగా మారిన పర్చూరు నియోజకవర్గంలోని పలు రహదారులకు కూటమి ప్రభుత్వంలో మహర్దశ పట్టనుంది. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కృషి ఫలితంగా నియోజకవర్గంలోని పలు రహదారులకు ఎన్ఆర్ఈజీఎస్ నిధుల కింద ప్రభుత్వం రూ.13.25 కోట్లు మంజూరు చేస్తూ నిధులు విడుదల చేసింది. దీంతో పర్చూరులోని పలు రహదారులు బీటీ రోడ్లతో కళకళలాడనున్నాయి. ఐదేళ్లు అస్తవ్యస్తంగా అధ్వానపు రహదారులతో ఇబ్బంది పడిన ప్రజలకు ఊరట లభించ నుంది. ప్రధానంగా కోనంకి, వలపర్ల కడవకుదురు, ఇంకొల్లు ప్రధాన రహదారి నుండి చింతగుంపల, వింజనంపాడు నుంచి తిమ్మరాజుపాలెం వరకు రహదారులు బీటీ రోడ్లుగా అభివృద్ధి చెందను న్నాయి.

నియోజకవర్గంలో పలు పల్లెలకు రహదారులకు అర్‌అండ్‌బీ రోడ్లతో అనుసంధానించేందుకు కూటమి ప్రభుత్వం రూ.13.25 కోట్లు మంజూరు చేస్తూ నిధులు విడుదల చేసింది. ప్రధానంగా వింజనంపాడు నుంచి తిమ్మరాజుపాలెం వరకు వయా పోలూరు, శ్యామలవారిపాలెం వరకు నాలుగు రిచ్‌ల వారీగా మొత్తం 10.50 కిలోమీటర్లు రూ.7.50 కోట్లతో నిర్మాణం చేపట్టనున్నారు. అదే విధంగా కడవకుదరు ఇంకొల్లు ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి చింతగుంపల్లి రహదారి వరకు రూ.1.60 కోట్లు మంజూరు చేశారు. ఎన్‌హెచ్-16 కోనంకి నుండి వలపర్ల వయా జంగమేశ్వరం వరకు మూడున్నర కోట్లతో రహదారి నిర్మాణం చేపట్టను న్నారు. అలాగే ఎన్‌హెచ్-16 బొల్లాపల్లి వరకు రూ.65 లక్షలు మంజూరు చేశారు.

హామీ ఇచ్చిన ఏడాదిలోనే నిధులు

ఏమ్మెల్యే ఏలూరి గత ఎన్నికల సమయంలో కోనంకి, వలపర్ల, ద్వారకాపాడు, చింతగుంపల, వింజనంపాడు, పోలూరు, శ్యామాలవారిపాలెం, బొల్లాపల్లి, గ్రామాలలో ప్రజలకు అధికారంలోకి వచ్చిన వెంటనే రహదారుల నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కాలం తిరగకముందే నిధులు మంజూరు చేయించి రోడ్డు నిర్మాణాలకు స్వీకారం చుట్టారు. పలుమార్లు ఫైళ్లపై ఆయా శాఖల అధికారులతో చర్చించి వెంటనే నిధులు మంజూరు చేసేలా ఒత్తిడి తెచ్చారు. ఎమ్మెల్యే ఏలూరి కృషి ఫలితంగా రూ.13.25 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం నిధులు విడుదల చేసింది.

రోడ్డుకో చరిత్ర

గత టీడీపీ హయాంలో పలు రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. అనంతరం వ్చిన వైసీపీ ప్రభుత్వం రహదారుల టెండర్లు అన్ని రద్దుచేసి రోడ్ల నిర్మాణానికి అనుమతులు నిలిపివేసింది. దీంతో రహదారుల నిర్మాణం పూర్తిగా నిలిచిపోయింది. నాడు చినగంజాం మండలం చింతగుంపల రోడ్డు నిర్మాణానికి రూ.2కోట్లతో ప్రతిపాదనలు సిద్ధంచేసి మంజూరు చేయించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే టెండర్లు రద్దు చేయడంతో రోడ్లు పనులు నిలిచిపోయాయి. దీంతో ఐదేళ్లు గ్రామస్థులు నరకయాతన అనుభవించారు. అనేక రోడ్ల నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేయించి నిధులు మంజూరు చేయించినా వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నిర్ధాక్షణంగా టెండర్లు రద్దుచేయించి రహదారుల అభివృద్ధిని అడ్డుకుంది.

వేట నిషేధాజ్ఞలు ధిక్కరిస్తే కఠిన చర్యలు

అనుమతులు లేకుండా వేట సాగించడంపై విచారణ



మత్స్యకారులతో మాట్లాడుతున్న ఎఫ్‌డీవో రవీంద్ర

వాడరేవు(చీరాల), మే 19 (ఆంధ్రజ్యోతి) : నిషేదాజ్ఞలు ధిక్కరించి వేటసాగించే మత్స్యకారులపై శాఖాపరమైన చర్యలు తప్పవని ఎఫ్‌డీవో రవీంద్ర హెచ్చరించారు. ప్రభుత్వం ప్రస్తుతం తీరంలో ఏప్రిల్ 15 నుండి జూన్ 14 వరకు వేటనిషేధం విధించిందన్నారు. ఏటా ఈ సమయంలో మత్స్య సంపద వృద్ధి చెందే క్రమంలో భాగంగా అధికారులు ఆంక్షలు విధించారు. అయితే కర్రబోటు ఉండి లైసెన్స్ ఉన్న మత్స్యకారులకు వేట చేసుకునే వెసులుబాటు ఉంది. కానీ కొందరు లైసెన్స్ లేని మోటారు బోటు మత్స్యకారులు వేట సాగిస్తున్నారన్న ఫిర్యాదు అందిన నేపథ్యంలో మత్స్య శాఖ అధికారులు వాడరేవుకు చేరుకున్నారు. మెరైన్, ఈపూరుపాలెం పోలీసుల సహకారంతో తనిఖీలు నిర్వహించి అనధికారంగా వేట సాగిస్తున్నట్లు తెలుసుకుని ఆగ్రహం వ్యక్తం చేశారు. వేట నిలిపివేయకుంటే కేసులతో పాటు, లైసెన్స్‌లు రద్దు చేసి ప్రభుత్వం అందించే మత్స్యకార పథకాలను నిలుపుదల చేస్తామని హెచ్చరించారు.

శింగరకొండకు ప్రత్యేక గుర్తింపు వచ్చేలా కృషి

- మంత్రి గొట్టిపాటి రవికుమార్
- రాతి మండపం ప్రారంభం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు రవికుమార్, స్వామి

అద్దంకి, మే 19 (ఆంధ్రజ్యోతి): శింగరకొండకు రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు వచ్చేలా అభివృద్ధి చేయనున్నట్లు విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో సుమారు రూ.6.83 కోట్లతో నిర్మించిన రాతిమండపాన్ని సోమ వారం విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల బాలవీరాంజనేయస్వామి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం దాతల సహకారంతో అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతోందన్నారు. భక్తులు, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఆలయాన్ని అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు. ముందుగా విమాన శిఖర ప్రతిష్ఠ పూజా కార్యక్రమాలలో శృంగేరి పీఠం ఉత్తరాధి కారి విధుశేఖర భారతీ స్వామి తో కలిసి మంత్రులు రవికుమార్, బాలవీరాంజనేయ స్వామి, ఒంగోలు, కందుకూరు ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధన్, ఇంటూరి నాగేశ్వరరావులు పాల్గొన్నారు. ప్రసన్నాంజనేయస్వామికి మంత్రి రవికుమార్ పట్టువస్త్రాలు సమర్పించారు. జీవధ్వజస్తంభ పునఃప్రతిష్ట, ప్రత్యేక అభిషేకములు, పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. సినీనటులు కొల్లా అశోక్‌కుమార్, దేవాదాయశాఖ తిరుపతి రీజనల్ జాయింట్ డైరెక్టర్ చంద్రశేఖర్ ఆజాద్, మహాకుంభాభిషేకం ప్రత్యేకాధికారి, కాకాని దేవాలయం డిప్యూటి కమిషనర్, ఈవో లీలాకుమార్, శ్రీశైలం దేవస్థానం ఈవో ఎం.శ్రీనివాసరావు, బాపట్ల జిల్లా అసిస్టెంట్ కమిషనర్ సూర్యప్రకాశరావు, నర్సరావుపేట గ్రూపు దేవస్థానాల ఈవో రఘునాధరెడ్డి, అద్దంకి గ్రూపు దేవస్థానాల ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, శింగరకొండ ఆలయ ఈవో, అసిస్టెంట్ కమిషనర్ మదమంచి తిమ్మానాయుడు పాల్గొన్నారు.

ప్రజా పోరాటాలతోనే సుందరయ్యకు నివాళి



చీరాలలో సుందరయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నేతలు

అద్దంకిటౌన్, మే 19(ఆంధ్రజ్యోతి): ప్రజా పోరాటాలకు, ప్రగతి సాధకులకు నిత్య దర్శనికుడు నిజమైన స్ఫూర్తి పుచ్చలపల్లి సుందరయ్య సీపీఎం సీనియర్ నాయకులు కె. రఘుచంద్ అన్నారు. సోమవారం స్థానిక సుందరయ్య భవనంలో పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి కార్యక్రమం తంగిరాల వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ వివక్షతకు, భూస్వామ్యవ్యవస్థకు సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా అలుపెరగని పోరాటం చేసిన యోధుడు సుందరయ్య అని పేర్కొన్నారు. కార్యక్రమంలో షేక్ కరీమ్, బి.విజయకుమార్, ఆర్. కోటేశ్వరరావు, నాగేశ్వరరావు, ఆదాము, శరత్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రంగారావు

పంగులూరు: శ్రమజీవుల కోసం జీవితాన్ని అంకితం చేసిన ఆదర్శ నేత పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఎం సీనియర్ నేత నాగబోయిన రంగారావు అన్నారు. మండల కేంద్రమైన పంగులూరులో సోమవారం రాత్రి సుందరయ్య వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. చిన్ననాటి నుండి ఆదర్శ భావాలతో శ్రమజీవుల కోసం పోరాడిన పుచ్చలపల్లి కమ్యూనిస్ట్‌గానే కాకుండా పార్లమెంట్ సభ్యునిగా సమాజానికి ఉన్నతమైన ఆదర్శాలను చూపారన్నారు. సొంత ఆస్తిని కూడా పార్టీ కోసం పేద ప్రజల కోసం త్యజించారన్నారు. మరోనేత రాయిని వినోద్‌బాబు మాట్లాడుతూ సుంద రయ్య చూపిన మార్గం దేశానికి ఆదర్శనీయమన్నారు. నాగా ల్యాండ్ యూనివర్శిటీ విశ్రాంత ప్రొఫెసర్ వీర నారాయణ మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీని దక్షిణ భారతదేశంలో నిర్మించిన వ్యక్తి పుచ్చలపల్లి సుందరయ్య అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మల్లారెడ్డి, తలపనేని రామారావులు పాల్గొన్నారు.

చీరాల : పుచ్చలపల్లి సుందర్య నేటి నాయకులకు స్ఫూర్తికావాలని సీపీఎం నాయకులు ఎన్ బాబురావు, నారపరెడ్డి, రంగారావు, సుందర్, బ్రహ్మాంలు పేర్కొన్నారు. ఆయన వర్ధంతిని సోమవారం చీరాలలోని ఓ కల్యాణ మండపం వద్ద ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రోడ్లపై ప్రవహిస్తున్న మురుగునీరు

కాలువలు లేక ఇబ్బంది పడుతున్న ప్రజలు



మేదరమెట్లలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

మేదరమెట్ల, మే 19(ఆంధ్రజ్యోతి): మేదరమెట్లలో 80 శాతానికిపైగా సిమెంట్‌రోడ్లు నిర్మించారు. అయితే అంతేస్థాయిలో కాలువలు మాత్రం నిర్మించలేదు. మట్టి కాలువలల్లో ఎదైన అడ్డు పడినప్పుడు మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. చాలా రోడ్లలో సిమెంట్ రోడ్లపైనే నీరు నిలుస్తోంది. రోడ్లు నాణ్యతతో నిర్మించకపోవడంతో గుంటలు పడిపోయి ఎత్తు పల్లాలుగా ఉండడంతో చిన్నపాటి వర్షానికి కూడా రోడ్లపై నీరు నిలుస్తోంది. మేజర్ పంచాయతీ అయిన మేదరమెట్ల కూడలి నుంచి గ్రామంలోకి వెళ్లే రెండు ప్రధాన రహదారులలో ఒకటైన మిద్దెలడొంక సైడు కాలువలు నిర్మించలేదు. గత 30 ఏళ్లగా స్థానికులు పలుమార్లు సైడ్‌డ్రైన్లు నిర్మించాలని కోరిన పనులు మాత్రం జరగలేదు. మిద్దెల డొంకలో నిర్మించిన సిమెంట్ రోడ్డు కూడా అత్యంత నాసిరకంగా ఉంది. క్వాలిటీ కంట్రోల్ అధికారులు నాణ్యత సర్టిఫికేట్ ఇవ్వకపోవడంతో ఇప్పటికి రూ.9 లక్షలు పంచాయతీలోనే ఉన్నాయి. అడుగడుగున గుంటలతో అసలు ఇది సిమెంట్ రోడ్డేనా అనేవిధంగా రోడ్డు వేశారు. ఈ రోడ్డుకు రెండు వైపుల కాలువలు నిర్మించక పోవడంతో మురుగునీరు అంత రోడ్డుపైనే ప్రవహిస్తోంది. వివిధ పనులకు వెళ్లే మహిళలు, పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, స్థానికంగా నివసించేవారు కూడా తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కనీసం చిన్న పిల్లలు ఇంటి ముందు ఆడుకోవడానికి కూడా లేకుండా పోయిందని వాపోతున్నారు. దీనికి తోడు రోడ్డు ప క్కన పెట్టిన చెత్త కుండిలల్లో మూడు రోజులకు ఒ క సారి శుభ్రం చేయడంతో కుండీలలోని చెత్తను కు క్కలు రోడ్డుపైకి ఈడుస్తున్నాయి. మురుగునీరు రోడ్లు పై ప్రహిస్తున్నాయని గ్రామస్తులు పదే పదే ఫిర్యాదు చేసినప్పుడు పంచాయతీ అధికారులు తూతు మంత్రంగా కాలువలను సరిచేస్తున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం ఎప్పుడు లభిస్తుందా అని మిద్దెలడొంక వాసులు ఎదురు చూస్తున్నారు. ఇప్పటికైన పంచాయతీ అధికారులు స్పందించి సైడ్ డ్రైన్‌ల నిర్మాణంతోపాటు సిమెంట్ రోడ్డు కూడా తిరిగి నిర్మించాలని కోరుతున్నారు.

డయల్ యువర్ డీఎంకు ఐదు వినతులు

అద్దంకి, మే19(ఆంధ్రజ్యోతి): అద్దంకి డిపో పరిధిలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి ఐదు వినతులు వచ్చినట్లు డీఎం రామ్మోహనరావు తెలిపారు. అద్దంకి నుంచి వినుకొండకు ఉదయం 6.30 గంటలకు ఏర్పాటు చేయాలని ప్రసన్నాంజనేయులు కోరగా ఆ విషయం వినుకొండ డిపో పరిధిలోనిదన్నారు. అద్దంకి-ఇంకొల్లు-విజయవాడ సర్వీసు ను పునరుద్ధరించాలని బదరీనారాయణ కోరగా గతంలో సరిగ్గా ఆదాయం రానందున నిలిపివేసినట్లు తెలిపారు. కొటికలపూడికి బస్ ఏర్పాటు చేయాలని రాకేష్ కోరగా 2 కి.మీ దూరంలో బస్ రూట్ ఉన్నందున సాధ్యం కాదని తెలిపారు. బొడ్డువాని పాలెం హైవే వద్ద బస్సులు ఆపాలని వీరాంజనేయులు కోరగా, ఇప్పటికే పల్లెవెలుగు బస్సులు నిలుపుతున్నట్లు తెలిపారు. ఒక వేళ బస్సులు నిలపకపోతే ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అద్దంకి నుండి బల్లికురవ మీదుగా గుంటూరు కు బస్ ఏర్పాటు చేయాలని శ్రీనివాసరావు కోరగా నర్సరావుపేట, చిలకలూరిపేటల వరకు బస్సులు నడుపుతున్నట్లు డీఎం రామ్మోహనరావు తెలిపారు.

22న అద్దంకిలో నియోజకవర్గ మహానాడు

- హాజరుకానున్న మంత్రి రవికుమార్

అద్దంకి, మే19(ఆంధ్రజ్యోతి) : అద్దంకి నియోజకవర్గ స్థాయి మహానాడు ఈ నెల 22న ఉదయం 10 గంటలకు అద్దంకి పట్టణంలోని నాగులపాడు రోడ్డులోని కామేపల్లి కల్యాణ మండపంలో నిర్వహించనున్నారు. ముఖ్య అతిథిగా విద్యుత్‌శాఖ మం త్రి గొట్టిపాటి రవికుమార్ హాజరుకానున్నారు.

పుష్పలతకు బంగారు పతకం



బంగారు పతకం అందుకుంటున్న పుష్పలత

చీరాల, మే 19 (ఆంధ్రజ్యోతి) : భగవద్గీత అవగాహన అంశంలో చీరాలకు చెందిన నన్నపనేని పుష్పలతకు బంగారు పతకం లభించింది. మైసూరు గణపతి సచ్చిదానంద ఆశ్రమం నుంచి ఈ నెల 2వ తేదీన ఆన్‌లైన్ ద్వారా పీఠంకు చెందిన ఐదుగురు గురువులు 90 నిమిషాలు పాటు నిర్వహించిన భగవద్గీత అవగాహన పోటీలో నన్నపనేని పాల్గొని కళ్లు మూసుకుని ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా వివరించారు. ఈక్రమంలో ఆశ్రమం పిలుపు మేరకు శనివారం రాత్రి మైసూర్‌లో జరిగిన బహుమతి ప్రధానోత్సవంలో పాల్గొని గణపతి సచ్చిదానంద చేతుల మీదుగా బంగారు పతకం అందుకున్నారు.

అసంబద్ధంగా ఉపాధ్యాయుల బదిలీలు



అభివాదం చేస్తున్న ఉపాధ్యాయులు

చీరాల, మే 19 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులలో అసంబంధమైన విధానాలు ఉన్నాయని, వాటిని వెంటనే తొలగించి నూతన విధానంతో ఉద్యోగోన్నతులు కల్పించాలని ఉపాధ్యాయుల సంఘం ఐక్యవేదిక ప్రతినిధులు డిమాండ్ చేశారు. సోమవారం యూటీఎఫ్, ఏపీటీఎఫ్ ప్రతినిధులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుధవారం పాత జిల్లాకేంద్రాల్లో జిల్లా విద్యాశాఖ కార్యాలయాలు ముట్టడించాలని తీర్మానించారు. సమస్యల పరిష్కారం కోరుతూ చేపడుతున్న ముట్టడి కార్యక్రమానికి పెద్దసంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు భిక్షాలు, నాగమల్లేశ్వరరావు, నారాయణ, శ్రీనివాసులు, ఏసురత్నం, కుర్రా రామారావు, సురేష్ పాల్గొన్నారు.

ఏపీఈఏపీసెట్‌కు 24 మంది గైర్హాజరు

చీరాల, మే 19 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సెయింట్ ఆన్స్ కాలేజ్‌ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఏపీఈఏపీ సెట్ - 2025 పరీక్షలు జరిగినట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు పేర్కొన్నారు. రెండు షిఫ్టుల్లో జరిగిన పరీక్షలకు 24 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. ప్రిన్సిపల్ డా.జగదీష్ పర్యవేక్షించారు.


రహదారికి నిధుల మంజూరుపై హర్షం



సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు నివాళి అర్పిస్తున్న నేతలు

మార్టూరు, మే19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో కోనంకి నుంచి వలపర్ల మీదగా కొండమూరు వరకు తారురోడ్డు నిర్మాణానికి రూ. 3.50 కోట్ల రూపాయల నిధులు మంజూరుకు కృషి చేసినందులకు సోమవారం రాత్రి వలపర్ల గ్రామంలో టీడీపీ కూటమి నాయకులు ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన కూడలిలోని ఎన్‌టీఆర్ విగ్రహం నుంచి సినిమాహాలు కూడలి వరకు కూటమి నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చేసిన కృషితో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని నాయకులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. అంతేగాకుండా ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుల చిత్రపటాలతో ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో కంభంపాటి హనుమంతరావు,షేక్ బషీర్, వంకాయలపాటి వెంకట సుబ్బారావు, శ్రీనివాసరావు, వెలగా రామాంజనేయులు,గుంటి వెంకటేశ్వర్లు,సర్పంచ్ తాళ్లూరి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు
మంగళవారం 20 మే 2025



ఉష్ణోగ్రత వివరాలు

కేంద్రం	గరిష్టం	కనిష్టం
నెల్లూరు	31.5	25.9
కావలి	32	27
ఆత్మకూరు	36	24
ఉదయగిరి	33	27
కందుకూరు	36	27



నడి వేసవిలోనూ నిమ్మ ధర పతనం

కిలో రూ.100 నుంచి 40లకు పతనం



నిమ్మకాయలను గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

ఎండలు మండుతున్న వేళ ఉష్ణతాపం నుంచి ఉపశమనానికి నిమ్మరసం తాగుతుంటారు. శుభకార్యాలు, వివిధ సందర్భాల్లోనూ నిమ్మకాయల వినియోగం ఎక్కువగా ఉంటుంది. అందుకే వేసవిలో నిమ్మకాయలు ధర పెరుగుతుంది. కానీ ఈసారి అందుకు భిన్నమైన పరిస్థితి నెలకొంది. ఎండలు మండుతున్నా నిమ్మ ధరలు మాత్రం రోజు రోజుకు తగ్గిపోతున్నాయి. మార్చి నెలాఖరులో బస్తా రూ.10వేల దాకా పలికింది. ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉన్నా కాయల నాణ్యతను బట్టి బస్తా రూ.2వేల నుంచి 5వేల దాకా ఉంది. మార్చి నెలాఖరులో కిలో రూ.100 అమ్మిన నిమ్మకాయలు ప్రస్తుతం రూ.40లకు చేరుకున్నాయి. వేసవిలో ధరలు బాగా ఉంటాయని ఆశతో ఎదురుచూస్తున్న రైతులకు నిరాశ మిగిలింది. పాకిస్థాన్ - ఇండియా మధ్య యుద్ధం ఓ వారం, మరో వారం ఢిల్లీలో వర్షాలు కురుస్తున్న కారణంగా ధరలు పడిపోయాయి. పొదలకూరు లెమన్ మర్చంట్ అసోసియేషన్ కార్యదర్శి అట్ల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ తెనాలి, ఏలూరు, బీజాపూర్ నుంచి నిమ్మకాయలు ఎక్కువగా వస్తున్నాయని, మార్కెట్ తగ్గడానికి ఇది ఒక కారణమన్నారు. అలాగే కేరళాకు ఎక్కువగా నిమ్మకాయల లోడ్లు వెళ్లేవని, అయితే తమిళనాడు నుంచి కాయలకు డిమాండ్ తగ్గిందన్నారు. అంతేగాక కాయల్లో క్వాలిటీ తగ్గడం కూడా ధర తగ్గడానికి మరో కారణమని చెప్పారు. మూడేళ్ల క్రితం ఇదే సీజన్‌లో నిమ్మ బస్తా 16వేల వరకు విక్రయించారు. అయితే గడిచిన రెండేళ్లుగా బస్తా ధర రూ.10వేలు దాటలేదు. ప్రస్తుతం కాయ నాణ్యతను బట్టి రూ.2-5 వేల వరకు ధర పలుకుతోంది.

- పొదలకూరు, (ఆంధ్రజ్యోతి)

ఘాటు తగ్గిన మిరప

గతేడాది క్వింటం రూ.20 వేలు..
ఇప్పుడు రూ.10 వేలే!

ఈసారి ఎండు మిరప ఘాటు తగ్గింది. గతేడాది ఇదే సీజన్‌లో క్వింటం రూ.16 వేల నుంచి 20 వేలు ధర పలికింది. ఇప్పుడు మాత్రం డిమాండ్ లేదంటూ వ్యాపారులు, దళారులు దోపిడీకి తెరలేపారు. అనంతసాగరం మండంలోని బొమ్మవరం, చాపురాళ్లపల్లి, అగ్రహారం, గోగులపల్లి, యాకర్లపాడు, సంజీవనగరం గ్రామాల్లో సుమారు 600 ఎకరాల్లో మిరప సాగు చేశారు. ఒక ఎకరా విస్తీర్ణంలో సాగుకు రూ.1.3 లక్షల దాకా ఖర్చు అవుతుంది. అయినా రైతులు వెనకడుగు వేయక సాగుకు ఉపక్రమించారు. అయితే పంటకు తెగుళ్ల వ్యాప్తి, ఎండతీవ్రత, వాతావరణం సహకరించక దిగుబడులు తగ్గాయి. ఇక ఎండు కాయల కోసం పంటను వదులుకోగా అందుకు తగ్గట్టు ధర లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. సుమారు 20 క్వింటాళ్లకుపైగా దిగుబడి రావాల్సి ఉండగా నేడు అందుకు భిన్నంగా పరిస్థితి ఉన్నట్లు చెబుతున్నారు. గుంటూరు మార్కెట్ యార్డ్‌కు ఎగుమతి సక్రమంగా లేదంటూ రూ.10 వేల నుంచి నాణ్యతను బట్టి రూ.12 వేలకు అడుగుతున్నారు. దీంతో పెట్టుబడి ఖర్చులు కూడా రావేమోనన్న దిగులు సాగుదారుల్లో నెలకొంది.

- అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి)



ఈఏపీ సెట్ ప్రారంభం

తొలిరోజు 1,277 మంది హాజరు

నెల్లూరు(విద్య), మే 19 (ఆంధ్రజ్యోతి) : ఇంజనీరింగ్, వ్యవసాయ కోర్సులకు సంబంధించి సోమవారం ఈఏపీసెట్ ప్రారంభమైంది. తొలిరోజు బైపీసీ స్ట్రీమ్‌కు రెండు సెషన్స్‌లో పరీక్ష నిర్వహించారు. జిల్లాలో ఐదు పరీక్ష కేంద్రాల్లో వీటిని నిర్వహించారు. ఉదయం 687 మంది హాజరు కావాల్సిఉండగా 625 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం 695 మంది హాజరు కావాల్సి ఉండగా 652 మంది కలిపి హాజరయ్యారు. ఉదయం 9 నుంచి 12 గంటలవరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు పరీక్ష జరిగింది. పరీక్ష కేంద్రాల విద్యార్థులను మెటల్ డిటెక్టర్‌లతో తనిఖీ చేసి, బయోమెట్రిక్ వేయించి లోపలకు అనుమతించారు.

● టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు..

నెల్లూరు(విద్య) : టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 38 కేంద్రాలో తొలిరోజు జరిగిన తెలుగు పరీక్షకు 454 మంది గైర్హాజరయ్యారు. ఈ పరీక్షకు మొత్తం 1343 మంది దరఖాస్తు చేసుకోగా, 889 మంది హాజరయ్యారు. ఉదయం 9.30 నుంచి 12.45 గంటల వరకు జరిగిన ఈ పరీక్షకు విద్యార్థులు గంట ముందుగానే కేంద్రాల వద్దకు చేరుకున్నారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేశామని డీఈవో బాలాజీరావు తెలిపారు. ఈ పరీక్షల నిర్వహణ తీరును డీఈవో 5 కేంద్రాలు, ఫ్లైయింగ్ స్క్వాడ్ 18 కేంద్రాల్లో పరిశీలించారు.



నెల్లూరు నగరాన్ని కమ్మిన కరిమబ్బులు

షైనింగ్ స్టార్స్ అవార్డుకు విద్యార్థుల ఎంపిక

- వివరాలు 8లో..

మండుటెండలో చల్ల.. చల్లగా!

జిల్లావ్యాప్తంగా విస్తారంగా వర్షం
చల్లబడ్డ వాతావరణం

నెల్లూరు (హరనాధపురం), మే 19 (ఆంధ్రజ్యోతి) : మొన్నటిదాకా ప్రచండుడి భగభగలతో అల్లాడిపోయిన జిల్లా ప్రజానీకం సోమవారం కాస్త ఊరటనిచ్చింది. బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో తెల్లవారుజామునుంచే మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. జిల్లావ్యాప్తంగా అక్కడ క్కడా ఉరుములు, మెరుపులు, గాలులతో కూడిన వర్షం కురవడంతో అన్నదాతల్లో ఆనందం వ్యక్తమవుతోంది. నెల్లూరు, కావలి, కందుకూరు, ఉదయగిరి తదితర ప్రాంతా ల్లో వర్షం కారణంగా రోడ్లపై నీరు ప్రవహించింది.

● జిల్లా వర్షపాతం 26.3 మి.మీ

జిల్లాలో సగటు వర్షపాతం 26.3మి.మీ నమోదైంది. అత్యధికంగా దగదర్తిలో 68.4మి.మీ, అత్యల్పంగా కొండాపురంలో 2.0మి.మీ వర్షం కురిసింది. వెంకటాచలంలో 68.2, బోగోలులో 64.8, పొదలకూరులో 57.4, కావలి 55.4, జలదంకి 51.6, కందుకూరు 46.6, విడవలూరు 42.6, కలిగిరి 41.6, ఆత్మకూరు 40.6, అల్లూరు 36.6, ఉలవపాడు, కొడవలూరు 36.4, చేజర్ల 35.2, నెల్లూరు అర్బన్ 6.2, నెల్లూరు రూరల్10.6, సంగం 34.2, ఏఎస్‌పేట 30.6, మనుబోలు 22.6, అనంతసాగరం 21.4, బుచ్చిరెడ్డిపాలెం 19.6, వింజమూరు 18.6, కలువాయి 18.2, టీపీగూడూరు 17.4, దుత్తలూరు 16.8, కోవూరు 16.6, లింగసముద్రం 16.2, ఇందుకూరుపేట 11.4, సైదాపురం 11.2, గుడ్లూరు 8.2, మర్రిపాడు 6.6, ఉదయగిరిలో 6మి.మీ వర్షం కురిసింది.

మామిడికి తప్పని నష్టం

ఉలవపాడు, (ఆంధ్రజ్యోతి) : అకాల వర్షం మామిడి రైతుల్లో గుబులు రేపుతోంది. అసలే వేసిన పూత పిందెలుగా మారకముందే కాపు తేలిపోయిందని, అడపాదడపా నిలిచిన కాపు కోతకు వచ్చే సమయంలో అకాలంగా కురుస్తున్న వర్షాలకు కాయలు పండిపోతాయని చెందుతున్నారు. సోమవారం మండలంలో 37 మి.మీ వర్షపాతం నమోదు అయింది. దీనికితోడు ఉదయం నుంచి ముసురు ఉండటంతో మామిడి కాయలు చెట్లకే పండి రాలిపోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇంతటితో ఆగి రెండు రోజులు ఎండకాస్తే మామిడి రైతు కోలుకుంటాడు. లేనిపక్షంలో కోలుకోలేని దెబ్బ తగులుతుంది. ఈసారి ఎర్రమట్టి నేలలో కాపు తగ్గినా ఇసుక నేలలో ఆశించినంత కాపు వచ్చింది. అయితే, మరో రెండు రోజులు వర్షం కురుస్తుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. అలాగే జరిగితే, ఇసుక నేలల్లోని మామిడికి పురుగు ఆశించే స్థాయి ఎక్కువగా ఉంది.

● సపోటాకు కొంతమేర నష్టం

వరుస కోతలు జరుగుతున్న ఈ సీజన్‌లో సగం సపోటా చెట్లపైనే ఉంది. ఈ వర్షంతో పెద్దగా నష్టం లేకున్నా రోజులు గడిచే కొద్ది పంటకొచ్చిన కాపు చెట్లపైనే పండి రాలిపోతుందని సాగుదారులు ఆందోళన చెందుతున్నారు.



కోతకు సిద్ధంగా ఉన్న మామిడి



కావలి : ట్రంకు రోడ్డుపై వర్షపు నీరు

బాలింతలకు తీపి కబురు!

మళ్లీ అందుబాటులోకి బేబి కిట్లు
11 రకాల వస్తువులు అందజేయనున్న ప్రభుత్వం



నెల్లూరు (వైద్యం), మే 19 (ఆంధ్రజ్యోతి) : బాలింతలకు రాష్ట్ర ప్రభుత్వం తీయని కబురందించింది. ఎప్పుడో ఆరేళ్ల క్రితం ఆగిపోయిన బేబికిట్లను తిరిగి పునరుద్ధరిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సోమవారం జీవో నెం.61 విడుదల చేసింది. ఒక్కో కిట్ విలువ రూ.1410 ఉండగా, జిల్లాలో ఏడాదికి 14 వేల ప్రసవాలు జరుగుతుండగా రూ.1.97 కోట్లు ఖర్చువుతుంది. 2016లో అప్పటి టీడీపీ సర్కారు ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవించే గర్భవతులకు పుట్టే పిల్లల కోసం ఎన్టీఆర్ బేబికిట్లను అందుబాటులోకి తెచ్చింది. ప్రభుత్వ ఆసుపత్రులలో ఏడాదికి 14వేల ప్రసవాలు జరుగుతుండగా, అందరికీ ఈ కిట్లు అందేలా చర్యలు చేపట్టింది. అయితే, 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక ఎన్టీఆర్ బేబికిట్లను వైఎస్సార్ బేబికిట్లుగా పేరు మార్చి బాలింతలకు అందజేసింది. అయితే, ప్రభుత్వం ఏర్పడిన తొలి 6 నెలల మాత్రమే కిట్లు అందజేసి, ఆ తర్వాత ఆపేసింది. దీంతో బాలింతలు తమ పురిటిబిడ్డల కోసం అవసరమైన సామగ్రిని బహిరంగ మార్కెట్లో కొనుగోలు చేయాల్సి వచ్చేది.

కిట్లలో ఉండేవి..

బేబి కిట్లలో బేబి బెడ్, దోమతెర, టవల్ లిక్విడ్ సోప్, బేబి ఆయిల్, హ్యాండ్ బ్యాగ్, న్యాప్‌కిన్, పౌడర్, డైపర్, షాంపూ, బేబి సోప్, సోప్‌బాక్స్, చిన్న బొమ్మలు ఉంటాయి.

● కిట్‌లో 11 వస్తువులు..

గతేడాది అధికారం చేపట్టిన ఎన్డీఏ కూటమి ప్రభుత్వం మ్యానిఫెస్టోలో పేర్కొన్న అంశాలన్నీ నెరవేర్చుతూ వస్తోంది. అయితే, గతంలో టీడీపీ అమలు చేసిన ఎన్టీఆర్ బేబికిట్లను తిరిగి అమలులోకి తెచ్చేలా నిర్ణయం తీసుకుంది. దాదాపు 11 వస్తువులు ఉండే ఒక్కో కిట్ విలువ రూ.1,410 ఉంటుంది. నెల్లూరులోని జీజీహెచ్‌లో ప్రతి నెల 400 ప్రసవాలు జరుగుతుండగా, ఆత్మకూరు జిల్లా ఆసుపత్రి, కందుకూరు, కావలి ఏరియా ఆసుపత్రులలోనూ, సామాజిక ఆరోగ్య కేంద్రాలలోనూ మరో 600లకుపైగా ప్రసవాలు జరుగుతుంటాయి. ఇకపై ప్రభుత్వ ఆసుపత్రిలో పురుడు పోసుకున్న ప్రతిబాలింతకు ఓ కిట్‌ను ఇవ్వనున్నారు. కూటమి ప్రభుత్వ నిర్ణయంతో పేదవర్గాలు ఆనందం వ్యక్తంచేస్తున్నాయి.

ఎంతో శుభపరిణామం

ఐదేళ్లకుపైగా పురిటిబిడ్డలకు బేబి కిట్‌లే రావడం లేదు. వైసీపీ ప్రభుత్వం కేవలం 6 నెలలు మాత్రమే కిట్‌లను ఇచ్చి ఆపేసింది. దీంతో బాలింతలపై ఆర్థిక భారం పడేది. అయితే రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ కిట్లు ఇవ్వనున్నట్లు జీవో జారీ చేయడం శుభపరిణామం. ఈ కిట్లు వస్తే ఎంతో మంది పేదవారికి ప్రయోజనం చేకూరుతుంది.

- డాక్టర్ నరేంద్ర,
జీజీహెచ్ ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్



వింజమూరు : యువతకు టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

'మహా' సంబరం!

పండుగలా 'మినీ మహానాడు' ● సర్వేపల్లి, నెల్లూరు రూరల్, కావలి, కందుకూరు, ఉదయగిరిలలో నిర్వహణ

నెల్లూరు, మే 19 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ ప్రధాన వేడుక అయిన మహానాడు కార్యక్రమానికి ముందు నిర్వహించే నియోజకవర్గ స్థాయి మినీ మహానాడు కార్యక్రమాలు జిల్లావ్యాప్తంగా పండుగ వాతావరణంలో జరుగుతున్నాయి. సోమవారం ఒక్క రోజే ఐదు నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమాలు జరిగాయి. సర్వేపల్లి, నెల్లూరు రూరల్, కావలి, ఉదయగిరిలలో మినీమహానాడుల సంబరం అంబరాన్ని తాకాయి. ప్రజాప్రతినిధులు, పార్టీ పదవుల్లో ఉన్న నాయకులతోపాటు ప్రతి గ్రామం నుంచి కార్యకర్తలు ఈ కార్యక్రమాలకు తరలివచ్చారు. నాయకులు, కార్యకర్తలు ఒకచోట చేరడంతో ఆయా ప్రాంతాల్లో సందడి వాతావారణం కనిపించింది. ఈ సందర్భంగా ఆయా నియోజకవర్గాల్లోని అభివృద్ధి పనులు, ఇతర అంశాలపై తీర్మానాలు ఆమోదించారు. వెంకటాచలం మండలం చెముడుగుంట వద్దనున్న శ్రిడ్స్ కల్యాణ మండపంలో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో సర్వేపల్లి నియోజకవర్గ మినీ మహానాడు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ బోర్డు చైర్మన్ జడ్ శివప్రసాద్, ఎన్విరాన్‌మెంట్ బోర్డు చైర్మన్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డి తదితర ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

● నగరంలోని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో రూరల్ నియోజకవర్గ మినీ మహానాడు ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డిలు హాజరయ్యారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులపై 12 ప్రతిపాదనలను తీర్మానించారు.

● వింజమూరులోని ఎస్వీ కన్వెన్షన్ హాల్లో ఉదయగిరి నియోజకవర్గ స్థాయి మినీ మహానాడు కార్యక్రమం ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో జరిగింది. మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ చెంచలబాబు యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు అంశాలపై తీర్మానాలు చేశారు.

● కావలిలోని నారాయణ కల్యాణ మండపంలో ఎమ్మెల్యే దగ్గుమాటి వెం కటకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మినీ మహానాడు జరిగింది. తమ ప్రాంతాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించి తీర్మానాలు చేశారు.

● కందుకూరులో జరిగిన మినీ మహానాడులో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. పలు అంశాలపై తీర్మానాలు చేశారు.



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి ఆనం, ఎమ్మెల్యే సోమిరెడ్డి తదితరులు

శేష వాహనంపై ఆదిదంపతుల వైభోగం



బుచ్చిరెడ్డిపాళెం, మే 19 (ఆంధ్రజ్యోతి) : జొన్నవాడలో జరుగుతున్న మల్లికార్జునస్వామి, కామాక్షితాయి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం స్వామి, అమ్మవారు శేష వాహనంపై కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం తిరుచా ఉత్సవంలో ఆదిదంపతులు విహరించారు. ఈ సందర్భంగా అంతరాలయంలో ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. ఆలయానికి వచ్చిన భక్తలకు దాతల సహకారంతో ఉచిత ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, ఈఓ శ్రీనివాసులురెడ్డి, సభ్యులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

● ఉత్సవాలలో నేడు

బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం పురుషామృగ వాహనంపై స్వామి అమ్మవారు దర్శనం ఇవ్వనున్నారు.

ఆపరేషన్ కోసం వస్తే ఆయువు తీశారు !

● కావలి పీపీ యూనిట్ వైద్యుల నిర్వాకం
● మృతురాలి బంధువుల ఆందోళన
● గుండెపోటుతోనే మృతి : డాక్టరు



కావలి ఏరియా ఆసుపత్రి వద్ద గుమికూడిన జనం

కావలి, కావలిరూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స కోసం వచ్చిన మహిళ ఏకంగా ప్రాణాలనే పోగొట్టుకుంది. ఇందుకు కావలి ఏరియా వైద్యశాలలోని పీపీ యూనిట్ వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ మృతురాలి బంధువులు ఆందోళన వ్యక్తం చేశారు. వారి కథనం మేరకు.. కావలి పట్టణం మద్దూరుపాడుకు చెందిన రావినూతల సునీత (35)కు 15 ఏళ్ల కుమార్తె అనంతరం గత నెల 15వ తేదీన మరో మగబిడ్డకు జన్మనిచ్చింది. ఇద్దరు పిల్లలు ఉండటంతో కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స చేయించుకోవాలని 20 రోజుల కిందట పీపీ యూనిట్‌కు వస్తే అన్ని రకాల పరీక్షలు చేసి సోమవారం రమ్మన్నారు. దీంతో సునీత ఆసుపత్రికి రాగా ఆమెను నడిపించుకుని ఆపరేషన్ థియేటర్‌కు తీసుకుపోతూ పొట్ట లావుగా ఉంది. మత్తు ఎక్కువ అవసరం అవుతోందని ఆశావర్కర్ ఉమ ద్వారా రూ.700 తీసుకుని మత్తు మందు తెప్పించారు. ఆపరేషన్ అయిన వెంటనే ఆమెను గదికి తీసుకురాగా సునీతలో కదలిక కనిపించలేదు. ఈ విషయమై బంధువులు అక్కడున్న సిబ్బందిని అడగగా మత్తు ఎక్కువైనందున అలా ఉందని చెప్పారు. ఎంతసేపటికీ ఆమెలో కదలిక లేకుండా శరీరం చల్ల పడుతుండటంతో మరోమారు సిబ్బందిని ప్రశ్నించారు. దీంతో వారు ఆపరేషన్ చేసిన డాక్టర్ రజనీకి చెప్పి సెలైన్ కట్టేందుకు ప్రయత్నించగా అది ఎక్కలేదు. దీంతో సునీతను అత్యవసర వార్డులోకి తీసుకువెళ్లి కొంతసేపు తర్వాత మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో బంధువులు డాక్టర్‌ను నిలదీయగా గుండెపోటు వచ్చిందని చెప్పారు. మత్తు ఎక్కువగా ఇచ్చినందునే సునీత మృతి చెందిదంటూ బంధువులు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడగా కావలి డీఎస్పీతోపాటు ఇద్దరు సీఐలు పోలీస్ సిబ్బంది పీపీ యూనిట్‌కు చేరుకుని, విచారించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి కూడా ఏరియా వైద్యశాలకు వచ్చి మృతురాలి బంధువులతో మాట్లాడారు. బాధిత కుటుంబానికి అండగా నిలిచి న్యాయం చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో వారు శాంతించారు.



సునీత మృతదేహం

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	130
స్కిన్ చికెన్	234
స్కిన్‌లెస్	260

కోడిగుడ్ల ధర (100): 550

ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టండి : ఎమ్మెల్యే దగుమాటి

బిట్రగుంట, మే 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటిచెట్లపాలెం, పాతపాలెం గ్రామాల మధ్య ఆర్‌అండ్‌బీ రోడ్డు కల్వర్టు వద్ద ఏర్పడిన పెద్ద గోతుల వలన ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం ఆయన బోగోలు మండలం తూర్పు తీర ప్రాంత టీడీపీ మత్స్యకార నేత ఇంట వివాహ కార్యక్రమానికి ఆ మర్గంలో వెళ్లి ఆ గోతిని గమనించారు. నిత్యం రద్దీగా ఉండే రోడ్డులో ఇలాంటి గుంతల వలన ప్రమాదాలు జరిగి ప్రజలు ఇబ్బందులు పడుతారని, యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయాలని సూచించారు. ఆయన వెంట పార్టీ మండల కన్వీనర్ నాగేశ్వరరావు, ఆదిశేషయ్య, మత్స్యకార నేతలు పార్థస్, గోవిందు, కొండయ్య, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

బలహీనవర్గాల అభివృద్ధే టీడీపీ అజెండా

● కావలి మినీ మహానాడులో ఎమ్మెల్యే కృష్ణారెడ్డి ● మాజీ సీఎం ఎన్టీ రామారావుకు ఘన నివాళి




కావలి మినీ మహానాడులో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, సమావేశానికి హాజరైన టీడీపీ నేతలు, కార్యకర్తలు

కావలి, మే 19(ఆంధ్రజ్యోతి): బడుగు బలహీన వర్గాల అభివృద్ధే అజెండాగా సంక్షేమ పథకాలను టీడీపీ ప్రభుత్వం అమలు చేస్తోందని కావలి ఎమ్మెల్యే దగమాటి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. కావలి పట్టణంలోని మనోహర్‌రెడ్డి, నారాయణల కల్యాణ మండపంలో సోమవారం సాయంత్రం కావలి నియోజకవర్గ మినీ మహానాడు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో జరిగింది. ముందుగా దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఇటీవల కాలంలో మృతి చెందిన టీడీపీ కుటుంబ సభ్యులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు బడుగుల అభ్యున్నతే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీని స్థాపించి 9 నెలలకే అప్పటి కాంగ్రెస్ దర్మార్గపాలనను అంతం చేస్తూ టీడీపీని అధికారంలోకి తీసుకువచ్చిన ఘనత ఎన్టీఆర్‌దేనన్నారు. ఈ సభలో టీడీపీ నేతలు గుత్తికొండ కిషోర్, బీద గిరిదర్, జ్యోతి బాబూరావు, పోతుగంటి అలేఖ్య, డాక్టర్ ప్రభాకర్ నాయుడు, మొగిలి కల్లయ్య, కండ్లగుంట మధుబాబు నాయుడు, ఆవుల రామకృష్ణ, పోట్లూరు శ్రీనివాసులు, వడ్డే శ్రీకాంత్ నాయడు, మాలేపాటి నాగేశ్వరరావు, గుంటుపల్లి రాజకుమార్ చౌదరి, బొట్లగుంట శ్రీహరినాయుడు, నాయుడు రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● **ఇవి తీర్మానాలు**

అనంతరం టీడీపీ మండల అధ్యక్షులు, నేతలతో కలిసి కావలి నియోజకవర్గంకు సంబంధించిన పలు తీర్మానాలకు మినీ మహానాడులో ఆమోదించారు. దగదర్తిలో విమానాశ్రయం, రామాయపట్నం పోర్టు, బీపీసీఎల్ కంపెనీ నిర్మింపచేస్తున్న సీఎం చంద్రబాబుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలపుతూ తీర్మానించారు. బిట్రగుంటలో వందేభారత్ సర్వీస్ సెంటర్, మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్క్, కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయాలని తీర్మానించారు. కావలి రూరల్ మండలం, అల్లూరుకు సంబంధించి రాజుపాలెం నుంచి రామాయపట్నం పోర్టు వరకు జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ మీదుగా 4 లైన్ల జాతీయ రహదారి నిర్మించాలని తీర్మానించారు. కావలి పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు ఉదయగిరి రోడ్డు నుంచి జాతీయ రహదారి వరకు పడమర వైపున బైపాస్ నిర్మాణం, కావలి పట్టణ తూర్పు, పడమరలను అనుసంధానం చేస్తూ రేల్వే అండర్‌పాస్‌లను నిర్మించాలని, కావలి పట్టణంలో అడిషనల్ జిల్లా జడ్జి కోర్టు, మినీ స్టేడియం నిర్మాణం, ప్రభుత్వ జూనియర్ కళాశాల కావాలని తీర్మానం చేశారు.

సంక్షేమ పథకాల ఆద్యుడు ఎన్టీఆర్

● అభివృద్ధికి ఐకాన్ చంద్రబాబు ● కందుకూరు మినీ మహానాడులో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, మే 19(ఆంధ్రజ్యోతి): దేశానికి సంక్షేమాన్ని పరిచయం చేసి సంక్షేమ పథకాల ఆద్యుడుగా టీడీపీ వ్యవస్థాపకుడు దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు అయితే.. అభివృద్ధిని కొత్తపుంతలు తొక్కించటం ద్వారా చంద్రబాబునాయుడు అభివృద్ధికి ఐకాన్‌గా నిలిచారని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. పట్టణంలోని తిరుమల కళ్యాణ మండపంలో సోమవారం సాయంత్రం కందుకూరు నియోజకవర్గ స్థాయిలో టీడీపీ మినీ మహానాడు కార్యక్రమం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే ఇటీవలి కాలంలో మృతి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు, పెహల్గాం ఉగ్రవాదుల దాడిలో చనిపోయిన వారికి, పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో మృతి చెందిన సైనికులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా నియోజకవర్గం నలుమూలల నుంచి తరలివచ్చిన టీడీపీ నాయకులు, కార్యకర్తలనుద్దేశించి ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించి 43 ఏళ్ల పూర్తికాగా అందులో 23 సంవత్సరాలు అధికారంలో ఉన్నామంటే మన నాయకులు అందించిన సుపరిపాలనతో పాటు దానివెనుక కార్యకర్తల కృషి మరువలేనిదని పేర్కొన్నారు. కందుకూరు నియోజకవర్గంలో తనను ఎమ్మెల్యేగా గెలిపించిన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఎప్పటికీ రుణపడి ఉంటానని వారికి అండగా ఉండటం ద్వారా పార్టీ అభివృద్ధికి పాటుపడతానని చెప్పారు. ఈ సందర్భంగా కందుకూరు నియోజకవర్గంలో ఎంతోకాలంగా పురోగతిలేని ఏడు ప్రధాన సమస్యలను ఈనెల 27,28,29 తేదీలలో కడపలో జరగనున్న మహానాడులో ప్రవేశపెట్టాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, నార్నె రోశయ్య, జనిగర్ల నాగరాజు, మాదాల లక్ష్మీనరసింహం, రాచగర్ల సుబ్బారావు, కంద్రా మాల్యాద్రి, పిడికిటి వెంకటేశ్వర్లు, ఉప్పుటూరి శ్రీనివాసరావు, ఉన్నం వీరాస్వామి, చదలవాడ కొండయ్య, షేక్ రఫీ, చిలకపాటి మధుబాబు, ఎన్వీ రమణయ్య, గొట్టిపాటి హరికృష్ణ, కల్లూరి శైలజ, మన్నం శైలజ, అల్లం సుమతి తదితరులు పాల్గొన్నారు.




కందుకూరు మినీ మహానాడులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, మినీ మహానాడుకు హాజరైన టీడీపీ నాయకులు, కార్యకర్తలు

న్యూస్ బాక్స్

కందుకూరు నుంచి శ్రీశైలానికి ఆర్టీసీ బస్సు

కందుకూరు, మే 19(ఆంధ్రజ్యోతి): కందుకూరు నుంచి పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీశైలంకు నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్ సర్వీస్‌ను సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. ఎమ్మెల్యే స్వయంగా బసు నడిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నూతన సర్వీస్‌లను ప్రారంభించటం జరుగుతోందని, శ్రీశైలంకు నడుపుతున్న ఆర్టీసీ సర్వీస్‌ను ఈ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆర్టీసీ నూతన సర్వీస్ ప్రారంభానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు ఆర్టీసీ అధికారులు, తెలుగునాడు ఎంప్లాయిస్ యూనియన్ కార్మికులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో ఇంచార్జి మేనేజరు రాపూరి శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షుడు నార్నె రోశయ్య, తదితరులు పాల్గొన్నారు.

86 పొగాకు బేళ్ల తిరస్కరణ

కలిగిరి, మే 19(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి సోమవారం రైతులు మొత్తం 400 పొగాకు బేళ్లు అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో తొమ్మిది కంపెనీల ప్రతినిధులు పాల్గొని 314 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-65, ఆర్‌ఆర్-6, సీఆర్-10, జంపింగ్‌లాట్స్-5 కారణాలతో 86 బేళ్లు తిరస్కరించారు. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.200, సగటు ధర రూ.248.64గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి టి ఇసాక్‌స్వరన్‌దత్ తెలిపారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడి

కలిగిరి, మే 19(ఆంధ్రజ్యోతి): కలిగిరి, కొండాపురం మండలాల పరిధిలోని తూర్పు దూబగుంట-కొమ్మి అటవీప్రాంతంలో ఆదివారం రాత్రి పోలీసులు దాడి చేసి ఎనిమిది మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.42,180 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ ఉమాశంకర్ సోమవారం తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

● కొండాపురం : మండలంలోని ఆదిమూర్తిపురంలో పేకాట స్థావరంపై సోమవారం పోలీసులు దాడి చేశారు. పోలీసుల కథనం మేరకు.. గ్రామంలోని ఎస్సీ కాలనీలో పాఠశాల వెనుకవైపున పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో ఇన్‌చార్జి ఎస్‌ఐ ఉమాశంకర్, పోలీసులు దాడి చేశారు. ఈదాడిలో ఆరుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.2700 స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జి ఎస్‌ఐ ఉమాశంకర్ తెలిపారు.

కొండయ్య మృతికి సంతాపం

బిట్రగుంట, మే 19(ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నేత గడ్డె కొండయ్య(65) మృతికి టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు సంతాపం తెలిపారు. బోగోలు మండలం ఏబీకండ్రి పంచాయతీకి చెందిన టీడీపీ నేత, మాజీ జేపీగూడూరు నీటి సంఘం అధ్యక్షుడు కొండయ్య ఆదివారం మృతి చెందగా సోమవారం ఆయన స్వగ్రామంలో జరిగిన అంత్యక్రియల్లో టీడీపీ నేతలు పాల్గొన్ని పూలమాలలు వేసి నివాళర్పించారు. ఈ కార్యక్రమంలో కే.వెంకటేశ్వరరెడ్డి, ఎల్.సుధీర్‌బాబు, వై.వెంకటేశ్వర్లురెడ్డి, పీ.సుబ్బారావు, ఏ.ఆదిశేషయ్య, బీ.మాధవ, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు. అలాగే ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

చినుకు రాలితే రోడ్లు జలమయం



కావలిరూరల్ : సినిమాహాల్ రోడ్డులో నిల్వ చేరిన వర్షపు నీరు



కావలిరూరల్ : తీగల సపోర్టుతో వేలాడుతున్న రోడ్డుపై కూలిన విద్యుత్ స్తంభం



లింగసముద్రం : ఆర్‌అండ్‌బీ రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

కావలి రూరల్, మే 19(ఆంధ్రజ్యోతి): చినుకు రాలితే కావలి పట్టణంలోని రోడ్లన్నీ వర్షపు నీటి నిల్వలతో జలమయమవుతోన్నాయి. సోమవారం కురిసిన చిన్నపాటి వర్షానికి పట్టణంలోని లత థియేటర్, వెంకటేశ్వర థియేటర్, బ్రిడ్జి సెంటర్, ముసునూరు ఆంజనేయస్వామి ఆలయం, వెంగళరావునగర్ బోర్డు తదితర ప్రాతాల్లో వర్షపు నీరు, మురుగు నీరు ఏకమై రోడ్లపై ప్రవహించింది. దీంతో పట్టణ ప్రజలు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

విరిగిన విద్యుత్ స్తంభం

కావలి పట్టణంలోని వాయునందనప్రెస్ వీధిలో సోమవారం తెల్లవారుజామున విద్యుత్ స్తంభం విరిగిపడింది. రాత్రి సమయం కావడం, ఆ సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో త్రుటిలో పెనుప్రమాదం తప్పింది. నేలకొరిగిన విద్యుత్ స్తంభం చుట్టూ ఉన్న నివాసాలపై పడకుండా తీగల మోపున వేలాడడం చూసి స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. దెబ్బతిని కూలేందుకు సిద్ధంగా ఉన్న ఈ విద్యుత్ స్తంభంతో ప్రమాదం పొంచి ఉందన్న విషయాన్ని స్థానికులు అనేక దఫాలు విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సుమారు 30 నుంచి 40 ఏళ్ల క్రితం నాటి స్తంభాలు కావడంతో అవి ప్రమాదపుటంచున ఉన్నాయి. తెల్లవారు జామున వీచిన గాలులు, చిన్నపాటి వర్షానికే స్తంభం విరిగి పడడంతో స్థానికులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను తొలగించి నూతన స్తంభాలు ఏర్పాటు చెయ్యాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

40.2 మి.మీటర్ల వర్షపాతం నమోదు

కొండాపురం : మండల పరిధిలో సోమవారం 40.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయిందని రెవెన్యూ అధికారులు తెలిపారు. కొద్ది రోజులుగా భానుడు తన ప్రతాపాన్ని చూపుతుండటంతో మండల ప్రజలు ముఖ్యంగా చిన్నారులు, పెద్దలు అల్లాడిపోయారు. ప్రస్తుతం రోజంతా చిరుజల్లులు కురుస్తూ వాతావరణం చలబడడంతో ప్రజలు కాస్త ఉపశమనం చెందారు. అలాగే పొలాల దుక్కులకు రైతులు సిద్ధమయ్యారు.



జలదంకి : భారీవర్షంతో జమ్మలపాలెం చెరువులోకి చేరిన వర్షపునీరు

జలదంకిలో భారీ వర్షం

జలదంకి : మండలంలో ఆదివారం అర్ధరాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో వేసవితాపంతో అల్లాడుతున్న ప్రజలు ఉపశమనం పొందారు. సాగులో ఉన్న పలు రకాల పంటలకు ఈ వర్షం ఎంతో మేలు చేసిందని రైతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం ఉదయాన్నే రైతులు పొలాల్లోకి వెళ్లి ఆరుతడి, మెట్టపంటల్లో నిలిచిన వర్షపునీటిని బయటకు పంపించారు. పండ్ల తోటలు, కూరగాయలు సాగు చేసే రైతులకు మాత్రం ఈ వర్షం వల్ల కొంత మేర నష్టం ఉంటుందని రైతులు అంటున్నారు. ఈ ఏడాది రెండో పంటకు కావలి కాలువకు సాగునీరు ఇవ్వడంతో రైతులు పోసిన వరినారుమళ్లకు ఇబ్బంది లేకుండా అరకొరగా ఉన్న సాగునీటి చెరువులు, వాగులు, వంకల్లో జలకళ సంతరించుకుంది.

ఓ మోస్తరు వర్షం

లింగసముద్రం : బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనంతో మండలంలోని పలు గ్రామాలలో ఓ మోస్తరు వర్షం కురిసింది. సోమవారం తెల్లవారుజామున 4 నుంచి ఉదయం 8 గంటల వరకు ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. మండలంలో 16.2 మి.మీ వర్షపాతం నమోదైనట్టు అధికారులు తెలిపారు. ఈ వర్షానికి మొగిలిచెర్ల, పెదపవని, వీఆర్ కోట, లింగసముద్రంతో పాటు పలు గ్రామాలలోని వీధులు జలమయమయ్యాయి. ముఖ్యంగా లింగసముద్రంలోని మీసేవా కేంద్రం పక్కనే ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డుపై వర్షపు నీరు రోడ్డుపై నిలవడంతో వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ వర్షం పత్తి పైరుకు, జొన్నమేతకు మేలు చేకూర్చిందని రైతులు తెలిపారు.

మున్సిపాలిటీ స్థలానికి దేవదాయ శాఖ లీజు వేలం తగదు

కందుకూరు, మే 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో అంకమ్మ దేవాలయానికి వెనుక ఉన్న మున్సిపాలిటీ స్థలంలో గదులు నిర్మించుకుని అద్దెలకు ఇచ్చేలా దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 24న బహిరంగ వేలం నిర్వహిచనుండడం శోచనీయమని, తక్షణం ఆ వేలంను నిలిపివేయాలని న్యాయవాది పెట్లూరి మురళి, పలువురు ఆలయ ఆచారస్తులు సోమవారం సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజకు, మున్సిపల్ కార్యాలయంలో వినతిపత్రాలు అందజేశారు. అంకమ్మ దేవాలయం వద్ద ఆలయానికి ఉన్నది 1.52 ఎకరాల స్థలం కాగా మిగిలినది మున్సిపాలిటీ స్థలమని, ఆలయం పోను మిగిలిన ఖాళీస్థలంలో వాణిజ్య సముదాయాలు నిర్మిస్తే ఆలయానికి వచ్చే భక్తులకు అసౌకర్యం కలుగుతుందని తక్షణం ఆ ఆలోచనను విరమించుకోవాలని కోరారు. ఆలయ తిరుణాళ్ల, వివిధ పర్వదినాల సమయంలో జరిగే పార్వేట మహోత్సవానికి వేలాదిగా భక్తులు తరలివస్తారని, ఈ స్థితిలో భక్తుల సౌకర్యార్థం ఖాళీ స్థలాన్ని అలాగే వదిలేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు గతంలో మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం కూడా చేసి ఉన్నారని తెలిపారు.

కావలిలో తిరంగా ర్యాలీ



కూటమి నేతలు, అధికారులు నిర్వహిస్తున్న తిరంగా ర్యాలీ

కావలి, మే 19(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా సోమవారం రాత్రి కావలి పట్టణంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక గుర్రం పెట్రోల్ బంకు నుంచి ఐకాన్‌సెంటర్ వరకు వివిధ శాఖల అధికారులు, కూటమి నేతలతో కలిసి ఈ ర్యాలీ కొనసాగించారు. ఈ ర్యాలీలో ఎమ్మెల్యేతోపాటు ఆర్డీవో ఎం. సన్నీవంశీ కృష్ణ, డీఎస్పీ పీ.శ్రీధర్, మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్, తహసీల్దార్ పీ. శ్రావణ్ కుమార్, ఎమ్పీడీవో సీహెచ్. శ్రీదేవితోపాటు వివిధశాఖల అధికారులు, మాజీ సైనికులు, ప్రజలు జాతీయ జెండాల తో జయహో భారత మాత అంటూ నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. ఉగ్రవాదుల దాడిలో అసువులు బాసిన భారతీయులకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతూ భారతీయుల యువత దేశరక్షణకు ముందుండాలన్నారు.

రూ.2.24 కోట్లతో కేజీబీవీ అభివృద్ధి

లింగసముద్రం, మే 19(ఆంధ్రజ్యోతి): లింగసముద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సుమారు రూ.2.24 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు. మూడేళ్ల క్రితం ఈ విద్యాలయంలో ఇంటర్మీడియట్‌ను ప్రారంభించారు. దీంతో తరగతుల నిర్వహణ, వసతికి ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో ఇంటర్ విద్యార్థినుల కోసం డార్మెట్రీ, తరగతి గదుల నిర్మాణం కోసం కూటమి ప్రభుత్వం రూ.1,27,28,830 మంజూరు చేసింది. అలాగే నాడు-నేడు రెండవ విడత ఈ ప్రాంగణంలో చేపట్టి అసంపూర్తిగా నిర్మించిన 8 అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తి చేసేందుకు మరో రూ.96 లక్షలు మంజూరు చేసింది. దీంతో మొత్తం రూ.2,23,82,830లతో చేపట్టనున్న పనుల కోసం టెండర్లు పూర్తికావడంతో కాంట్రాక్టరు అగ్రిమెంటు కూడా చేసుకున్నట్లు తెలిసింది. రూ.1,27,82,830లతో గ్రౌండ్ ఫ్లోర్‌లో 3 తరగతి గదులు, మొదటి అంతస్తులో డార్మెట్రీ కోసం 3 గదులు న్మిర్మిస్తామని సమగ్ర శిక్ష అభియాన్ ఏఈ ఎన్ మస్తానయ్య తెలిపారు. అలాగే రూ.96 లక్షలతో అసంపూర్తిగా ఉన్న 8 అదనపు తరగతి గదుల నిర్మాణాలను పూర్తి చేస్తామని ఆయన తెలిపారు. ఇంకా అవకాశం ఉంటే కేజీబీవీ విద్యాలయం పైన 10 ఏళ్ల క్రితం అసంపూర్తిగా నిలిచిన గదుల నిర్మాణాలను కూడా పూర్తి చేస్తామన్నారు. ఈ పనులను 9 నెలల్లో పూర్తి చేస్తామని చెప్పారు.

మన్నేటికోట సర్పంచుపై దాడి

ఉలవపాడు, మే 19(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మన్నేటికోట గ్రామ సర్పంచు పులివర్తి బసవయ్యనాయుడుపై అదే గ్రామానికి చెందిన వేజర్ల విజయ్‌కుమార్ కత్తితో దాడి చేసినట్లు బాధితుడు ఆరోపించారు. సర్పంచు తెలిపిన వివరాల మేరకు.. సోమవారం రాత్రి 9 గంటల సమయంలో తాను ఇంట్లో ఉండగా విజయ్‌కుమార్ బయటకు పిలిచి అసభ్య పదజాలంతో మాట్లాడుతూ ఉన్న పలంగా కత్తితో దాడి చేయబోగా అక్కడే ఉన్న గ్రామంలోని కొందరు యువకులు అడ్డుకొని దేహశుద్ధి చేశారని, వెంటనే 100కు డయల్ చేసి సమాచారం అందించినట్లు చెప్పారు. దీనిపై పోలీసులను వివరణ కోరగా.. అందిన సమాచారం మేరకు మన్నేటికోట గ్రామంకు వెళ్లి విచారిస్తున్నామని, పూర్తి సమాచారం తెలియాల్సి ఉందన్నారు.

మరమ్మతులకు నోచని చేతి పంపులు!

● ప్రజలకు తప్పని అవస్థ

● శ్మశాన వాటికల్లోనూ మంచినీటికి ఇక్కట్లు



ఇబ్రహీంపేట శ్మశాన వాటికలో శిథిలావస్థలో చేతిపంపు

బిట్రగుంట, మే 19(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలోని పలు ప్రాంతాల్లో చేతి పంపులు మరమ్మతులకు గురవడంతో ప్రజలు మంచినీటికి ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా శ్మశాన వాటికల్లో ఏర్పాటు చేసిన చేతిపంపులు మరమ్మతులకు నోచుకోక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్నిచోట్ల సకాలంలో మరమ్మతులు చేయకపోవడంతో అవి శిథిలావస్థకు చేరుకుని ఎందుకూ పనికిరాకుండా పోతున్నాయి. ఉప్పు, జవ్వనీటి కారణంగా బోరు, లోపల పైపులు దెబ్బతిన్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. విశ్వనాథరావుపేట పంచాయతీ ఇబ్రహీంపేటలోని శ్మశానవాటికలో చేతిపంపు మరమ్మతులకు గురై ఏడాది కాలం గడుస్తున్నా పట్టించుకున్నే నాథుడు లేడు. గ్రామస్థులు కర్మక్రతువులు చేసుకోవాలంటే నీరు లేక అవస్థలు పడుతున్నారు. ఈ విషయం పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకుపోయినా ఎటువంటి చర్యలు చేపట్టలేదని స్థానికులు వాపోతున్నారు. రామస్వామిపాలెంలోని దళిత, గిరిజన కాలనీ వాసులే కాకుండా విశ్వనాథరావుపేటలోని కొన్ని కుటుంబాలకు సంబంధించిన శ్మశాన వాటికలో చేతి పంపే ఆధారం. అది మరమ్మతులకు గురై ఆరు నెలలు కావస్తున్నా అధికారులు పంటించుకోలేదు. ఓ పక్క మండుతున్న ఎండలు, మరో పక్క పనిచేయని చేతిపంపులతో ప్రజలు తీవ్ర ఇబ్బ ందులు ఎదుర్కోవాల్సి పరిస్థితి నెలకొంది. బోగోలు పాతహరిజనవాడలో బోరు మరమ్మతులకు గురవడంతో స్థానికులు అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా ఫలితం లేదు. దీంతో ఆ చేతిపంపు శిథిలావస్థకు చేరింది. అదే విధంగా విశ్వనాథరావుపేట పంచాయతీ కొత్తూరు గ్రామ శ్మశాన వాటికలో చేతిపంపు మరమ్మతులకు గురికావడంతో కర్మక్రతువులు చేసుకునేందు వచ్చిన వారు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ప్రజల పట్ల కొందరు మండల అధికారులు వ్యవహరిస్తున్న తీరును ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామని స్థానికులు తెలిపారు. శ్మశాన వాటికల్లో చెడిపోయిన చేతిపంపులకు మరమ్మతులు చేయించాలన్న ఆలోచన లేకపోవడం బాధాకరమని జైభీం అంబేద్కర్ సేవాదళ్ వ్యవస్థాపకుడు బత్తుల రవిచంద్ర అన్నారు.

పుచ్చలపల్లి సుందరయ్యకు ఘన నివాళి



కావలి : సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నేతలు

కావలి, మే 19(ఆంధ్రజ్యోతి): కామ్రేడ్ పుచ్చలపల్ల సుందరయ్య 40 వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం కావలి సీపీఎం కార్యాలయంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సీపీఎం నేత పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ సుందరయ్యలేని లోటు వామపక్ష ఉద్యమాలలో స్పష్టంగా కనిపిస్తోందన్నారు. దక్షిణభారత మార్కిస్ట్ పార్టీ నిర్మాత, బడుగుబలహీన వర్గాల ఆశాజ్యోతి అయిన సుందరయ్య ప్రజల, కార్మికుల సమస్యల పరిష్కారం కొరకు అలుపెరగని పోరాటాలు నడిపారన్నారు. పార్లమెంట్‌లో ప్రజా ఉద్యమాలపై గళమెత్తారన్నారు. ఆయన ఇచ్చిన మార్కిస్ట్ పార్టీ జెండాను పట్టుకుని ఆయన ఆశయాలను సాధించేందుకు కార్యకర్తలు పోరాటాలు కొనసాగించాలన్నారు. ఈ సమావేశంలో సీపీఎం నేతలు టీ సుబ్బరాయశర్మ, ఎస్.వెంకయ్య, పీ.తిరిపాలు, జేవీవీ నాయకులు ఆకుల రమణయ్య, హరినారపరెడ్డి, యూటీఎఫ్ నాయకులు బీ.శ్రీదేవి, కల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

గుడ్లూరు : ప్రజానాయకుడు, దక్షిణ భారతదేశ కమ్యునిస్టు ఉద్యమ నిర్మాత, కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి కార్యక్రమాన్ని గుడ్లూరు శివాలయం వీధిలో సోమవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు మల్లికార్జున, గంటెనపల్లి వెంకటేశ్లర్లు, మద్దిశెట్టి జాలయ్య, దామా కృష్ణయ్య, మెగిలిశెట్టి వెంకటేశ్వర్లు, సిద్దయ్య, కొప్పోలు నారాయణ, కొమరగిరి అంజయ్య, సుంకరి విజయలక్ష్మి, నేలటూరి తిరుపాలు, పరుసు నాగరాజు, వల్లెపు విజయ, కోటమ్మ పాల్గొన్నారు.

బిట్రగుంట : నేటితరం పుచ్చలపల్లి సుందరయ్యను ఆదర్శంగా తీసుకోవాలని సీపీఎం సీనియర్ నాయకులు తుమ్మల వెంకయ్య, సీఐటీయు మండల కార్యదర్శి చల్లానరహరి అన్నారు. బోగోలు మండలం ఇబ్రహీంపేటలోని పార్టీ కార్యాలయంలో సుందరయ్య వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళర్పించారు. ఈ కార్యక్రమంలో కామ్రేడ్‌లు ఎస్‌కే.అన్వర్ భాషా, కార్మికసంఘ నేత బాదుల్లా, రామయ్య, వెంకటేశ్వర్లు, బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ అధ్యక్షులు షేక్. నూరుద్దీన్. వినయ్, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి జమ్మలపాలెం సర్పంచు

జలదంకి మే 19(ఆంధ్రజ్యోతి): వింజమూరులో సోమవారం జరిగిన మినీ మహానాడులో వైసీపీకి చెందిన జమ్మలపాలెం సర్పంచు బుర్రి శ్రీవేణి టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన ఆమెకు ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కాగా మండలంలోని 17 పంచాయతీల నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వందలాదిగా మినీ మహానాడుకు తరలివెళ్లారు.

జాతీయ స్కేటింగ్‌లో జిల్లాకు పతకాలు



ర్యాంకు సాధించిన నందని (మధ్యలో అమ్మాయి)

నెల్లూరు(విద్య), మే 19 (ఆంధ్రజ్యోతి) : కేరళలో జరుగుతున్న జాతీయ స్థాయి ఓపెన్ ర్యాంకింగ్ స్కేటింగ్ పోటీల్లో జిల్లాకు చెందిన చిన్నాబత్తిన నందని 8వ ర్యాంక్ సాధించినట్లు రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.సుధీర్‌కుమార్‌రెడ్డి, కే.కామేష్ ఒక ప్రకటనలో తెలిపారు. 12 నుంచి 15 ఏళ్లలోపు విభాగంలో 1500 మీటర్ల విభాగంలో బంగారుపతకం, వెయ్యిమీటర్ల విభాగంలో వెండిపతకం, 500 మీటర్ల విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించిందని తెలిపారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన క్రీడాకారిణిని వారు అభినందించారు.

రేషన్ బియ్యం కోసం మహిళల నిరసన


తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న మహిళలు

సీతారామపురం, మే 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సీతారామపురం గ్రామ పంచాయతీ పరిధిలోని రాజుగారికాలనీ, కురవవీధి, రజక కాలనీ, తోటకాలనీలో ఎండియం వాహనం ద్వారా రేషన్ సరుకులను ఇవ్వడంలేదని సోమవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట మహిళలు నిరసన వ్యక్తం చేశారు. సంబంధిత మండల అధికారులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకపోయిందని వాపోయారు. అనంతరం తహసీల్దారుకు వినతిపత్రం అందచేశారు.

సోమశిలకు 150 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అనంతసాగరం, మే 19 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి సోమవారం 150 క్యూసెక్కుల వరద నీరు చేరింది. పెన్నా క్యాచ్‌మెంట్ పరిధిలో కురిసిన వర్షానికి ఇన్‌ఫ్లో వచ్చినట్లు అధికారులు గుర్తించారు. నీటినిల్వ సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 45.977 టీఎంసీలు ఉన్నట్లు పేర్కొన్నారు. పెన్నా డెల్టాకు 4,300, ఉత్తర కాలువకు 100, దక్షిణ కాలువకు 50 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

జమున స్ఫూర్తికి నమూనా

కళాకారిణిగా, క్రీడాకారిణిగా, రచయిత్రిగా విభిన్న రంగాల్లో ఏకకాలంలో రాణిస్తున్నారు కావలికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయిని ఎం జమున. ఆరు పదులు దాటిన వయసులోనూ అంతులేని ఉత్సాహంతో ఆటల పోటీల్లో పాల్గొంటూ యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. దేశవిదేశాల్లో జరిగిన క్రీడల్లో రాణిస్తూ పతకాలు, పురస్కారాలు సొంతం చేసుకున్నారు. రచయిత్రిగా ఎన్నో వేదికలపై తన సాహితీ ప్రతిభను చాటడమేకాదు నృత్య కళాకారిణిగా ప్రముఖ ఆలయాల్లో ప్రదర్శనలిచ్చి శభాష్ అనిపించుకున్నారు. వయసు శరీరానికేగానీ మనసుకు కాదని నిరూపిస్తున్నారు ఈ నిన్నటితరం టీచరమ్మ.



ప్రతిభ PRATIBHA

- బహుముఖ ప్రజ్ఞాశాలి
- కళా, క్రీడా, సాహితీ రంగాల్లో ప్రతిభ
- జాతీయ, అంతర్జాతీయ వేదికలపై గుర్తింపు
- 65 ఏళ్ల వయసులోనూ అలుపెరగని ఉత్సాహం
- స్ఫూర్తిదాయకంగా టీచరమ్మ సేవలు


చంద్రబాబు నాయుడు నుంచి అవార్డు అందుకుంటున్న జమున

కావలిటౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి) : ఆర్మీలో హవాల్దార్‌గా పనిచేసే మొగిలిశెట్టి సుందరరావు, రంగనాయకమ్మ దంపతుల కుమార్తె జమున. తండ్రి జమ్మూలో పనిచేసేటప్పుడు అక్కడే పుట్టారు. చిన్న వయసులో వివాహం జరగడం, అనతి కాలంలోనే భర్త మరణించడంతో జమున తల్లితండ్రుల వద్దే పెరిగారు. బాల్య వివాహంతో ఆగిపోయిన విద్యను తండ్రి ప్రోత్సాహంతో కొనసాగించి ఎంఏ, ఎంఈడీ పూర్తి చేశారు. ఆ తర్వాత కావలి విశ్వోదయ బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయినిగా చేరారు. అంతేకాదు ఉన్నత విద్యను అభ్యసించే సమయంలోనే కళలు, క్రీడల్లోనూ రాణించారు. రచనా వ్యాసంగానికి పదునుపెట్టి అనేక జాతీయ స్థాయి పోటీల్లో రచయిత్రిగా విజయం సాధించారు.

● అంతర్జాతీయ క్రీడాకారిణిగా...

65ఏళ్ళ వయస్సు మీదపడినప్పటికీ జమున ఇప్పటికీ వివిధ దేశాల్లో జరిగే అంతర్జాతీయ వెటరన్ అథ్లెటిక్స్ క్రీడా పోటీల్లో సత్తా చాటుతున్నారు. హేమర్‌త్రో, జావెలిన్‌త్రో, డిస్కస్‌త్రో, లాంగ్‌జంప్ తదితర అంశాల్లో ప్రతిభ కనబరుస్తున్నారు. ఢిల్లీ, తమిళనాడు, పంజాబ్, మణిపూర్, డెహ్రాడూన్, వడోదర, త్రివేండ్రం వంటి నగరాల్లో జరిగిన జాతీయ పోటీలతోపాటు మలేషియా, సింగపూర్, స్పెయిన్, ఆస్ట్రేలియా తదితర దేశాల్లో నిర్వహించి న అంతర్జాతీయ పోటీల్లోనూ ప్రతిభ కనబరిచి 58 బంగారు, 30 కాంస్య పతకాలు సాధించారు. ఫిన్లాండ్ వరల్డ్ స్పోర్ట్స్ మీట్‌కు తెలుగు రాష్ట్రాల నుంచి అర్హత సాధించిన ఏకైక మహిళగా గుర్తింపు పొందారు.

● కూచిపూడిలో ప్రతిభ

కూచిపూడి తాండవ నృత్యంలో జమున ప్రతిభను చాటారు. వివిధ దేవతామూర్తుల వేషధారణలో తిరుమల తిరుపతి దేవస్థానం, కాణిపాకం, కూచిపూడి గ్రామం (గోదావరి జిల్లా) నాసిక్, వాడపల్లి రాజమండ్రి, తదితర ప్రాంతాల్లో నృత్య రూపకాలు ప్రదర్శించారు. జైజవాన్ కల్చరల్ అకాడమీని స్థాపించి చిన్నారులకు శిక్షణ ఇస్తున్నారు. శిష్యబృందంతో అనేక రాష్ట్రాల్లో ప్రదర్శనలిచ్చి ప్రముఖుల అభినందనలు అందుకున్నారు.

● సామాజిక సేవలోనూ..

రెడ్‌క్రాస్ జీవిత కాల సభ్యురాలిగా సంస్థ నిర్వహించే సేవా కార్యక్రమాల్లో జమున విస్తృతంగా పాల్గొంటారు. రక్తదాన శిబిరాలు, విపత్తు సహాయక కార్యక్రమాల్లో సేవలు అందిస్తుంటారు. రెడ్‌క్రాస్ జాతీయ కౌన్సిలర్‌గా అమృత్‌సర్, ఒడిశా, హైద్రాబాద్ తదితర ప్రాంతాల్లో నిర్వహిం చిన శిబిరాల్లో పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణకు జన విజ్ఞాన వేదిక ద్వారా ప్రజా చైతన్య కార్యక్రమాల్లో పాలుపంచుకుంటూ ఉంటారు. ప్రజల్లో మూఢ నమ్మకాలు పారద్రోలేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ప్రశంసలు, పురస్కారాలు

- 2012 అనంతపురంలో జరిగిన రికార్డ్స్ కవి సమ్మేళనంలో పాల్గొని ఉత్తమ కవిగా అవార్డు పొందారు.
- 2017 కరీంనగర్‌లో కృషి కవిత ఆధ్వర్యంలో 1000 మంది కవులతో జరిగిన ప్రపంచ కవి సమ్మేళనంలో పాల్గొని బహుమతి సాధించారు.
- 2018లో నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన సాహితీ సదస్సులో ఉత్తయ రచయితగా అవార్డు పొందారు.
- కృష్ణా జిల్లా అవనిగడ్డలో జరిగిన జాతీయ సహస్ర కవి సమ్మేళనం లో ప్రతిభ కనబరచడంతో అప్పటి డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్ నుంచి పురస్కారం అందుకున్నారు.
- తిరుపతిలో చదవలవాడ రమణమ్మ విభిన్న రంగాల ప్రతిభావం తుల జాతీయ ఉత్తమ మహిళ అవార్డును సీబీఐ మాజీ జేడీ లక్ష్మీ నారాయణ నుంచి అందుకున్నారు.
- మూడు సార్లు గిన్నిస్ బుక్ ఆఫ్ అవార్డ్స్, మూడు సార్లు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సాధించారు.


నృత్య ప్రదర్శన అనంతరం శిష్య బృందంతో జమున



తానా ఉత్సవాల్లో పురస్కారం అందుకుంటూ...

యువతలో సేవాభావం ఉండాలి

విలువలతో కూడిన విద్యతోపాటు యువత సేవాభావం కలిగి ఉండాలి. సమాజంలో అందరూ బాగుండాలన్న సంకల్పంతో ముందుకు సాగాలి. పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి. జీవితంలో కష్టసుఖాలు సహజం. ఆటుపోట్లను ఎదుర్కొని క్రమశిక్షణ, పట్టుదలతో లక్ష్యాన్ని చేరుకోవాలి. మనదగ్గరున్న విద్య, కళతో సమాజానికి ఏదైనా చేయాలన్న తపన ఉండాలి.

\- జమున

ఆలిండియా ఓపెన్ చెస్ విజేత శ్యామ్

నెల్లూరు(విద్య), మే 19 (ఆంధ్రజ్యోతి): ఆలిండియా ఓపెన్ చెస్ పోటీల్లో చెన్నైకి చెందిన ఆర్.శ్యామ్ చాంపియన్‌గా నిలిచాడు. రాష్ట్ర చెస్ అసోసియేషన్, శ్రీ ఆనంద్ చెస్ వింగ్స్ అకాడమీల ఆధ్వర్యంలో నగరంలోని గొలగమూడి రోడ్డులో గల ఫన్ పార్క్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ పోటీల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన అంతర్జాతీయ ఫిడే రేటింగ్, ర్యాంకింగ్ క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో చెన్నైకు చెందిన ఆర్.శ్యామ్ ప్రథ మస్థానం, గుంటూరు చెందిన డీ.ధ్రువేష్ ద్వితీయస్థానం, విజయవాడకు చెందిన వీ.అభిరామ్ తృతీయస్థానం సాధించారు. అలాగే తమిళనాడుకు చెందిన ఆకాష్ నాలుగో స్థానం, విజయవాడకు చెందిన శివపవన్‌తేజ ఐదో స్థానం సొంతం చేసుకున్నారు. ఫన్‌పార్క్ ఎండీ సాయి పొత్తూరి విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర చెస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై.సుమన్, ఫన్‌పార్క్ ఈడీ సంయుక్త, జేసీఐ ప్రతినిధులు మోహన్ కిషన్, దిశ, మహాలక్ష్మి, ప్రమోద్‌కుమార్, శ్రీఆనంద్ వింగ్స్ చెస్ అకాడమీ డైరక్టర్ ఎం.గోపీనాథ్, టోర్నీ నిర్వాహకులు డాక్టర్ మధుసూదన్, ఎం.సుమంత్, తదితరులు పాల్గొన్నారు.


చెస్ పోటీల విజేతలతో టోర్నీ నిర్వాహకులు

కారు ఢీకొని వృద్ధుడి దుర్మరణం

● పొలాల్లో కారు వదిలి డ్రైవర్ పరార్


వీర రాఘవయ్య మృత దేహం

కలిగిరి, మే 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మవారిపాలెం వద్ద కలిగిరి-సంగం రహదారిపై సోమవారం కారు ఢీకొన్న ఘటనలో గ్రామానికి చెందిన కాపా వీరరాఘవయ్య(65) దుర్మరణం చెందాడు. గ్రామస్థుల వివరాల మేరకు.. వీరరాఘవయ్య కలిగిరి నుంచి పనులు ముగించుకొని కూరగాయలు సామానులు తీసుకొని బస్సులో గ్రామం వద్ద దిగాడు. బస్సు ముందుకు వెళ్లగా రోడ్డు దాటి గ్రామంలోకి వచ్చేక్రమంలో ఈమార్గంలో సంగం నుండి కలిగిరివైపు వస్తున్న కారు వేగంగా ఢీకొట్టింది. ఈఘటనలో వీరరాఘవయ్య తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయాన్ని గమనించిన గ్రామస్థులు కారును వెంబడించడంతో కారులో ఉన్న వ్యక్తి తప్పించుకునే ఉద్దేశ్యంతో కలిగిరి శివార్లలోని పొగాకు బోర్డు సమీపంలో పొలాలవైపు వెళ్లడంతో కారు బురదలో కూరుకుపోయింది. గ్రామస్థులు కారు దగ్గరకి వచ్చేలోపు కారులో ఉన్న వ్యక్తి పరారయ్యాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సీఐ వెంకటనారాయణ, ఎస్ఐ ఉమాశంకర్‌లు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. గ్రామంలో అందరితో కలుపుగోలుగా ఉండే వ్యక్తి ప్రమాదంలో మృతి చెందడంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

అదుపు తప్పి బోల్తా పడిన ట్రాక్టర్

ముగ్గురికి గాయాలు

సీతారామపురం, మే 19 (ఆంధ్రజ్యోతి): అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తా పడి ముగ్గురికి గాయాలైన సంఘటన పోరుమామిళ్ల- సీతారామపురం ఘాట్ రోడ్డు జాతీయరహదారిపై సోమవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు... సీతారామపురం మండలం నుంచి దిబ్బ ఎరువు లోడుతో టేకూరుపేటకు బయలుదేరిన ట్రాక్టర్ జాతీయ రహదారిపై వెళ్తుండగా ట్రాలీ రిమ్ము విరగడంతో అదుపుతప్పి బోల్తా పడింది. ట్రాక్టర్లో ప్రయాణిస్తున్న ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి.

కార్డు కష్టాలు!

● చేయితడిపితేనే పని? ● లేకపోతే ప్రదక్షిణలే!

నెల్లూరు (హరనాథపురం), మే 19(ఆంధ్రజ్యోతి) : దేవుడు వరమిచ్చినా...పూజారి కరుణించనట్టు తయారైంది కొత్త రైస్ కార్డుల మంజూరు పరిస్థితి. ప్రభుత్వం కొత్తరైస్ కార్డుకు దరఖాస్తులు స్వీకరిస్తామని ప్రకటించిన తరువాత ప్రజల్లో ఆనందం వ్యక్తమైంది. అంతలోనే ఆన్‌లైన్, ధ్రువపత్రాల సమర్పణ కష్టాలతో ఆ ఆనందం ఆవిరైపోతోంది. పేద కుటుంబాలకు కొండంత అండ రేషన్ కార్డు. సంక్షేమ పథకాలు పొందాలంటే ఆ కార్డు తప్పని సరైంది. కొత్త రైస్ కార్డు దరఖాస్తులకు పెట్టిన నిబంధనలతో ప్రజలు సచివాలయాల చుట్టూ పదేపదే తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. గత ప్రభుత్వ హయాంలో తప్పుల తడకగా ఉన్న హౌస్ మ్యాపింగ్‌ను ఇప్పుడు దరఖాస్తుల స్వీకరణకు ప్రామాణికంగా తీసుకోవటంతో ప్రజలకు తిప్పలు తప్పటం లేదు. అందులో కుటుంబ సభ్యుల మ్యాపింగ్ ఒకేచోట జరగకపోతే వారి దరఖాస్తులు ఆన్‌లైన్ కావటం లేదు. దరఖాస్తుకు జతచేయాల్సిన పత్రాలు సేకరించటం ప్రజలకు అతి కష్టంగా మారింది.

ధ్రువీకరణ పత్రాలతో చిక్కులు

ప్రభుత్వం కొత్తరైస్ కార్డు జారీకి అర్హత ప్రమాణాలు, అవసరమైన డాక్యుమెంట్లు సమర్పించాలని పేర్కొంది. దరఖాస్తు దారు కుటుంబ వార్షిక ఆదాయం రూ. 1.2 లక్షలలోపు ఉండటంతోపాటు ఆరు దశల ప్రమాణాలను కలిగి ఉండాలని స్పష్టం చేసింది. గ్రామ వార్డు సచివాలయాల్లో హౌస్ హోల్డ్ మ్యాపింగ్‌లో నమోదు కావటంతోపాటు కుటుంబ సభ్యులలో ఎవరికీ రైస్‌కార్డు ఉండకూడదని పేర్కొంది. ఆధార్ కార్డు, వివాహ ధ్రువీకరణకు రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి సర్టిఫికెట్, పెండ్లి ఫోటోలు తప్పని సరి చేసింది. అయితే చదుకున్న వారికి విద్యార్హత సర్టిఫికెట్ సరిపోతుండగా, నిరక్షరాస్యులకు దంత వైద్యులు నిర్ధారించాల్సి ఉంది. దంత వైద్యులు... దరఖాస్తుదారులు, వారి కుటుంబ సభ్యుల జ్ఞాన దంతాలను పరీక్షించి, వాటి ఆధారంగా మేజర్, మైనర్‌గా వయసును నిర్ధారిస్తారు. అయితే ప్రభుత్వ వైద్యశాలలో దంత వైద్యులు సర్టిఫికెట్లు ఇవ్వకపోవటంతో ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డాయి.



చేయితడిపి.. తొందరగా..

రైస్‌కార్డు దరఖాస్తు ఉచితమని ప్రభుత్వం ప్రకటించింది. కానీ, కొందరు సచివాలయాల సి బ్బంది మాత్రం కార్డుకు. రూ. 300 నుంచి రూ.500 డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. డబ్బు ఇవ్వకపోతే ఇప్పుడు కాదు మళ్లీరావాలని పదేపదే దరఖాస్తుదారులను తిప్పుతున్నట్లు ఆరోపణలున్నాయి. వివాహ, వయసు ధ్రువీకరణ పత్రాలు పొందటం ఒక సమస్య అయితే సచివాయాల సిబ్బంది డబ్బు డిమాండ్‌తో ప్రజలు విసిగి వేసారి పోతున్నారు. హౌస్ హోల్డ్ మ్యాపింగ్, వివాహ సర్టిఫికెట్ నిబంధన తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. అదేవిధంగా బయోమెట్రిక్‌తోపాటు ఓటీపీ ఆప్షన్ ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

విద్యుదాఘాతానికి యువకుడి దుర్మరణం

వింజమూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సోమవారం జరుగుతున్న మినీ మహానాడుకు వచ్చి బస్టాండు సెంటర్‌లోని చిల్లర దుకాణం వద్ద విద్యుదాఘాతానికి గురైదుత్తలూరు మండలం భైరవరం గ్రామానికి చెందిన బోగిరెడ్డి చిన్నఓబుల్ రెడ్డి (29) మృతి చెందారు. ఉదయం నుంచి కురుస్తున్న వర్షానికి దుకాణం పైకప్పులకు విద్యుత్ సరఫరా అవుతోంది. ఈ విషయం తెలియక చిన్నఓబుల్ రెడ్డి పైపును తాకగా నే విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మహానాడు అనంతరం ప్రభుత్వాసుపత్రికి వెళ్లి మృతదేహాన్ని పరామర్శించి నివాళులర్పిం చారు. మృతుని కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చా రు. పార్టీ పరంగా ఆదుకుంటామని తెలిపారు.

గుప్తనిధుల ముఠా సభ్యుడి పట్టివేత

ఉదయగిరి, మే 19 (ఆంధ్రజ్యోతి): గుప్తనిధుల తవ్వకాల ముఠా సభ్యుడిని అటవీ శాఖ అధికారులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. రేంజ్ అధికారి బీఎస్ కుమారరాజా తెలిపిన వివరాల మేరకు.. వరికుంటపాడు మండలం తూర్పుబోయమడగల ఎస్టీ కాలనీకి చెందిన నల్లు అశోక్, మర్రిపాడు మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన రమేష్, గోపిలు దుర్గం కొండపై గుప్తనిధుల తవ్వకాల కోసం వెళుతుండగా తమ సిబ్బం ది పట్టుకునే ప్రయత్నం చేయగా రమేష్, గోపిలు పరార్ కాగా, నల్లు అశోక్ సిబ్బందికి చిక్కాడన్నారు. అతడిని రేంజ్ కార్యాలయా నికి తరలించామన్నారు.

షింగింగ్ స్టార్స్ అవార్డుకు చుండి స్కూలు విద్యార్థుల ఎంపిక

వలేటివారిపాలెం, మే 19(ఆంధ్రజ్యోతి): పదవ తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందించనున్న షింగింగ్ స్టార్స్ అవార్డుకు మండలంలోని చుండి మోడల్ స్కూల్‌లో చదివిన ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్స్‌పాల్ శ్రీవెంకటేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన విద్యార్థులు బోడా నవ్యశ్రీ 592, ప్రగడ రాజేష్ 591, మీసాల మనోజ్ఞ 591, వీరమోసు జయసంహిత 591, చెరువుపల్లి హంతివకసాయికోటి 591 మార్కులు సాధించారని తెలిపారు. వీళ్లందరూ మంగళవారం విజయవాడలో సీఎం చంద్ర బాబునాయుడు చేతుల మీదుగా అవార్డులు అందుకోనున్నట్లు తెలిపారు.

మెప్మా పీడీగా లీలారాణి బాధ్యతల స్వీకరణ



నెల్లూరు (హరనాథపురం) మే 19 (ఆంధ్రజ్యోతి) : మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్‌గా లీలారాణి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. లీలారాణి రాజంపేటలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పనిచేస్తూ ఇక్కడికి వచ్చారు. లీలారాణి గతంలో గూడూరు తహసీల్దారుగా పనిచేశారు. జిల్లాలో మెప్మా పీడీగా పనిచేస్తున్న రాధమ్మ చిత్తూరు జిల్లా మెప్మా పీడీగా నియమితులయ్యారు. సోమవారం రాధమ్మ నుంచి లీలారాణి బాధ్యతలు స్వీకరించారు.

అర్జీలకు పరిష్కారం చూపండి

● అధికారులకు కలెక్టర్ ఆనంద్ ఆదేశం

● పీజీఆర్ఎస్‌కు 385 వినతులు


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (హరనాథపురం) మే 19 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌లో ప్రజలు అందించే అర్జీలకు వెంటనే పరిష్కారం చూపాలని కలెక్టర్ ఓ. ఆనంద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కనభవన్‌లో వేదిక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, ప్రజలు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపించాలని ఆదేశించారు. పరిష్కరించలేని సమస్యలకు కారణాలను అర్జీదారులకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజలు 385 అర్జీలను అందజేశారు. వీటిలో ఎక్కువగా రెవెన్యూకు 170, మున్సిపల్ శాఖకు 30, సర్వేకు 32, పంచా యతీరాజ్ శాఖకు 23, పోలీసు శాఖకు 49, సివిల్ సప్లయిస్‌కు 17 అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో జేసీ కే.కార్తీక్, డీఆర్వో ఉదయభాస్కర్‌రావు, పలువురు జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

● అభిప్రాయ సేకరణ తప్పనిసరి

పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై ప్రజల నుంచి అభిప్రాయాలను తప్పనిసరిగా సేకరించాలని కలక్టర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాల్‌లో పీజీఆర్ఎస్ అర్జీలు, ఉపాధిహామీ, హౌసింగ్ తదితర అంశాలపై సబ్ కలెక్టర్, ఆర్డీవోలు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదారుల అభిప్రాయాలు తెలుసుకుని రిపోర్టు అందించాలని కోరారు. ఈ విషయమై ఎంపీడీవోలు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఉపాధి హామీ పనుల్లో వేగం పెంచాలని పేర్కొన్నారు. ప్రతివారం కనీసం 70 శాతం తగ్గకుండా పనులు జరిగేలా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పేదల ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేందుకు ప్రభుత్వం అదనపు ఆర్థిక సహాయాన్ని కూడా లబ్ధిదారుల ఖాతాలకు జమ చేసిందని, దశలవారీగా నిర్మాణాల్లో వేగం పెంచాలన్నారు. పీఎం సూర్యఘర్ యోజనను ఏర్పాటు చేసుకోవడంతో కలిగే లాభాలను ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆధార్‌కార్డులు లేని ఎస్టీలకు త్వరగా కార్డులు ఇప్పించేందుకు కృషి చేయాలని ఎంపీడీవోలను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్వో ఉదయభాస్కర్‌రావు, జడ్పీ సీఈవో విద్యారమ, హౌసింగ్, డ్వామా పీడీలు వేణుగోపాల్, గంగాభవాని, విద్యుత్‌శాఖ ఎస్ఈ విజయన్, సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటసుబ్బయ్య, ఐటీడీఏ పీవో మల్లికార్జునరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను విచారించి

న్యాయం చేస్తాం


ఫిర్యాదుదారుల సమస్యలను వింటున్న ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైం), మే 19 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌లో స్వీకరించిన ఫిర్యాదులపై విచారణ జరిపి న్యాయం చేస్తామని ఎస్పీ జీ కృష్ణకాంత్ పేర్కొన్నారు. నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం జరిగిన వేదిక కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా 97 మంది తమ ఫిర్యాదులు అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అందిన ఫిర్యాదుల వివరాలు...

- సోషల్ మీడియాలో వచ్చిన ప్రకటనలు నమ్మి సైదాపురం ప్రాంతానికి చెందిన ఓ మహిళ ఫ్రైండ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంది. ఆ యాప్ ద్వారా గుర్తుతెలియని వ్యక్తి పరిచయమయ్యాడు. ప్లాట్ల వ్యాపారం చేద్దామని నమ్మించి రూ.6,27,900 నగదును తనఖాతాలో వేయించుకొని ప్లాట్ల పత్రాలు అడగ్గా మోసం చేశాడని ఫిర్యాదు చేసింది. విచారించి న్యాయం చేయాలని ఆ మహిళ కోరింది.
- నగరంలోని బాలాజీనగర్‌కి చెందిన ఓ వ్యక్తి ఆర్థిక ఇబ్బందులతో రుణం కోసం ప్రయత్నిస్తుండగా హైదరాబాద్‌కు చెందిన పోలా కుమార్, చల్లా చంద్రమోహన్ పరిచయమయ్యారు. హాంకాంగ్‌లో ట్రేడింగ్ కంపెనీ వ్యాపారం ఉందని, రూ.కోటి పెట్టుబడి పెడితే 500 మిలియన్ డాలర్లు వస్తాయని నమ్మించారు. వారి మాటలు నమ్మి నగదు పెట్టుబడిగా పెట్టగా, తిరిగి డబ్బులు ఇవ్వకుండా, అడిగితే రౌడీలతో బెదిరిస్తున్నారని, న్యాయం చేయాలని వారు కోరారు.
- బాలాజీనగర్ ప్రాంతానికి చెందిన కొల్లూరు సన్నీ బుచ్చికి చెందిన ఓ మహిళను ప్రేమిస్తున్నాని, పెళ్లిచేసుకుంటానని నమ్మించి, తన కోర్కె తీర్చుకున్నాడు. పెళ్లి చేసుకోమని కోరితే ముఖం చాటేస్తున్నాడని, తనకు న్యాయం చేయాలని బాధితురాలు కోరింది.
- బాపట్లకి చెందిన మహేష్ కోవూరుకి చెందిన వ్యక్తికి ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి రూ.13 లక్షల నగదు తీసుకున్నాడు. ఉద్యోగం ఇప్పించకుండా నగదు ఇవ్వాలని కోరితే చంపేస్తానని బెదిరిస్తున్నాడని, న్యాయం చేయాలని కోరాడు.
- సౌత్‌మోపూరుకు చెందిన కృష్ణారెడ్డి నకిలీ కన్సల్టెన్సీ పెట్టి వేదాయపాలెంకి చెందిన ఓ యువకుడు, అతడి స్నేహితుడు వద్ద రూ.5 లక్షలు తీసుకున్నాడు. ఉద్యోగం ఇప్పించకుండా, నగదు తిరిగి ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నాడని, న్యాయం చేయాలని కోరారు.
- ఉలవపాడుకి చెందిన తన కుమారుడు రమీజు 2024లో మృతిచెందాడని, అది ప్రమాదం కేసుగా నమోదు చేశారని, తనకు కుమారుడి స్నేహితులపై అనుమానం ఉందని, లోతుగా దర్యాప్తు జరిపి న్యాయం చేయాలని బాధితురాలు కోరింది.